# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 27 సెప్టెంబర్ 2026 | సంపుటి: 10 | సంచిక: 262 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


**బీచును శుభ్రం చేసిన సీఎం భార్యాబిడ్డలు**



2

**భజన్ క్లబ్బింగ్ అనేది ఒక అద్భుతం**



2

## మాజీ ప్రధాని మన్మోహన్‌కు భారత రత్న ఇవ్వాలె





### ఢిల్లీలో ఆయన పేరుతో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలె

కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్

తెలంగాణ రాష్ట్ర కల సాకారం చేసిన ఘనత ఆయనదే!

ఆయన తెచ్చిన సంస్కరణలే దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించాయి

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (మనం బ్యూరో):** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కలను సాకారం చేసి ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మాజీ ప్రధాన మంత్రి డా.మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ ఢిల్లీలో విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. శనివారం మాజీ ప్రధాని మన్మోహన్ జయంతి సందర్భంగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్‌లో ఆయన విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సమయాల్లో రాజకీయాలకు అతీతంగా నిర్ణయం తీసుకోవాలని, మౌనమునిలా దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి మన్మోహన్ అని కొనియాడారు. దేశం గర్వించదగ్గ జాతిరత్నం డా.మన్మోహన్ సింగ్ అనీ, ఆయన స్ఫూర్తిని భావి తరాలకు అందించాలన్న ఉద్దేశ్యంతోనే విగ్రహం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రిజర్వు బ్యాంక్ గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా ఏ పదవి చేపట్టినా ఆ పదవులకు వన్నె తెచ్చారని గుర్తు చేశారు. దివంగత ప్రధాని పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన సమయంలో మన్మోహన్ సింగ్ తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలే దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేలా చేశాయని పేర్కొన్నారు. లిబరలైజేషన్, ప్రైవేటైజషన్ గ్లోబలైజేషన్, విధానాలు తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ అనీ, దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన

...మిగతా 2లో

## అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు

సర్ వ్యవహారాలపై ఆరోపణలకు వివరణలిచ్చిన సీఈసీ, కమిషనర్లు





**ఢిల్లీ, సెప్టెంబర్ 26:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (సర్)పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. నోటీసులు అందుకున్న ఓటర్లు.. అత్యవసరమైన సందర్భాల్లో తప్ప వ్యక్తిగత విచారణకు హాజరు కావాల్సిన అవసరం లేదని తెలిపింది. 'సర్' కోసం ఫారం-6కు జతచేసిన డిక్లరేషన్ ను సుప్రీంకోర్టు సమర్థించిందని పేర్కొంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు డా.సుఖ్‌బీర్ సింగ్ సంధూ, డా.వివేక్ జోషి శనివారం ఢిల్లీలోని ఈసీ ప్రధాన కార్యాలయంలో భేటీ అయ్యారు. 'సర్'పై భిన్నాభిప్రాయాల అంశం తీవ్ర దుమారం రేపిన వేళ.. ఈ భేటీ కీలక ప్రాధాన్యం సంతరించుకుంది. సమావేశానంతరం ఎన్నికల సంఘం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శికి ఎన్నికల కమిషనర్లు రాసిన లేఖ.. ఈసీ లేదా ఐటీ విభాగాల విధానపరమైన అంశానికి సంబంధించినది కాదని, ఈసీకి డిప్యుటేషన్‌పై

...మిగతా 2లో

## సీఈసీపై కార్యాచరణ!

**యాక్షన్ ప్లాన్‌ను నిర్ణయించేందుకు 30న ఇండి కూటమి సమావేశం**





**ఢిల్లీ, సెప్టెంబర్ 26:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కు ఒత్తిడి పెంచే దిశగా విపక్షాలు కార్యాచరణకు సిద్ధమయ్యాయి. ఈ అంశంపై చేపట్టాల్సిన ఆందోళనలపై చర్చించేందుకు ఇండియా కూటమి నేతలు ఈ నెల 30న ఢిల్లీలో భేటీ కానున్నారు. జ్ఞానేశ్ కుమార్ ను సీఈసీ పదవి నుంచి తప్పించాలనే

...మిగతా 2లో

## టూరిస్ట్ డెస్టినేషన్‌గా తెలంగాణ

ఏఐ, డిజిటల్ టెక్నాలజీతో టూరిజం రంగానికి కొత్త ఊపు

ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలో డిప్యూటీ సీఎం భట్టి

2



రూ.50 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం

3

## నవంబర్‌లో కాళేశ్వరం పునరుద్ధరణ



బ్యారేజీల నిర్మాణ భద్రత.. నాణ్యతలో రాజీ లేదు

సమగ్ర అంచనా వ్యయాన్ని సిద్ధం చేసున్నం: మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (మనం బ్యూరో):** కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు ప్రభుత్వం సిద్ధమైందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించి డిజైన్లను ఇప్పటికే ఖరారు చేశామనీ, అక్టోబర్‌లో కేంద్ర జల సంఘం దృష్టికి తీసుకు రానున్నట్లు వెల్లడించారు. శనివారం బేగంపేటలోని క్యాంపు కార్యాలయంలో నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో బ్యారేజీల పునరుద్ధరణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రాజెక్టు డిజైనర్ రూపొందించిన పునరుద్ధరణ పనులలో భాగంగా గ్రౌటింగ్ ద్వారా పునాదులను బలోపేతం చేయడం, కొత్తగా కట్ ఆఫ్ వాల్స్ నిర్మించడం

...మిగతా 2లో

## ఖైరతాబాద్‌లో కంటెస్ట్ చేస్తం

ఉప ఎన్నికల బరిలో టీ రక్షణ సేన

రాష్ట్రంలో పరిపాలన గాడి తప్పిందన్న కవిత





**హైదరాబాద్, మనం ప్రతినిధి:** ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో తాము నిలవబోతున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ తరపున అభ్యర్థిని బరిలోకి దించనున్నట్లు ఆమె ప్రకటించారు. ఇదే సమయంలో ఫిరాయింపు రాజకీయాలపై మండిపడిన ఆమె... ఒక పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచి, వేరే పార్టీలోకి వెళ్లి ఎంపీగా పోటీ చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని దానం నాగేందర్ తీరును పరోక్షంగా తప్పుబట్టారు. ఇక కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణపై స్పందిస్తూ... కేవలం క్లరికల్ తప్పుల పేరుతో ఓట్లు

...మిగతా 2లో

## యాదాద్రిలో విద్యుత్ వెలుగులు

రోజుకు 140 మిలియన్ యూనిట్ల ఉత్పత్తికి వ్యూహాత్మక కసరత్తు

జెన్‌కో ప్రగతి ప్రస్థానంపై ప్రత్యేక కథనం

గత పాలకుల నిర్లక్ష్యాన్ని అధిగమించి కొనితెచ్చిన విజయాలు

3



## నిమజ్జనం సక్సెస్

- ప్రశాంతంగా ముగిసిన గణేశ్ నిమజ్జనం
- డ్యాన్స్ చేసిన హైదరాబాద్ సీపీ సజ్జనార్
- ట్యాంక్ బండ్, అసెంబ్లీ వైపు ట్రాఫిక్ ఆంక్షల ఎత్తివేత

2

## 70.07 శాతం ఉత్తీర్ణత

**టెట్ ఇన్-సర్వీస్-2026 ఫలితాలు విడుదల**

**22,477 మందిలో 15,749 మంది అర్హత**

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేస్తున్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన టీజీటెట్-ఇన్ సర్వీస్ టీచర్స్-2026 ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, టీజీటెట్ ఛైర్ పర్సన్ శనివారం ఫలితాలను విడుదల చేశారు. అయితే, జులై 21న విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబర్ 8, 9 తేదీల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించారు. మూడు విడతల్లో ఆన్‌లైన్ పరీక్షలు జరిగాయి. మొత్తం

...మిగతా 2లో

## ఏఐలో పెట్టుబడులు దేశానికి ముందడుగు

2

## నటుడి కారుణ్య మరణం

ఫ్రెంచ్ నటుడు, దర్శకుడు ఆర్నాడ్ డెనిస్ అనారోగ్యంతో కోరి ప్రాణం తీసుకున్న వైనం



9

## చోరీల్లోనూ ఏఐ ఘనాపాటీయే

### అమెరికా ప్రభుత్వ వెబ్ సైట్లలోకి చొరబడ్డ ఓపెన్ ఏఐ





**న్యూయార్క్, సెప్టెంబర్ 26:** అత్యాధునిక ఏఐ మోడళ్లతో సైబర్ భద్రతకు సవాళ్లు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అందుకు అనుగుణంగానే ఇటీవల పలు ఏఐ మోడళ్లు సైబర్ దాడులకు పాల్పడినట్లు తేలడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా మరో ఘటన వెలుగుచూసింది. ఓపెన్ ఏఐ మోడళ్లు అమెరికా ప్రభుత్వానికి చెందిన పలు వెబ్ సైట్లలోకి ప్రవేశించి సమాచారాన్ని సేకరించింది. దీంతో పలు

...మిగతా 2లో

### రూ.1000 కోట్లు కొల్లగొట్టిన సైబర్ కేటుగాళ్లు

**రోమ్, సెప్టెంబర్ 26:** ఏఐని ఉపయోగించి.. ఓ బ్యాంకుకు రూ.వేల కోట్లు కుచ్చుటోపి వేశారు సైబర్ కేటుగాళ్లు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ గా నమ్మించి రూ.1034 కోట్లు కొల్లగొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ భారీ మోసం ఇటలీలోని అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకు ఇంటెసా శాన్పాలోలో చోటుచేసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇటలీలో అతిపెద్ద బ్యాంకు ఇంటెసా శాన్పాలో సంబంధిత

...మిగతా 2లో

**సీఈసీ వ్యవహారంపై ఆందోళనలు**

## నిష్పక్ష పాత్రకు నీళ్లు.. పారదర్శకతకు పాతర





ప్రజాస్వామ్య కాపలాదారుపై నీలినీడలు • పరిపాలనా వ్యవస్థకు ప్రమాదకరం?

**హైదరాబాద్,సెప్టెంబర్ 26 (మనం న్యూస్):** భారతీయ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సంఘం అత్యంత పవిత్రమైన, స్వతంత్రమైన కాపలాదారు. దేశంలో ప్రతి ఐదేండ్లకోసారి లేదా సకాలంలో జరిగే ఎన్నికలు కేవలం రాజకీయ పార్టీల మధ్య జరిగే పోటీలు మాత్రమే కావు అవి ఈ దేశంలోని కోట్లాది మంది పౌరుల ప్రజాస్వామ్య విశ్వాసానికి సజీవ సాక్ష్యాలు. ఈ బృహత్తర ప్రక్రియలో ఏ చిన్న అనుమానం తలెత్తినా అది మొత్తం వ్యవస్థ పునాదులనే కదిలిస్తుంది. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సమగ్ర ప్రక్షాళనకు ఉద్దేశించిన 'సర్' ప్రక్రియ అలాంటి తీవ్రమైన గందరగోళానికే కేంద్ర బిందువుగా మారింది. ఒక మహోన్నతమైన ఉద్దేశంతో ప్రారంభించిన ఈ ప్రక్రియ,క్షేత్రస్థాయిలో అమలవుతున్న తీరు పట్ల సామాన్యుల నుంచి వీవీఐపీల వరకు అందరూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అసలు ఈ సర్ ప్రక్రియను ఎందుకు చేపట్టాల్సి వచ్చింది, దీనివల్ల దేశానికి జరిగే లాభ నష్టాలు ఏమిటి, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) విశ్వసనీయత ఎందుకు ప్రశ్నార్థకమై బద్నాం కావడానికి దారితీసిన పరిస్థితులపై సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశంలో ఓటర్ల జాబితా ఎప్పుడూ తాజాగా,

...మిగతా 9లో

# టూరిస్ట్ డెస్టినేషన్‌గా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రకృతి వనాలు, వన్యప్రాణులు, ప్రత్యేక వంటకాలు,ఆధునిక పట్టణ ఆకర్షణలు అన్నీ కొలువుదీరాయని జూపల్లి కొనియాడారు. హైదరాబాద్‌లోని చారిత్రక సంపద మొదలుకొని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన రామప్ప దేవాలయం వరకు, వరంగల్, యాదాద్రి, భద్రాచలం, నాగార్జునసాగర్, సోమశిల, నల్లమల అడవులు, సుందర జలపాతాల వరకు రాష్ట్రంలో విభిన్న పర్యాటక అనుభవాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని మంత్రి వివరించారు.

**రూ.50 వేల కోట్ల పెట్టుబడులు:**

తెలంగాణ టూరిజం పాలసీ 2025-30 కింద తొలుత రూ.15 వేల కోట్ల పెట్టుబడులను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దిశానిర్దేశంతో దానిని ఏకంగా రూ.50 వేల కోట్లకు పెంచామని మంత్రి వెల్లడించారు. దేశీయ,అంతర్జాతీయ పర్యాటకుల రాకలో తెలంగాణను దేశంలోనే తొలి వరుసలో నిలపడానికి పటిష్టమైన చర్యలు చేపట్టామని జూపల్లి వెల్లడించారు. ఈ టూరిజం పాలసీ అమల్లోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రాష్ట్రానికి అసాధారణ రీతిలో ఏకంగా రూ.22,174 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని, వాటిని త్వరలోనే పూర్తిస్థాయిలో కార్యరూపంలోకి తీసుకువస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వ రంగ పెట్టుబడులతో పాటు పీపీపీ (పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) విధానాన్ని, ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేస్తామని పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం-2026 ప్రధాన ఇతివృత్తమైన 'డిజిటల్ ఎజెండా,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి పునఃరూపకల్పన' తెలంగాణకు ఎంతైనా సరిపోతుందని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, డేటా అనలిటిక్స్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా పర్యాటకులకు వ్యక్తిగత అవసరాలకు తగినట్లుగా ప్రయాణ ప్రణాళికలు రూపొందించడం, బహుభాషా సహాయం అందించడం, వారసత్వ సంపదను డిజిటల్ విధానంలో సరికొత్త వర్చువల్ అనుభవాలతో పరిచయం చేయడం సాధ్యమవుతుందని మంత్రి వివరించారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర పర్యాటక శాఖ వెబ్‌సైట్‌ను అత్యంత ఆధునిక హంగులతో పునఃరూపకల్పన చేసి ప్రారంభించామని, దీని ద్వారా పర్యాటకులు అన్ని వివరాలను సులభంగా తెలుసుకోవచ్చని మంత్రి తెలిపారు.

**సరికొత్త ప్రయోగాలకు శ్రీకారం:**

పర్యాటక రంగంలో ఎన్నడూ లేనివిధంగా సరికొత్త ప్రయోగాలకు శ్రీకారం చుడుతూ 'రివర్స్ టూరిజం - ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్'ను ప్రారంభించినట్లు మంత్రి ప్రకటించారు. కేవలం నగరవాసులు పల్లెలకు వెళ్లడమే కాకుండా, అడవి బిడ్డలు సైతం ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వైభవాన్ని ప్రత్యక్షంగా తిలకించేలా ఈ కార్యక్రమం దోహదపడుతుందని చెప్పారు. ఇందులో భాగంగా ములుగు జిల్లాకు చెందిన 100 మంది గిరిజన అతిథులను హైదరాబాద్‌కు ఆహ్వానించి నగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను చూపించామని, ఆధునిక నాగరికతలో వచ్చిన మార్పులను వారు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించామని జూపల్లి ఆనందం వ్యక్తం చేశారు. స్థానికంగా యువత, మహిళలు, కళాకారులు, గైడ్లు, హోటల్ నిర్వాహకులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా గ్రామీణ, పర్యావరణ ఆధారిత పర్యాటకాన్ని ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. అడవులు, జలవనరులు, సహజ వాతావరణం దెబ్బతలకుండా సుస్థిరమైన, బాధ్యతాయుతమైన పర్యాటకాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి జూపల్లి కృష్ణారావు పునరుద్ఘాటించారు.

# మాజీ ప్రధాని మన్మోహన్‌కు భారత రత్న ఇవ్వాలి




(మొదటి పేజీ తరువాయి)

సంస్థలు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో సేవలు అందిస్తున్నాయనీ, అలాంటి ప్రాంతంలో మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం సముచితమని భావించామన్నారు. తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర నెహ్రూ, పటేల్ సోనియా, మన్మోహన్‌లను ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. దశాబ్దాల తెలంగాణ కలను సాకారం చేసిన ఘనత సోనియా గాంధీ అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌దేనని గుర్తు చేశారు. మన్మోహన్ సింగ్ ఎన్నో సరళీకృత విధానాలు తీసుకొచ్చారనీ, విద్యాహక్కు చట్టం, జాతీయ ఉపాధి హామీ చట్టం, భూ సేకరణ పునరావాస చట్టం తీసుకొచ్చిన ఘనత కూడా ఈ ఇద్దరిదేనని స్పష్టంచేశారు. భూమి కలిగిన వారితో పాటు భూమి లేని వారికి కూడా నష్టపరిహారం ఇవ్వాలని పునరావాస చట్టం తీసుకు రావడం గొప్ప విషయమన్నారు. పేదల కోసం ఆయన చేసిన ఆలోచనలు, తీసుకొచ్చిన సంస్కరణలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయనీ, దేశంలోని భావి తరాలు కూడా మన్మోహన్ సింగ్ సేవలను గుర్తుంచుకుంటాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# నిమజ్జనం సక్సెస్





- ట్యాంక్ బండ్, అసెంబ్లీ వైపు ట్రాఫిక్ ఆంక్షల ఎత్తివేత

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** హైదరాబాద్ నగరంలో గణేశ్ నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును విజయవంతంగా నిర్వహించడంతో పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తన సిబ్బందితో కలిసి సంబరాలు జరుపుకున్నారు. నిమజ్జన ప్రక్రియ ముగిసిన అనంతరం, తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ కింద పోలీసు సిబ్బందితో కలిసి సీపీ సజ్జనార్ నృత్యం చేశారు. 'ది ప్యారడైజ్' చిత్రంలోని 'ఆయా షేర్' పాటకు ఆయన చిందులేశారు. గత కొన్ని రోజులుగా విధుల్లో నిమగ్నమై అప్రమత్తంగా ఉన్న పోలీసులు, నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి కావడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఉన్నతాధికారి స్వయంగా వారితో కలవడంతో సిబ్బందిలో ఉత్సాహం రెట్టింపైంది. మరోవైపు, నగరంలో నిమజ్జన క్రతువు ముగియడంతో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను ఎత్తివేశారు. సచివాలయం పరిసర ప్రాంతాలైన ట్యాంక్‌బండ్, లిబర్టీ, అసెంబ్లీ మార్గాల్లో వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సాధారణ స్థితికి చేరుకుంది.

# బీచును శుభ్రం చేసిన సీఎం భార్యాబిడ్డలు

**ముంబై, సెప్టెంబర్ 26:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సతీమణి అమృత, కుమార్తె దివిజ ముంబయిలోని జుహూ బీచును శుభ్రం చేశారు. గణేశ్ నిమజ్జనోత్సవం నేపథ్యంలో అమృత నేతృత్వంలోని దివ్యాజ్ ఫౌండేషన్.. బృహన్ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ)తో కలిసి బీచ్ వద్ద స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టింది. ఇందులో బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ కూడా పాల్గొన్నారు.

''మన ముంబయి మహా నగరానికి ఈ సముద్రం అందాన్ని, గుర్తింపును ఇస్తుంది. సముద్ర తీరాలను శుభ్రంగా ఉంచడం కేవలం పౌర బాధ్యత మాత్రమే కాదు.. నగరం పట్ల మన నిబద్ధత కూడా.. పర్యావరణ పరిరక్షణ కోసం మరింత మంది ప్రజలు, ముఖ్యంగా యువత ముందుకు వచ్చేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం లక్ష్యం'' అని అమృత పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రజలందరి బాధ్యత అని అజయ్ దేవగణ్ పేర్కొన్నారు. ఇళ్లను శుభ్రంగా ఉంచుకున్నట్లే.. మన నగరాన్ని, రాష్ట్రాన్ని, దేశాన్ని కూడా శుభ్రంగా ఉంచాలని ఆయన పిలుపునిచ్చారు.

# అమెరికా ప్రభుత్వ వెబ్ సైట్లలోకి చొరబడ్డ ఓపెన్ ఏఐ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ విభాగాలను కంపెనీ అలర్ట్ చేసింది. అమెరికా సెన్సస్ బ్యూరో, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌తో పాటు పలు ప్రభుత్వ వెబ్సైట్లలో అందుబాటులో ఉన్న సమాచారాన్ని తమ ఏఐ మోడళ్లు యాక్సెస్ చేసుకున్నాయని ఓపెన్ ఏఐ తెలిపింది. ఏఐ బాట్లకు శిక్షణ, వాటి సాంకేతిక సామర్థ్యాలను అంచనా వేసే ఈ సమాచార సేకరణ జరిగినట్లు ధ్రువీకరించింది. ప్రజలకు అందుబాటులో ఉన్న సమాచారాన్నే ఏఐ మోడళ్లు యాక్సెస్ చేశాయని పేర్కొంది.

ఏఐ బాట్ల వల్ల ప్రభావితమైన వెబ్సైట్లు, ఆన్లైన్ సెంటర్లు, విశ్వవిద్యాలయాలు, పలు సంస్థలను గుర్తించి అప్రమత్తం చేసినట్లు ఓపెన్ ఏఐ వెల్లడించింది. ఏఐ మోడళ్లు హద్దులు దాటి ప్రవర్తించిన ఘటనలపై ఈ కంపెనీ విస్తృత దర్యాప్తు చేపట్టింది. ఇది పూర్తి కావడానికి మరికొన్ని నెలలు పట్టొచ్చని ఓపెన్‌ఏఐ పేర్కొంది. కాగా.. ఇటీవలే ఆస్ట్రేలియా ప్రభుత్వ వెబ్సైట్లోకి ఓపెన్ ఏఐకి చెందిన ఓ మోడల్ అనధికారికంగా ప్రవేశించిన విషయం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఆరంభంలో ఈ హ్యాకింగ్ జరిగినట్లు కంపెనీ వెల్లడించింది. అయితే, ఈ ఘటనలో వ్యక్తిగత సమాచారం బయటకు రాలేదని ఆ దేశ ప్రధాని ఆంథోనీ అల్బనీస్ తెలిపారు.

**వేగంగా పనిచేయలేకపోయాం:**

**శామ్ ఆల్ట్మన్**

ఈ వరుస ఘటనల నేపథ్యంలో ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్మన్ స్పందించారు. ''సమస్య పరిష్కారంలో ఆశించినంత వేగంగా పనిచేయలేకపోతున్నాం. భారీ మొత్తంలో యాక్టివిటీ లాగ్లను పరిశీలించి, అందులోని సమాచారాన్ని గుర్తించాల్సి ఉంది. అదే సమయంలో పారదర్శకతనూ కొనసాగించాలి. ఏఐ మోడళ్ల ప్రభావానికి గురైన సంస్థలతో కలిసి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన వనరులు పెంచుతున్నాం అని ఆల్ట్మన్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

# రూ.1000 కోట్లు కొల్లగొట్టిన సైబర్ కేటుగాళ్లు

(మొదటి పేజీ తరువాయి)

విభాగమైన ఫిడ్యూరమ్ మాజీ ఛైర్మన్ పావొలో మోలెసినిని ఫిబ్రవరిలో కేటుగాళ్లు బురిడీ కొట్టించారు. ఇంటెసా శాన్పాలో సీఈఓ కార్లో మెస్సీనాలా నమ్మబలికి ఏఐ వాయిస్ క్లోనింగ్ సృష్టించి ఫోన్ కాల్ చేశారు. దీంతో మాజీ ఛైర్మన్ పావొలో ఇదంతా నిజమనుకొని.. విదేశీ ఖాతాల్లోని నిధులను ట్రాన్స్‌ఫర్ చేయాలని తన ఫైనాన్స్ విభాగాన్ని ఆదేశించారు. అనుమానాస్పద లావాదేవీలను ఫిడ్యూరమ్ సంస్థ వెంటనే గుర్తించి.. తక్షణమే విదేశాల్లోని బ్యాంకులను, సిబ్బందిని అలర్ట్ చేసినట్లు సదరు కథనాలు తెలిపాయి. ఈ చర్యల వల్ల దాదాపు రూ.570 కోట్ల నగదును రికవరీ చేయగలిగారు. కానీ, మిగతా మొత్తం పలు విదేశీ ఖాతాల్లోకి బిట్కాయిన్, ఇతర క్రిప్టోకరెన్సీలుగా మారిపోవడంతో వాటిని గుర్తించలేకపోయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతున్నది.

# 70.07 శాతం ఉత్తీర్ణత

(మొదటి పేజీ తరువాయి)

24,986 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 22,477 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 15,749 మంది అర్హత సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా 70.07 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పేపర్-1లో 4,942 మంది పరీక్షకు హాజరుకాగా.. 3,398 మంది (68.76%) అర్హత సాధించారు. పేపర్-2 గణితం, సైన్స్ విభాగంలో 9,131 మంది పరీక్ష రాశారు. వీరిలో 6,720 మంది (73.60%) ఉత్తీర్ణులయ్యారు.

పేపర్-2 సోషల్ స్టడీస్‌లో 8,404 మంది పరీక్షకు హాజరుకాగా.. 5,631 మంది (67%) అర్హత సాధించారు. అభ్యర్థులు తమ ఫలితాలతో పాటు మార్కుల వివరాలను పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సమీపంలోని మీ-సేవ కేంద్రాల్లోనూ మార్కుల వివరాలను పొందవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

# 'భజన్ క్లబ్బింగ్' అనేది ఒక అద్భుతం

- ప్రధాని మోడీ

**ఢిల్లీ, సెప్టెంబర్ 26:** హిందూ భక్తి గీతాలు పాడటం, చప్పట్లు కొట్టడం, నృత్యం వంటి యువత సంగీత కచేరీ అయిన 'భజన్ క్లబ్బింగ్'లో ప్రధాని మోడీ శనివారం పాలు పంచుకొన్నారు. ముందు వరుసలో కూర్చున్న ప్రధాని శ్రీరాముడిపై పాడిన పాటకు అనుగుణంగా కంజరిని పోలిన వాయిద్య పరికరం డప్లీతో తాళం వేశారు. ఈ వీడియోను పంచుకున్న మోడీ.. 'భజన్ క్లబ్బింగ్' ఓ అద్భుతమని అభివర్ణించారు.

# నవంబర్‌లో కాళేశ్వరం పునరుద్ధరణ

(మొదటి పేజీ తరువాయి)

వంటివి ఉన్నాయన్నారు. వరద ప్రవాహ వేగాన్ని నియంత్రించే ఏర్పాట్లలో ఉన్న లోపాలను సరిచేయడంతో పాటు పునాదుల స్థిరత్వాన్ని పెంచడం, పునాదుల కింద నీటి చొరబాటును అరికట్టడం ఈ పనుల ప్రధాన ఉద్దేశ్యమన్నారు. బ్యారేజీల నిర్మాణ భద్రత, పునరుద్ధరణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదనీ శాస్త్రీయ అధ్యయనాలు, జాతీయ స్థాయి సంకేతిక సంస్థల సిఫార్సుల ఆధారంగానే ప్రతి పని జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రతిపాదిత డిజైన్లను పూణేలోని కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా కేంద్రంలో కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ నమూనాల ద్వారా పరీక్షిస్తున్నట్లు తెలిపారు. వివిధ స్థాయిల్లో వరద ప్రవాహం ఉన్నప్పుడు బ్యారేజీల ద్వారా నీటి ప్రవాహ తీరు ఎలా ఉంటుందో ప్రతిపాదించిన చర్యలు ఎంత సమర్థవంతంగా పనిచేస్తాయో ఈ పరిక్షల ద్వారా నిర్ధారిస్తారని చెప్పారు. పునరుద్ధరణ పనులకు సంబంధించిన సమగ్ర అంచనా వ్యయాలను నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ సిద్ధం చేస్తోందన్నారు. ప్రభుత్వ అనుమతి కోసం అవసరమైన కాంట్రాక్టు విధానాన్ని కూడా ఖరారు చేస్తున్నట్లు తెలిపారు. తాత్కాలిక మరమ్మత్తులతో సరిపెట్టకుండా సాంకేతికంగా పటిష్టమైన దీర్ఘకాలం మన్నే విధానాలతో మూడు బ్యారేజీల పునరుద్ధరించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పునరుద్ధరణ పనులు పూర్తయి జాతీయ సాంకేతిక సంస్థల నుంచి అవసరమైన భద్రతా అనుమతులు వచ్చిన తరువాతనే మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకొస్తామని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

# ఏఐ, డిజిటల్ టెక్నాలజీతో టూరిజం రంగానికి కొత్త ఊపు

**ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలో డిప్యూటీ సీఎం భట్టి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 26, (మనం బ్యూరో):** తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు డిజిటల్ టెక్నాలజీ, ఏఐని విస్తృతంగా వినియోగించుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.

ప్రకృతి, చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపదకు నిలయమైన తెలంగాణను ప్రపంచ పర్యాటక పటంలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని పేర్కొన్నారు. డిజిటల్ ఎజెండా-ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి కొత్త రూపు అనే ఇతివృత్తంతో ప్రపంచ పర్యాటక దినోత్సవం-2026 వేడుకలు శనివారం శిల్పారామంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా పర్యాటక రంగాన్ని రూపుదిద్దాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో హెల్త్, ఆలయ, గ్రామీణ, ప్రకృతి పర్యాటక రంగాలకు అపారమైన అవకాశాలు ఉన్నాయనీ, వికారాబాద్‌లో వెల్నెస్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్నారు.

టైగర్ రిజర్వులు, అడవులు, జలపాతాలు, ప్రాచీన ఆలయాలు, నగరంలోని చారిత్రక కట్టడాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయనీ, ప్రశాంతతను కోరుకునే వారికి తెలంగాణ సరైన వేదిక అని పేర్కొన్నారు. వీటిని అంతర్జాతీయంగా సరైన రీతిలో మార్కెటింగ్ చేయాలని అధికారులకు సూచించారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది పర్యాటక రంగానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు.

సందర్శకులు భద్రత, నాణ్యమైన వసతులకు తమ పాలసీలో పెద్ద పీట వేశామనీ, పీపీపీ పద్ధతిలో అంతర్జాతీయ స్థాయి హోటళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి భారీగా పెట్టుబడులు ఆకర్షించాలని స్పష్టం చేశారు. వారంలో ఐదు రోజులు తీవ్ర ఒత్తిడితో పనిచేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను పర్యాటకం వైపు మళ్లించాలనీ, ఇందుకోసం పర్యాటక శాఖ మంత్రి, కార్యదర్శి ప్రముఖ ఐటీ కంపెనీల సీఈవోలు పర్యాటక ప్రాజెక్టుల నిర్వాహకులతో త్వరలో సమావేశం కావాలని ఆదేశించారు.

టూరిజం కూపన్లు అందించి వారాంతాల్లో తెలంగాణలోని ప్రకృతి ప్రాంతాలను సందర్శించేలా ప్రోత్సహించాలన్నారు. పర్యాటకం అంటే కేవలం వినోదం మాత్రమే కాదనీ విభిన్న సంస్కృతుల సమ్మేళనానికి అద్దం పడుతుందని, ఈ శాఖ చేపడుతున్న నూతన కార్యక్రమాలను అభినందిస్తూ తెలంగాణ పర్యాటక కీర్తి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆకాంక్షించారు.

# అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిన ఓ అధికారి పనితీరుకు సంబంధించిందని వివరించింది. అలాగే, 'బిహార్, పశ్చిమ బెంగాల్ సహా 20 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లో 'సర్' ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. తమ పేర్లు నమోదు కాకుండా మిగిలిపోయిన వారు, యువకులు, మొదటిసారి ఓటు వేసేవారు.. నిరంతర అప్డేషన్ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు కోసం సంబంధిత ఈఆర్వోకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సీఈవోలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఓటర్ల నమోదుకు ఎన్నికల అధికారులు తక్షణమే స్పెషల్ డ్రైవ్ ప్రారంభించనున్నారు' అని తెలిపింది.

దేశవ్యాప్తంగా 'సర్' నిర్వహణ సహా ఈ మధ్య కాలంలో ఈసీ అనేక నిర్ణయాలు తీసుకుంది. బిహార్ నుంచి మొదలు అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ కోసం గతేడాది జూన్ 24నాటి ఆదేశాలు ఎన్నికల కమిషన్ ఏకగ్రీవ ఆమోదంతోనే జారీ అయ్యాయి. దీన్ని సర్వోన్నత న్యాయస్థానం కూడా సమర్థించింది' అని ఈసీ పేర్కొంది.గోవాలో 97 మంది అర్హులకు తుది ఓటర్ల జాబితాలో చోటుదక్కకపోవడంపై స్పందిస్తూ.. 'ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హుల నుంచి దరఖాస్తులు సేకరణకు ఇంటింటికీ వెళ్లాలని సంబంధిత బూత్ స్థాయి అధికారులను గోవా సీఈవో ఆదేశించారు. ఆ 97 మంది ఓటర్లలో ఇప్పటికే 81 మంది 'ఫారం-6' నింపారు' అని వెల్లడించింది.

# సీఈసీపై కార్యాచరణ!

(మొదటి పేజీ తరువాయి)

తమ డిమాండ్‌పై పరస్పరం సంప్రదింపులు జరిపి.. ఉమ్మడి నిర్ణయం తీసుకోనున్నారు. ఈ విషయంపై 29న కాంగ్రెస్ ప్రత్యేకంగా సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు, జ్ఞానేశ్ కుమార్ అభిశంసనకు మరోసారి పార్లమెంటు ఉభయ సభల్లో నోటీసులు ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 24వ తేదీన 73 మంది రాజ్యసభ సభ్యులతో కూడిన ప్రతిపక్ష కూటమి జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ అభిశంసన నోటీసు ఇచ్చింది. అది రాజ్యసభలో పెండింగులో ఉంది. అది అలా ఉండగానే మరోసారి నోటీసు ఇవ్వాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. కాగా.. సర్ ప్రక్రియలో అవకతవకలు, ఇతర సమస్యలపై ఇప్పటికే 23 రాజకీయ పార్టీలు, ఓ స్వతంత్ర ఎంపీ ఈ వ్యవహారంపై న్యాయ సలహాల కోసం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను సంప్రదించాయి.

# ఏఐలో పెట్టుబడులు దేశానికి ముందడుగు

**కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**

**బెంగళూరు, సెప్టెంబర్ 26:** కృత్రిమ మేధ (ఏఐ)రంగంలో పెట్టుబడులు దేశ భవిష్యత్తుకు ముందడుగు అవుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అన్ని రంగాల్లో డిజిటల్ వ్యవస్థకు పెద్దపీట వేయాలని పిలుపునిచ్చారు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. 'కృత్రిమ మేధతో పాటు సెమీకండక్టర్లు, క్వాంటమ్ టెక్నాలజీ రంగాలకు దేశం భారీగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి అవసరమైన శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల్లో కూడా ఏఐ వినియోగం పెరగాలి. అన్ని రంగాల్లోనూ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటే, భారత ఆర్థిక వృద్ధి రేటు 10 శాతాన్ని దాటడం సాధ్యమే.

# అంతరిక్షంలో డేటా సెంటర్ ఏర్పాటు దిశగా గూగుల్!

**వాషింగ్టన్, సెప్టెంబర్ 26:** టెక్ దిగ్గజం 'గూగుల్' తాను చేపట్టిన 'ప్రాజెక్ట్ సన్ క్యాచర్' కింద అత్యధిక ఇంధన సమర్థత, పనితనం కలిగిన కృత్రిమ మేధ (ఏఐ) యాక్సిలరేటర్ చిప్ అయిన ట్రిల్లియం టెన్సర్ ప్రాసెసింగ్ యూనిట్ (టీపీయూ)ను త్వరలో పరీక్షించనుంది. రేడియేధార్మికత, వేడి, కనెక్టివిటీ వంటి సవాళ్లను అధిగమించి సౌర విద్యుత్ ఆధారిత కృత్రిమ మేధ కంప్యూటింగ్ సదుపాయాలు అంతరిక్షంలో మనుగడ సాగించగలవా అన్నది పరీక్షిస్తున్నారు. ఈ ఏర్పాటు ద్వారా ఏఐని అంతరిక్షంలోకి తీసుకెళ్లేందుకు గూగుల్ సన్నాహాలు చేస్తోంది. ఖగోళంలో కృత్రిమ మేధ డేటా సెంటర్లను ఏర్పాటు చేసి సౌరవిద్యుత్ ఆధారంగా నడిచే ఉపగ్రహాల సాయంతో భారీ స్థాయిలో డేటాను ప్రాసెస్ చేసేందుకు సిద్ధమవుతోంది. అంతరిక్షంలో పుష్కలంగా అందుబాటులో ఉన్న సౌర విద్యుత్తును కృత్రిమ మేధ కంప్యూటింగ్ కోసం ఉపయోగించాలని గూగుల్ భావిస్తోంది. భూ ఉపరితలం నుంచి తక్కువ ఎత్తున్న కక్ష్యలో నిరంతరం సౌరశక్తిని పొందవచ్చని, భూమి ఉపరితలంపై ఉత్పత్తి చేసే దాని కన్నా ఎనిమిది రెట్లు ఎక్కువ పరిమాణంలో అక్కడ సౌర విద్యుత్తు ఉత్పత్తి చేయవచ్చని గూగుల్ చెబుతోంది. కృత్రిమ మేధకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన డేటా సెంటర్ల ఏర్పాటుకు అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ డేటా సెంటర్లకు విద్యుత్తు సదుపాయం కల్పించడం, భూమిని కేటాయించడం, చల్లబరిచే వ్యవస్థను ఏర్పాటు చేయడం పెను సవాలుగా మారాయి. ఈ సమస్యలను అధిగమించేందుకు అంతరిక్షంలో కంప్యూటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసే అవకాశాలపై గూగుల్ అధ్యయనం సాగిస్తోంది.

# ట్రంప్ విందులో భారతీయ టెక్ ప్రముఖులు

**వాషింగ్టన్, సెప్టెంబర్ 26:** చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ గౌరవార్థం డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటుచేసిన విందులో భారత సంతతికి చెందిన పలువురు టెక్నాలజీ ప్రముఖులు పాల్గొన్నారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల, ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్, మైక్రాన్ టెక్నాలజీకి చెందిన సంజయ్ మెహ్రోత్రాలు ఈ విందులో పాల్గొన్నవారిలో ఉన్నారు. అమెరికా చైనాల మధ్య సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ, సెమీ కండక్టర్లు వాటి సరఫరా మార్గాలపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో భారత టెక్నాలజీ ప్రముఖులు ఈ విందులో పాల్గొనడం విశేషం. వీరికితోడు సిలికాన్ వ్యాలీకి చెందిన కీలక నిపుణులు విందుకు హాజరయ్యారు. యాపిల్ సీఈఓ టిమ్ కుక్, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్, ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్, ఓపెన్ ఏఐకి చెందిన శ్యామ్ ఆల్ట్‌మాన్ తదితరులు పాల్గొని విందు ప్రాముఖ్యాన్ని ఇనుమడింపజేశారు. అయితే అమెరికాకు చెందిన ప్రముఖ కృత్రిమ మేధ సంస్థ 'ఆంత్రోపిక్' సీఈఓ డారియో అమోడెయి మాత్రం గైర్హాజరవటం విశేషం. కృత్రిమ మేధ పరుగు పందెంలో చైనా ముందడుగు వేయడం అమెరికాకు, ప్రపంచానికి ప్రమాదకరమని అమోడెయి ఇటీవల ఒక వ్యాసంలో పేర్కొన్నారు.




# ఖైరతాబాద్‌లో కంటెస్ట్ చేస్తం

(మొదటి పేజీ తరువాయి)

తొలగిస్తున్నారనే విమర్శలున్నాయని, బీజేపీని ప్రసన్నం చేసుకునేలా ఈ కుట్ర జరుగుతోందన్న చర్చ ప్రజల్లో నడుస్తోందని ఆమె ఆరోపించారు. ఇటీవల ఆదిలాబాద్ రిమ్స్‌లో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు గాడితప్పుతున్నాయని, ప్రభుత్వం వాటిని తక్షణమే చక్కదిద్దాలని డిమాండ్ చేశారు. నిమ్స్, నీలోఫర్ వంటి పెద్ద ఆసుపత్రులలో మంత్రులు ఫోన్ చేసినా బెడ్లు దొరకని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 11 రకాల ఆరోగ్య పథకాలకు కనీస బడ్జెట్ కేటాయించలేదని, ఆరోగ్యశ్రీ బకాయిలను కూడా ఇప్పటివరకు విడుదల చేయలేదని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఆసుపత్రులను మంత్రులు పట్టించుకోవడం మానేశారని విమర్శించిన కవిత... జిల్లాల కలెక్టర్లు క్రమం తప్పకుండా హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేయాలని సూచించారు. తాము కూడా తెలంగాణ రక్షణ సేన తరపున ప్రతి జిల్లాలోనూ ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించి పరిస్థితులను మదింపు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఇన్ని పసిమొగ్గలు రాలిపోతుంటే... తెలంగాణను సింగపూర్, డల్లాస్ చేస్తామని సీఎం, మంత్రులు ఎలా గొప్పలు చెప్పుకుంటారని నిలదీశారు. ఐటీడీఏకు కేంద్రం నుంచి వచ్చిన నిధుల్లో ఏకంగా 70 శాతం నిధులను ఖర్చు చేయకుండా వృథా చేశారని ఆరోపించారు. కోఠి ఆసుపత్రిలో మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తామన్న ప్రతిపాదనను గత బీఆర్ఎస్ హయాంలోనే అడ్డుకున్నారని గుర్తుచేశారు.

**నా ఫామ్ హౌస్ భూమి కబ్జా చేసింది కాదు**

ఇదిలా ఉంటే, తన ఫామ్ హౌస్‌పై వస్తున్న ఆరోపణలను కవిత పూర్తిగా ఖండించారు. తనది ఎలాంటి కబ్జా భూమి కాదని అన్నారు. ఇనాం లేదా అసైన్డ్ భూమి అంతకంటే కానేకాదని స్పష్టం చేశారు. తన ఫామ్ హౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలో కూడా లేదని స్పష్టం చేస్తూ... తన ఆస్తులకు సంబంధించిన ప్రతి వివరమూ ఎన్నికల అఫిడవిట్‌లోనే స్పష్టంగా పేర్కొన్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై, ఇతర ప్రతిపక్ష నేతలపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

గతంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల ఫామ్ హౌస్‌కు వెళ్లిన పెద్దలు అప్పట్లో ఎందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె ప్రశ్నించారు.

# వీర వనిత ఐలమ్మ



**తెలంగాణ తెగువ, ధిక్కార స్వరానికి నిలువెత్తు రూపం: కేసీఆర్**

**చాకలి ఐలమ్మ 131వ జయంతిన.. ఘనంగా కేసీఆర్ నివాళులు**

**ఐలమ్మ ఆశయ సాధనే ధ్యేయంగా సబ్బండ కులాల అభ్యున్నతికి కృషిజేసినం**

**రాచరిక వ్యవస్థను ధైర్యంగా ఎదిరించిన ధీరశాలీ అని కేసీఆర్ కితాబు**

**ఐలమ్మ పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శనీయం**

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శనివారంనాడు ఆయన ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేస్తూ... తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి ఆమె నిలువెత్తు రూపమని కొనియాడారు. నాటి రాచరిక వ్యవస్థను ధైర్యంగా ఎదిరించి, రైతాంగ హక్కుల కోసం పోరాడిన ధీర వనిత అని ప్రశంసించారు. అణచివేతకు గురవుతున్న బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని ఆమె ప్రపంచానికి చాటి చెప్పారని పేర్కొన్నారు. అయితే, ఆమె కేవలం భూస్వాములను వ్యతిరేకించడమే కాకుండా, అప్పట్లోనే చట్టాల పరిధిలో కోర్టుల ద్వారా న్యాయం పొంది ఆమె ప్రజాస్వామిక నిబద్ధతను చాటుకున్నారని కేసీఆర్ గుర్తుచేశారు. ఐలమ్మ పోరాట పటిమ నేటి యువతకు ఎప్పుడూ ఆదర్శనీయమని అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆమె స్ఫూర్తి చాలా అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. తాను చేపట్టిన శాంతియుత మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ ఆమె పోరాట స్ఫూర్తి అంతర్భాగంగా ఉందని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే తమ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆమె జయంతిని అధికారికంగా నిర్వహించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టామని కేసీఆర్ వెల్లడించారు. ఐలమ్మ ఆశయాల సాధనే ధ్యేయంగా తాము అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో మహిళా, శిశు సంక్షేమంతో పాటు రైతాంగం, సబ్బండ కులాల అభ్యున్నతికి ఎన్నో విప్లవాత్మక పథకాలను అమలు చేశామని తెలిపారు. కులవృత్తులకు పునరుజ్జీవం పోసి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా తెలంగాణ ఆత్మగౌరవాన్ని మహోన్నతంగా నిలబెట్టామని, ఆనాడు తాము సాధించిన ప్రగతి నేడు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

# మన బొగ్గు పొరుగు రాష్ట్రాలకు తరలిస్తుండ్రు

## ఏపీ, కర్ణాటక పెద్దల ఆజ్ఞలతో సీఎం రేవంత్ కుట్రలు: మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి



హైదరాబాద్, మనం ప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో శనివారంనాడు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇచ్చిన హామీల అమలులో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని, సాగు, తాగునీటితో పాటు విద్యుత్ రంగంలోనూ అరాచకం సృష్టిస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఎప్పుడూ డైవర్షన్ డ్రామాలు ఆడుతుంటారని దుయ్యబట్టారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిపై ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని, ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని సంచలన ఆరోపణలు చేశారు. ఏపీ, కర్ణాటక ప్రభుత్వాల పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారని దుయ్యబట్టారు. ఇదిలాఉంటే, ఇక యాదాద్రి పవర్ ప్లాంట్‌పై కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, సిమెంట్ పరిశ్రమలకు అవసరమైన యాష్ (బూడిద) అవసరాలను దృష్టిలో ఉంచుకునే దాన్ని దామరచర్లలో ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ఎండిపోతున్న పొలాలు సీఎం రోజువారీ డ్రామాలతో పండవని, ఇప్పటికైనా అనవసరపు పనులు మాని పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని డిమాండ్ చేశారు. పాలిచ్చే ఆవులాంటి ట్రాన్స్‌కోను తన సన్నిహితులకు కట్టబెట్టేందుకు సీఎం రేవంత్ కుట్ర పన్నుతున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. దేశంలో ఢిల్లీ, ముంబై, ఒడిశా వంటి ప్రాంతాల్లో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించిన చోట ప్రజలపై విపరీతమైన భారం పడిందని అన్నారు. కేసీఆర్ మీద ఎంత ఒత్తిడి ఉన్నా నాటి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేట్పరం చేయలేదని, కానీ ప్రస్తుత సర్కార్ మాత్రం కమీషన్లకు ఆశపడి ట్రాన్స్‌కో లక్షల కోట్ల ఆస్తులను కారుచౌకగా అమ్మేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ట్రాన్స్‌కో ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ప్రశ్నించిన అధికారులపై ఏసీబీ కేసుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అనుసరించే ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ తీవ్రంగా పోరాడుతుందని హెచ్చరించారు. 6 దశాబ్దాల నుంచి అంధకారంలో ఉన్న తెలంగాణ.. ఉమ్మడి పాలన తర్వాత కొత్తగా ఏర్పడిన రాష్ట్రమైనప్పటికి గత సీఎం కేసీఆర్ పాలనలో ఆయన తీసుకున్న ప్రత్యేక చొరవతోనే తెలంగాణ రాష్ట్రం వెలుగుల్లోకి వచ్చిందని జగదీశ్‌రెడ్డి కొనియాడారు. అసాధ్యమనుకున్న 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ను కొన్ని నెలల వ్యవధిలోనే అన్ని వర్గాలకు అందించిన ఘనత బీఆర్ఎస్దేనని స్పష్టం చేశారు. కేవలం ట్రాన్స్‌కోపైనే రూ.36 వేల కోట్లు వెచ్చించి, ఎక్కడ విద్యుత్ సరఫరా నిలిచినా మరో మార్గం ద్వారా అనుసంధానించే అధునాతన గ్రిడ్ వ్యవస్థను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.



# ఐలమ్మ పాత్ర భావితరాలకు ఆదర్శం

## జయంతి సందర్భంగా కేటీఆర్ ఘన నివాళులు

హైదరాబాద్, మనం ప్రతినిధి : వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారంనాడు ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చాకలి (చిట్యాల) ఐలమ్మ పాత్ర భావితరాలకు ఆదర్శమని కొనియాడారు. తొలి భూపోరాటానికి నాంది పలికి, ప్రజా వ్యతిరేక పాలనపై దండెత్తిన నిప్పుకణిక ఐలమ్మ బహుజన ధీరత్వానికి, తెలంగాణ పోరాట స్ఫూర్తికి నిదర్శనమని కేటీఆర్ అన్నారు. చాకలి ఐలమ్మ త్యాగాలను, సేవలను గుర్తించే విధంగా.. పాలకుర్తి మార్కెట్ యార్డుకు ఐలమ్మ పేరు పెట్టడమే కాకుండా, ఐలమ్మ జీవిత చరిత్రను పాఠశాల విద్యలో పాఠ్యాంశంగా కేసీఆర్ ప్రభుత్వం చేర్చింది.. చిట్యాల ఐలమ్మ జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించిందని గుర్తుచేశారు.

# 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా

## సెప్టెంబర్ 28 నుంచి పట్టభద్రుల ఓటరు నమోదుకు పిలుపు



హైదరాబాద్, మనం ప్రతినిధి : సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని అన్నారు. ఈ మేరకు

తెలంగాణ భవన్‌లో శనివారం సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ ప్రజల తీర్పును గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని కేటీఆర్ అన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాకపోయినా గల్లీ గల్లీలో ఆయన పాటలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు.

కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు.

ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని భావించారని కేటీఆర్ అన్నారు. కానీ పరిస్థితి 'అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లు' తయారైందని వ్యాఖ్యానించారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించిన నాయకుడు కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 28 నుంచి చేపట్టే పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

### మంచి సినిమా చూసి చాల కాలమైంది?.. 'ప్యారడైజ్' సినిమా చూస్త : కేటీఆర్

మంచి సినిమా చూసి చాల కాలమైందని, అందుకే చాలా కాలం తర్వాత కేటీఆర్ థియేటర్‌లో సినిమా చూడనున్నట్లు ఆయనే స్వయంగా వెల్లడించారు. 'ది ప్యారడైజ్'ను శనివారం రాత్రి వీక్షించబోతున్నట్లు ఆయన స్వయంగా వెల్లడించారు. నాని తనకు ఇష్టమైన నటుల్లో ఒకరని పేర్కొన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా ద్వారా ఈ విషయాన్ని పంచుకున్నారు. సినిమా విజయం సాధించిన నేపథ్యంలో చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. గోదావరిఖని బ్యాక్ డ్రాప్‌లో రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో కేటీఆర్ థియేటర్‌కు వెళ్లడానికి కేవలం సినిమాపై ఉన్న ఇష్టమే కాకుండా, మరొక ప్రధాన కారణం కూడా ఉందనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఈ సినిమాలో ప్రియదర్శి పోషించిన 'ఎమ్మెల్యే శంకరన్న' పాత్ర తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పోకడలను, ఆయన శైలిని పోలి ఉందనే టాక్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. కథను కీలక మలుపు తిప్పే ఈ పాత్ర చుట్టూనే గత కొన్ని రోజులుగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతుండటంతో.. కేటీఆర్ ఈ సినిమాను స్వయంగా చూసేందుకు సిద్ధమవడం ప్రస్తుతం ప్రాధాన్యత సంతరించుకుంది.

# యాదాద్రిలో విద్యుత్ వెలుగులు

**రోజుకు 140 మిలియన్ యూనిట్ల ఉత్పత్తికి వ్యూహాత్మక కసరత్తు**

**జెన్‌కో ప్రగతి ప్రస్థానంపై ప్రత్యేక కథనం**

**గత పాలకుల నిర్లక్ష్యాన్ని అధిగమించి కొనితెచ్చిన విజయాలు**

హైదరాబాద్,సెప్టెంబర్ 26(మనం న్యూస్): రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడమే ధ్యేయంగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపట్టిన చారిత్రాత్మక చర్యలతో రాష్ట్ర విద్యుత్ రంగం స్వర్ణయుగం వైపు అడుగులు వేస్తోంది. ప్రతిష్టాత్మక యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు 2017లోనే ప్రారంభమైనప్పటికీ,నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్లో తలెత్తిన కేసుల కారణంగా ప్రాజెక్ట్ పూర్తిగా నిలిచిపోయింది. ఆ సమయంలో అవసరమైన పర్యావరణ అనుమతులు సాధించడంలో,సమస్యలను పరిష్కరించడంలో నాటి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఫలితంగా ప్రజల ధనం, విలువైన కాలం వృథా అయ్యే దుస్థితి నెలకొంది.ఈ దుస్థితికి చరమగీతం పాడుతూ డిసెంబర్ 2023లో కొలువుదీరిన ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే పర్యావరణ అనుమతుల సాధనపై ప్రత్యేకదృష్టి సారించింది. యుద్ధప్రాతిపదికన చేపట్టిన కృషితో ఫిబ్రవరి 2024 నాటికే అనుమతులు లభించడంతో నిర్మాణ పనులకు మళ్లీ మోక్షం లభించింది. 2024 ఫిబ్రవరి 20న అత్యంత విజయవంతంగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించగా, అదే ఏడాది మే 7న సవరించిన పర్యావరణ అనుమతులు సంపూర్ణంగా చేతికందాయి. దాదాపు 19 నెలల సుదీర్ఘ అంధకార బంధుర విరామం తర్వాత ప్రాజెక్ట్ పనులు మళ్లీ వేగవంతమయ్యాయి. మే 14 నాటికి యూనిట్-1, యూనిట్-2బాయిలర్ లైట్-అప్ ప్రక్రియను దిగ్విజయంగా పూర్తి చేయగా, సెప్టెంబర్ 12న యూనిట్-2 ను గ్రిడ్‌కు అనుసంధానించి చారిత్రాత్మక మైలురాయిని అధిగమించారు.

మరోవైపు అటవీ భూముల అనుమతుల్లో గతంలో జరిగిన తీవ్రమైన జాప్యం కారణంగా నీటి సేకరణ (రా వాటర్ ఇన్‌టెక్), రైల్వే లైన్ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. నూతన ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన వెంటనే స్పందించి, 13.195 హెక్టార్ల అటవీ భూమిని టీజీజెన్‌కోకు బదలాయించేలా కేంద్ర ప్రభుత్వ పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి 2023 డిసెంబర్ 15 నాటికి స్టేజ్-2 అనుమతులు సాధించింది. దీనితో మార్షలింగ్ యార్డ్, రైల్వే లైన్ అనుసంధాన మార్గంలోని ప్రధాన అడ్డంకులు తొలగిపోయాయి. దక్షిణ మధ్య రైల్వే అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ అధికారులు పనులను పరుగులుపెట్టించారు. ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల సమక్షంలో 2024 నవంబర్ 3న యూనిట్-1 ను గ్రిడ్‌కు అనుసంధానించడంతో పాటు, ప్లాంట్ రైల్వే సైడింగ్‌కు చేరుకున్న తొలి బొగ్గు రైలును ఘనంగా ప్రారంభించడం జరిగింది.భెల్ (బిహెచ్ఈఎల్) సంస్థ ఇంకా కొన్ని సాంకేతిక వ్యవస్థల పనులు పూర్తి చేయవలసి ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రజల విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఉత్పత్తినిప్రారంభించడం జరిగింది. రాబోయే ఆరు నెలల్లో మిగిలిన పనులన్నీ పూర్తి చేసి ప్లాంట్‌ను పూర్తి స్థాయి సామర్థ్యానికి తీసుకురావడానికి ప్రణాళికాబద్ధంగా అధికారులు అడుగులు వేస్తున్నారు. పనులు పునఃప్రారంభించిన ఏడాది తిరిగేసరికల్లా, 2025 జనవరి నాటికి మొదటి 800 మెగావాట్ల యూనిట్ జాతికి అంకితమైంది.

**అసాధారణ రీతిలో:**

ఆ తర్వాత 2025-26, 2026-27 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో మరో మూడు యూనిట్లు (3800 మెగావాట్లు) ఒక్కొక్కటిగా అందుబాటులోకి వచ్చాయి. దీనిఫలితంగా ప్రస్తుత 2026-27 కాలానికి టీజీజెన్‌కో మొత్తం థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం అసాధారణ రీతిలో పెరిగి ఏకంగా 7,180 మెగావాట్లకు చేరుకుంది.గత పాలకులు రాష్ట్ర జీవనాడి అయిన సింగరేణి సంస్థను పూర్తిగా విస్మరించి నిర్వీర్యం చేసే ప్రయత్నం చేశారు. దశాబ్ద కాలంలో కనీసం ఒక్క కొత్త బొగ్గు గనిని కూడా సాధించలేకపోగా, ఉన్న కొన్ని గనులను మూసివేయడంతో సింగరేణి తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఈ పెనుసమస్యను సమర్థంగా తిప్పికొట్టేందుకు ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించింది.

# 'గాంధీ పరివార్' కోసం ప్రాణామిస్తావా?

## మీకు ఒట్లేసి, మిమ్మల్ని గెలిపించి అధికారమిచ్చిన ప్రజలను ఏం జేస్తవ్?

**'కాంగ్రెస్ కుట్ర బయటపడింది'**

**రేవంత్ 'గాంధీ పరివార్'పై బీజేపీ ఫైర్**

**రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శలు**

**రేవంత్ వ్యాఖ్యల వీడియోను 'ఎక్స్'లో పంచుకున్న భండారీ**

**ఎమర్జెన్సీ, 1984 అల్లర్ల వంటి అంశాల ప్రస్తావన**

**నిలంబూర్‌లో బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు అందుకుంటూ రేవంత్ వ్యాఖ్యలు**

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన 'గాంధీ పరివార్-సంఘ్ పరివార్' వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. కేరళ నిలంబూర్‌లో రేవంత్ చేసిన కామెంట్స్ తీవ్ర దుమారంగా మారాయి. దేశ భవిష్యత్తు కోసం జరుగుతున్న రాజకీయ పోరు ఈ రెండు పరివార్ల మధ్యేనని అన్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ రేవంత్ వీడియోను సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పంచుకున్నారు. రేవంత్ 'గాంధీ పరివార్' కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు.

**'కాంగ్రెస్ లక్ష్యం అదే' అంటూ ఆరోపణ**

రేవంత్ వ్యాఖ్యలు కాంగ్రెస్ రాజకీయ లక్ష్యాన్ని బయటపెట్టాయని భండారీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రధాన ఉద్దేశం గాంధీ కుటుంబాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావడమేనని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం వంటి అంశాల కంటే కుటుంబ రాజకీయాలకే కాంగ్రెస్ ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. గాంధీ-వాద్రా కుటుంబ పాలన అంటూ విమర్శలు గుప్పించిన భండారీ పలు చారిత్రక, రాజకీయ అంశాలను ప్రస్తావించారు. ఎమర్జెన్సీ, 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు, 26/11 ముంబయి ఉగ్రదాడుల సమయంలో భారత స్పందన వంటి అంశాలను ఆయన గుర్తుచేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం, దేశ ఆర్థిక పరిస్థితి, పేదరికం వంటి అంశాలపైనా వ్యాఖ్యలు చేశారు.

# వినాయక విగ్రహాల నిమజ్జనంతో...

## నీటి నాణ్యత, పర్యావరణంలో వచ్చే మార్పులపై సమగ్ర కార్యాచరణ




- **జలాశయాల పరిరక్షణకు విస్తృత అవగాహన**
- **కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా టీజీపీసీబీ కాలుష్య నియంత్రణ చర్యలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 26(మనం బ్యూరో): వినాయక విగ్రహాల నిమజ్జనాలతో జలవనరుల నీటి నాణ్యతలో వచ్చే మార్పులను గుర్తించి పర్యావరణంపై ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేయడం భవిష్యత్‌లో అవసరమైన కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టడమే లక్ష్యంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నది. ఇందులో భాగంగా జలాశయాల పరిరక్షణకు విస్తృత అవగాహన కార్యక్రమాలు, నీటి నాణ్యత పర్యవేక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన సవరించిన మార్గదర్శకాల ప్రకారం వినాయక నిమజ్జనానికి చేపడుతున్న చర్యలలో భాగంగా ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 3.26 లక్షల మట్టి గణపతి విగ్రహాలను పంపిణి చేసింది. ప్రకృతి నుంచి లభించిన మట్టితో గణపతి విగ్రహాన్ని రూపొందించి పూజా కార్యక్రమాల తరువాత తిరిగి అదే ప్రకృతిలో లీనమవడమనే భారతీయ తాత్వికతను పర్యావరణ పరిరక్షణతో అనుసంధానించి కార్యక్రమాలను చేపడుతున్నది. నానాటికీ పెరుగుతున్న పర్యావరణ కాలుష్యాన్ని గాడిలో పెట్టేందుకు గత దశాబ్దకాలంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తూ టీజీపీసీబీ ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నది. ఇందులో భాగంగా 2022లో 1.56 లక్షలు, 2023లో 1 లక్ష, 2024లో 2.34 లక్షలు, 2025లో 2.35 లక్షల మట్టి గణపతి విగ్రహాలను రూపొందించి పంపిణీ చేసింది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే వినాయక విగ్రహాల నిమజ్జనం అనంతరం పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తూ రసాయనిక రంగుల్లో ఉండే సీసం, క్రోమియం, క్యాడ్మియం, పాదరసం, ఆర్సెనిక్ వంటి భారీ లోహాల కారణంగా జలాశయాల్లో నీటి నాణ్యత దెబ్బతినడంతో పాటు జలచర జీవులకు కలిగే హాని, నీటిలో విషపూరిత పదార్థాలు పేరుకు పోవడం, అవక్షేపాల కాలుష్యంతో పాటు మనుషుల్లో చర్మ, శ్వాసకోశ వ్యాధులు పెరిగే పరిస్తితుల నేపథ్యంలో ప్రతి ఏటా పర్యావరణహిత మట్టి వినాయకులను ప్రతిష్టించాల్సిందిగా పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటోలపై మట్టి గణపతుల ప్రాధాన్యత, పర్యావరణహిత నిమజ్జనం, జలవనరుల పరిరక్షణ వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది.

# రూ.50 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం

- **టూరిజం పాలసీతో రూ.22,174 కోట్ల ప్రతిపాదనలు**
- **పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

హైదరాబాద్, సెప్టెంబర్ 26(మనం న్యూస్): తెలంగాణను దేశంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన అగ్రశ్రేణి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. తెలంగాణ టూరిజం పాలసీ 2025-30 ద్వారా రాష్ట్రంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, ఐదు లక్షల మంది యువతకు నూతన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శనివారం శిల్పారామంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణకు ఘనమైన చరిత్ర, అద్భుతమైన వారసత్వం, ఆధ్యాత్మిక కేంద్రాలు, సుసంపన్నమైన సంస్కృతి, ప్రకృతి వనాలు, వన్యప్రాణులు, ప్రత్యేక వంటకాలు,ఆధునిక పట్టణ ఆకర్షణలు అన్నీ కొలువుదీరాయని జూపల్లి కొనియాడారు. హైదరాబాద్‌లోని చారిత్రక సంపద మొదలుకొని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన రామప్ప దేవాలయం వరకు, వరంగల్, యాదాద్రి, భద్రాచలం, నాగార్జునసాగర్, సోమశిల, నల్లమల అడవులు, సుందర జలపాతాల వరకు రాష్ట్రంలో విభిన్న పర్యాటక అనుభవాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని మంత్రి వివరించారు.

**రూ.50 వేల కోట్ల పెట్టుబడులు:**

తెలంగాణ టూరిజం పాలసీ 2025-30 కింద తొలుత రూ.15 వేల కోట్ల పెట్టుబడులను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దిశానిర్దేశంతో దానిని ఏకంగా రూ.50 వేల కోట్లకు పెంచామని మంత్రి వెల్లడించారు. దేశీయ,అంతర్జాతీయ పర్యాటకుల రాకలో తెలంగాణను దేశంలోనే తొలి వరుసలో నిలపడానికి పటిష్టమైన చర్యలు చేపట్టామని జూపల్లి వెల్లడించారు.

ఈ టూరిజం పాలసీ అమల్లోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రాష్ట్రానికి అసాధారణ రీతిలో ఏకంగా రూ.22,174 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని, వాటిని త్వరలోనే పూర్తిస్థాయిలో కార్యరూపంలోకి తీసుకువస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వ రంగ పెట్టుబడులతో పాటు పీపీపీ (పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) విధానాన్ని, ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేస్తామని పేర్కొన్నారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవం-2026 ప్రధాన ఇతివృత్తమైన 'డిజిటల్ ఎజెండా,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి పునఃరూపకల్పన' తెలంగాణకు ఎంతైనా సరిపోతుందని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, డేటా అనలిటిక్స్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా పర్యాటకులకు వ్యక్తిగత అవసరాలకు తగినట్లుగా ప్రయాణ ప్రణాళికలు రూపొందించడం, బహుభాషా సహాయం అందించడం, వారసత్వ సంపదను డిజిటల్ విధానంలో సరికొత్త వర్చువల్ అనుభవాలతో పరిచయం చేయడం సాధ్యమవుతుందని మంత్రి వివరించారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర పర్యాటక శాఖ వెబ్‌సైట్‌ను అత్యంత ఆధునిక హంగులతో పునఃరూపకల్పన చేసి ప్రారంభించామని, దీని ద్వారా పర్యాటకులు అన్ని వివరాలను సులభంగా తెలుసుకోవచ్చని మంత్రి తెలిపారు.

**సరికొత్త ప్రయోగాలకు శ్రీకారం:**

పర్యాటక రంగంలో ఎన్నడూ లేనివిధంగా సరికొత్త ప్రయోగాలకు శ్రీకారం చుడుతూ 'రివర్స్ టూరిజం - ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్'ను ప్రారంభించినట్లు మంత్రి ప్రకటించారు. కేవలం నగరవాసులు పల్లెలకు వెళ్లడమే కాకుండా, అడవి బిడ్డలు సైతం ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వైభవాన్ని ప్రత్యక్షంగా తిలకించేలా ఈ కార్యక్రమం దోహదపడుతుందని చెప్పారు. ఇందులో భాగంగా ములుగు జిల్లాకు చెందిన 100 మంది గిరిజన అతిథులను హైదరాబాద్‌కు ఆహ్వానించి నగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను చూపించామని, ఆధునిక నాగరికతలో వచ్చిన మార్పులను వారు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించామని జూపల్లి ఆనందం వ్యక్తం చేశారు. స్థానికంగా యువత, మహిళలు, కళాకారులు, గైడ్లు, హోటల్ నిర్వాహకులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా గ్రామీణ, పర్యావరణ ఆధారిత పర్యాటకాన్ని ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. అడవులు, జలవనరులు, సహజ వాతావరణం దెబ్బతలకుండా సుస్థిరమైన, బాధ్యతాయుతమైన పర్యాటకాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి జూపల్లి కృష్ణారావు పునరుద్ఘాటించారు.

## కాలం ఒకేలా వుండదు

నిన్ను నడిపే కాలం నువ్వు నడిచే కాలం
మన కళ్ల ముందు క్షణాలు క్షణాలుగా
కదిలిపోయే కాలం కరిగి పోయే కాలం
ఇప్పుడు ఎప్పుడు ఎల్లప్పుడూ....
ఒకేలా వుండదు..ఒక్కరి కోసం వుండదు
కాలం మనదేలే అనుకుంటే పొరపాటే
కాలం వెంట మనం నడుస్తుంటాం
మన వెంట కాల మెప్పుడూ నడవదు
మనలా అస్సలు నడవదు
మన కోసం కూడా నడవదు

ఈ రోజు వున్నట్లే
రేపు కూడా వుండదు కాక వుండదు
రేపన్నది ఎప్పుడూ ఓ అస్పష్ట చిత్రం
వర్తమానంలోకి వచ్చే వరకూ
అది ఒరి ఊహ
ఈ రోజు నువ్వు నిలబడ్డట్టే
రేపూ నిలబడతానని అనుకోకు
కాలపు తులాభారంలో
నువ్వు ప్రతీ సెకనూ తూచబడతావు
నీ చిత్తశుద్ధి పనులే
నీ గెలుపుకు గీటురాయి
భూమ్మీది నువ్వు
ఆకాశంలోకి ఎగరటం
ఆకాశం నుంచి రెప్పపాటులో
భూమ్మీదికి పడిపోవటం
వికృతమూ కాదు వింతేమీ కాదు

నాయకుడా....ప్రజా తీర్పు పదిలం
మాటల గారడీలు మూట గట్టుకో
కాలం గీసే గీతల్ని
నువ్వెప్పుడూ కాలిక్యులేట్ చేయలేవు
కాలం ఎప్పుడూ ఒకేలా వుండదు
ఎల్ నినొకు ఎండిపోవచ్చు
వర్షానికి నిండా తడిచిపోనూ వచ్చు
కాలంతో ప్రయాణం చెయ్ అంతే..
నీ విజయం కాలమున్నంతకాలం
నిలువెత్తు నిలుస్తుందను కోకు
కాలం నువ్వెక్కిన బుల్లెట్టు బండి కాదు
కాలంపై స్వారీ కుదరదుకాక కుదరదు
కాలం నిన్ను తుడిచేయక ముందే
కాలంతో సఖ్యతగా వుండు
గుర్తుపెట్టుకో..
కాలం ఎప్పుడూ ఒకేలా వుండదు..!

**- డా.కటుకోర్ఘ్వల రమేష్**
9949083327

# నదీ ప్రదేశాలను ఆక్రమిస్తే మూల్యం తప్పదు

ప్రపంచ నదుల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నాల్గవ ఆదివారం (ఈసారి సెప్టెంబర్ 27వ తేదీ) నిర్వహిస్తారు. జీవావరణ వ్యవస్థలు, వ్యవసాయం, మానవ నాగరికతల మనుగడలో నదుల ప్రాముఖ్యతను గుర్తించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. మన నదులను కాపాడుదాం - మన భవిష్యత్తును భద్రపరుద్దాం. నదులు తాగునీరు, సాగునీరు, పరిశ్రమలు ఇతర దైనందిన అవసరాలకు అవసరమైన నీటిని అందిస్తాయి. ఇవి అనేక జలచర, భూచర జీవావరణ వ్యవస్థలకు ఆవాసాలుగా ఉండటంతో పాటు జీవ వైవిధ్య పరిరక్షణకు ఎంతో దోహదపడతాయి. కాలుష్యం, అధిక నీటి వినియోగం, నదీ పరివాహక ప్రాంతాల ఆక్రమణలు వాతావరణ మార్పుల వల్ల నదులు ఎదుర్కొంటున్న ముప్పులపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం లక్ష్యం. నదుల శుభ్రత, సంరక్షణ కార్యక్రమాల్లో ప్రజలు స్థానిక సమాజాలు చురుకుగా పాల్గొనాలి. భవిష్యత్ తరాలకు నీటి భద్రతతో పాటు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే నదులను నేడు పరిరక్షించడం అత్యంత అవసరం. ప్రపంచ నదుల దినోత్సవం పరిశుభ్రమైన, నిరంతరం ప్రవహించే నదులు సుస్థిరమైన మరియు సమృద్ధమైన భవిష్యత్తుకు ఎంతో కీలకమని మనకు గుర్తుచేస్తుంది. ప్రపంచ నదుల దినోత్సవం 2026 అధికారిక ఇతివృత్తం అడవులు లేకపోతే నదులు లేవు, నదులు లేకపోతే నీరు లేదు, నీరు లేకపోతే జీవం లేదు.

నదీ ప్రవాహ ప్రాంతాలు, వరద మైదానాలు ప్రధానంగా వేగవంతమైన పట్టణీకరణ, వాణిజ్య భవనాల నిర్మాణం, వ్యవసాయ విస్తరణ, రహదారులు, వంతెనల అభివృద్ధి, పారిశ్రామిక కార్యకలాపాలు, ఘన వ్యర్థాల అక్రమ పారవేత, ఇసుక తవ్వకాలు, భూమిని మట్టితో నింపడం, నదీతీర వృక్ష సంపద తొలగింపు, అనధికారిక నివాసాల ఏర్పాటు వంటి కారణాల వల్ల క్రమంగా తగ్గిపోతున్నాయి. నదీ ప్రాంతాల ఆక్రమణ వల్ల సహజ నదీ ప్రవాహ మార్గం ఇరుకుగా మారింది. ఫలితంగా నది నీటిని మోయగల సామర్థ్యం తగ్గి, వరదలు మరింత తరచుగా తీవ్రంగా సంభవించే ప్రమాదం పెరుగుతుంది. అంతే కాకుండా, సహజ నీటి పారుదల వ్యవస్థకు ఆటంకం ఏర్పడి, నదీ తీరాల కోత పెరగడంతో పాటు సమీప ప్రాంతాల్లో నీరు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. భవనాల నిర్మాణం, కాంక్రీటీకరణ వల్ల భూగర్భ జలాల పునర్భరణ తగ్గి, చిత్తడి నేలలు, జలచర జీవావాసాలు దెబ్బతింటాయి. గృహ మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు, ఘన వ్యర్థాల వల్ల నీటి కాలుష్యం పెరిగి, నీటి నాణ్యత తగ్గడంతో పాటు జీవ వైవిధ్యానికి ముప్పు ఏర్పడుతుంది. 2026లో నిర్వహించిన ఒక ప్రపంచ అధ్యయనం 7.52 మిలియన్ కిలోమీటర్ల నదీ తీర ప్రాంతాలను మ్యాప్ చేయగా, వాటిలో దాదాపు 20% మానవ కార్యకలాపాల వల్ల మార్పులకు గురైనట్లు గుర్తించింది. ఇందులో 13.43% వ్యవసాయ కార్యకలాపాల ప్రభావానికి, 6.29% నిర్మిత ప్రాంతాల ప్రభావానికి గురయ్యాయి. మరో ప్రపంచ స్థాయి అధ్యయనం 520 ప్రధాన నదీ పరీవాహక ప్రాంతాలను పరిశీలించి, 1992-2019 మధ్య సుమారు 6,00,000 చదరపు కిలోమీటర్ల సహజ వరద మైదానాలు ఇతర అవసరాలకు మార్చబడినట్లు అంచనా వేసింది. ఇందులో సుమారు 4,60,000 చదరపు కిలోమీటర్లు వ్యవసాయానికి, 1,40,000 చదరపు కిలోమీటర్లు అభివృద్ధి చెందిన ప్రాంతాలకు మార్చబడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా 100 సంవత్సరాల వరద మైదానాల్లో పట్టణ ప్రాంతాల విస్తీర్ణం 1985లో 16,443 చదరపు కిలోమీటర్ల నుంచి 2018లో 92,233 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. అంటే నాలుగు రెట్లకు పైగా పెరుగుదల నమోదైంది. ఈ కాలంలో ప్రపంచ పట్టణ విస్తరణలో 12.6% వరద మైదానాల్లోనే జరిగింది.

భారతదేశంలో, ముఖ్యంగా వేగంగా పట్టణీకరణ జరుగుతున్న ప్రాంతాల్లో, నదీ



ప్రాంతాల ఆక్రమణ ఒక ప్రధాన పర్యావరణ సమస్యగా మారింది. భారతదేశంలో నిర్వహించిన మొదటి నీటి వనరుల గణన ప్రకారం దేశవ్యాప్తంగా 24,24,540 నీటి వనరులు గుర్తించబడ్డాయి. వీటిలో 38,496 (సుమారు 1.59%) నీటి వనరులు ఆక్రమణకు గురైనట్లు నమోదయ్యాయి. రాష్ట్రాల వారీగా చూస్తే ఉత్తరప్రదేశ్‌లో 15,301, తమిళనాడులో 8,366, ఆంధ్రప్రదేశ్‌లో 3,920, తెలంగాణలో 3,032 నీటి వనరులు ఆక్రమణకు గురైనట్లు నమోదయ్యాయి. Central Water Commission అధ్యయనం ప్రకారం 1986-2022 మధ్య సుమారు 21 మిలియన్ హెక్టార్ల ప్రాంతం వరదల ప్రభావానికి గురైంది. 2024 కేంద్ర జల సంఘం (CWC) అంచనా ప్రకారం, భారతదేశ నదీ పరివాహక ప్రాంతాల సగటు వార్షిక నీటి లభ్యత సుమారు 2,115.95 బిలియన్ ఘన మీటర్లు (BCM)గా ఉంది. 2025 CPCB నివేదిక ప్రకారం 271 నదులపై 296 కాలుష్యానికి గురైన నదీ ప్రాంతాలు గుర్తించబడ్డాయి, అయితే 2018లోని 351తో పోలిస్తే ఇది తగ్గింది.

2025లో భారతదేశంలో భూగర్భజలాల వార్షిక పునర్భరణ 448.52 బిలియన్ ఘన మీటర్లు (BCM)గా, వార్షికంగా వినియోగించదగిన భూగర్భజల వనరు 407.75 బిలియన్ ఘన మీటర్లు గా, భూగర్భజలాల వార్షిక వెలికితీత 247.22 బిలియన్ ఘన మీటర్లు గా అంచనా వేయబడింది. మరోవైపు నదుల్లో సేంద్రియ కాలుష్యం పెరగడం వల్ల జీవరసాయన ఆక్సిజన్ డిమాండ్ పెరిగి, నీటిలో కరిగిన ఆక్సిజన్ తగ్గుతుంది. నదీ కాలుష్యం తాగునీటి శుద్ధి ఖర్చులను పెంచి, నీటి వినియోగయోగ్యతను తగ్గిస్తుంది. ఇది చేపల వనరులు, జలచర జీవవైవిధ్యం మరియు నదులపై ఆధారపడే జీవనోపాధులను కూడా ప్రభావితం చేస్తుంది. కాలుష్యంతో వ్యవసాయానికి ఉపయోగించే నీటి నాణ్యత తగ్గి, దీర్ఘకాలంలో నేల మరియు ఆహార భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉంది. అయితే 2018లోని 351 కాలుష్యిత నదీ ప్రాంతాలతో పోలిస్తే 2025లో ఈ సంఖ్య 296కి తగ్గింది, అలాగే 71 ప్రాంతాల్లో నీటి నాణ్యత మెరుగుపడింది.

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు నదుల సుస్థిరతను మెరుగుపరచడానికి సమగ్ర నదీ పరీవాహక ప్రాంత నిర్వహణ, మురుగునీటి శుద్ధి, వరద మైదానాల పరిరక్షణ, పర్యావరణ ప్రవాహాల నిర్వహణ, చిత్తడి నేలల పునరుద్ధరణ, అడవుల పెంపకం వంటి చర్యలను అమలు చేస్తున్నాయి. యూరోపియన్ యూనియన్ వాటర్ ఫ్రేమ్‌వర్క్ డైరెక్టివ్ నదీ పరీవాహక ప్రాంతాల స్థాయిలో నిర్వహణ , కాలుష్య నియంత్రణ ద్వారా నదుల మంచి పర్యావరణ, రసాయన స్థితిని సాధించడాన్ని ప్రోత్సహిస్తుంది.

అంతర్జాతీయ స్థాయిలో ఐక్యరాజ్యసమితి ప్రకృతి ఆధారిత పరిష్కారాలను ప్రోత్సహిస్తోంది. వీటిలో చిత్తడి నేలల పునరుద్ధరణ, నదీ పరివాహక ప్రాంతాల పరిరక్షణ, మంచినీటి జీవావరణ వ్యవస్థల సంరక్షణ ముఖ్యమైనవి. ఈ చర్యలు వరద నియంత్రణ, నీటి నిల్వ, జీవ వైవిధ్య పరిరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించడంలో సహాయపడతాయి.

భారతదేశంలో నమామి గంగే కార్యక్రమం.. నదీ కాలుష్య నియంత్రణ, గంగా నది పునరుజ్జీవనంపై ప్రధానంగా దృష్టి సారిస్తుంది. ఈ కార్యక్రమంలో మురుగునీటి శుద్ధి, నది ఉపరితల శుభ్రత, జీవ వైవిధ్య పరిరక్షణ, అడవుల పెంపకం, పారిశ్రామిక వ్యర్థాల పర్యవేక్షణ, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి చర్యలు ఉన్నాయి. గంగా నదిలో నిరంతరమైన, కాలుష్యరహిత నీటి ప్రవాహాన్ని కొనసాగించడం, నది పర్యావరణ సమగ్రతను పరిరక్షించడం కూడా దీని ముఖ్య లక్ష్యాలలో భాగం. భారతదేశం నీటి వినియోగ అవసరాలను పర్యావరణ అవసరాలతో సమతుల్యం చేయడానికి నదీ పరీవాహక ప్రాంత నిర్వహణ ప్రణాళికలను ప్రోత్సహిస్తోంది. అదనంగా, వరద మైదానాల పరిరక్షణ, క్యాచ్మెంట్ ప్రాంతాల అభివృద్ధి, ఘన వ్యర్థాల నిర్వహణ మరియు జలచర జీవ వైవిధ్య పునరుద్ధరణ వంటి చర్యలు చేపడుతున్నారు.

నదుల పరిరక్షణకు ప్రభుత్వం, స్థానిక సమాజాలు, పర్యావరణ సంస్థలు కలిసి పనిచేసే సమగ్ర విధానం అవసరం. ఆక్రమణలను నివారించడానికి నదీ సరిహద్దులు, వరద రేఖలు, రక్షిత బఫర్ ప్రాంతాలను స్పష్టంగా గుర్తించాలి. గృహ మురుగునీటిని నదుల్లోకి విడుదల చేసే ముందు తప్పనిసరిగా శుద్ధి చేయాలి. పారిశ్రామిక కాలుష్యాన్ని నియంత్రించడానికి పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థజలాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, పర్యావరణ ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలి. జలచర జీవావరణ వ్యవస్థలు, భూగర్భ జలాల పునర్భరణ, దిగువ ప్రాంతాల్లో నివసించే సమాజాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తగిన పర్యావరణ ప్రవాహం కొనసాగించాలి. వరదలు, నదీ తీరాల కోత జీవావాసాల నష్టాన్ని తగ్గించడానికి చిత్తడి నేలలు, వరద మైదానాలు, నదీతీర వృక్ష సంపదను పునరుద్ధరించాలి.

శాస్త్రీయ అంచనాలు, సమర్థవంతమైన పర్యవేక్షణ ద్వారా అనియంత్రిత ఇసుక తవ్వకాలు, నదీ గర్భంలో మార్పులను నియంత్రించాలి. ఘన వ్యర్థాలు, ప్లాస్టిక్, నిర్మాణ వ్యర్థాలు నదుల్లోకి చేరకుండా సమర్థవంతమైన వ్యర్థ నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. నదుల్లోకి మట్టి కొట్టుకుపోవడం, పూడిక పేరుకుపోవడాన్ని తగ్గించేందుకు క్యాచ్మెంట్ ప్రాంతాల అభివృద్ధి, అడవుల పెంపకం నేల సంరక్షణ చర్యలను ప్రోత్సహించాలి. తొమ్మిదవది, భౌగోళిక సమాచార వ్యవస్థ మరియు డ్రోన్లను ఉపయోగించి సమగ్ర నదీ పరీవాహక ప్రాంత నిర్వహణ చేపట్టడం ద్వారా ఆక్రమణలు, కాలుష్యం నదీ ప్రవాహంలో మార్పులను సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చు. ప్రజల భాగస్వామ్యం, పర్యావరణ విద్య, నదీ శుభ్రత కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలి. ఈ చర్యలన్నింటినీ సమన్వయం చేస్తూ పరిరక్షించు - నిరోధించు - పునరుద్ధరించు- పర్యవేక్షించు (Protect&Prevent&Restore&Monitor) అనే విధానాన్ని అమలు చేయడం ద్వారా సుస్థిర నదీ నిర్వహణకు తోడ్పడవచ్చు.

**- కిరణ్‌శ్రీ**
8125695799

# 'దిక్సూచి' తెలంగాణ సాహితి దశాబ్ది సంచిక



మనకు గుర్తుండే ఉంటుంది. ఏడాది గడిచి పోతుంటే పత్రికలు అన్ని రంగాలలో వృద్ధిని కొలిచినట్లే సృజన శీలుల తీరుతెన్నెలను నిష్ణాతుల ద్వారా ఆ ఏడాది సృజించిన సాహిత్య సంపదను పత్రికలు అంచనా వేయించేవి. ముఖ్యమైన కవితా సంపుటాలు, నవలలు, కథలు విమర్శ, నాటకం మొదలైన అన్ని ప్రక్రియల మీద ఒక అవగాహన కలిగించే ప్రయత్నం చేసేవి. కొన్ని కొన్ని సందర్భాలలో దీపావళి వంటి ప్రత్యేక సంచికలు వెలువరించేవి అప్పటి కవులు సాహిత్యాభిమానులు వాటిని విలువైన సంపదగా భద్రపరుచుకునేవారు.

స్వరాష్ట్రం ఏర్పడి దశాబ్దం గడిచిపోయింది. స్వీయ పాలనలో సాహిత్య పరంగా మనం చేసిన కృషి ఏమిటనే ప్రశ్నకు నిలువుటద్దంగా నిలిచే ప్రత్యేక సంచిక తెలంగాణ సాహితీ దశాబ్ది సాహిత్య ప్రత్యేక సంచిక. తెలంగాణ సాహితి గురించి సాహిత్య ప్రియులకు పెద్దగా పరిచయం చేయనక్కరలేని క్రియాశీలమైన సాహిత్య వేదిక.ప్రతి సందర్భంలో కవులను, కళాకారులను, రచయితలను దిశా నిర్దేశం చేయటంలో తన వంతు కృషి తాను చేస్తూనే ఉంది.

ఇందులో ఈ 10 ఏళ్లలో తెలుగు సాహిత్యంలో కృషిచేసి,భాషకు ఎన్నో సేవలు అందించి పరమపదించిన దాదాపు 50 మంది సాహిత్య మూర్తుల స్ఫూర్తి వ్యాసాలను ప్రముఖ రచయితల చేత రాయించడం ఆ మహానుభావు లకు చెల్లించిన ఘన నివాళి.

తెలంగాణ సాహితికి ఎన్నో సేవలు అందించిన తంగిరాల చక్రవర్తి, విమర్శ రంగంలో దారి దీపమైన కేకేఆర్, యుద్ధ నౌక గద్దర్, పాటకు ప్రాణం పోసిన గూడ అంజయ్య, విమర్శకు పాఠ్యపుస్తకమైన పరిశోధనా గ్రంథాన్ని అందించిన ఎస్వీ రామారావు వంటి ప్రముఖులపై




ఆలోచించదగ్గ వ్యాసాలు ఇందులో ఉన్నాయి.

అట్లాగే వర్తమాన సుప్రసిద్ధ కవులు డాక్టర్ అప్సర్, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, జూపాక సుభద్ర,గోరటి వెంకన్న, డాక్టర్ అమృతలత, డాక్టర్ యాకూబ్, మోత్కూరి నరహరి, జూకంటి జగన్నాథం, ఇలాంటి ప్రముఖులతో ముఖాముఖి జరిపి వర్తమాన సాహిత్య మూల్యాంకనం చేయడం జరిగింది. ఇవాళ కవిత్వం రాస్తున్న సుప్రసిద్ధ కవులు 81 మంది కవితలు మనకు నేటి సాహిత్య సొగసును, చైతన్యాన్ని కళ్ళకు చిత్రికను పడతాయి.

530 పేజీలున్న ఈ ప్రత్యేక సంచికకు సంపాదకులుగా ఉన్న రచయిత, కవి కె.ఆనందాచారి సంపాదకీయం రాస్తూ 'ఈ దశాబ్ద కాలం పెద్దది ఏమీ కాదు. కానీ మన సాహిత్య రంగం నడక దిశ ఎట్లా ఉందో తెలుసుకునేందుకు ఈ పదేళ్ల కాలం సరిపోతుందని' అంచనా వేశారు. మన రచయితల, కవుల దృక్పథం ఏంటో అర్థం చేసుకోవచ్చు. భవిష్యత్తులో ఇంకా ఏం చేయాలో మనం అంచనాలు వేసుకొని ముందుకు సాగవచ్చు. ఈ సంచికలో మరో సుప్రసిద్ధ సంపాదకులు, విశ్లేషకులు తెలకపల్లి రవి చేసిన విశ్లేషణ దశాబ్ది ఉత్సాహంతో విశాల ప్రజాస్వామ్య వేదికగా తెలంగాణ సాహితి ఎదగాలని రాసిన వ్యాసం అందరం చదవ తగినది.

దళిత, బహుజన, బీసీవాద, స్త్రీవాద మైనారిటీ వాద, అస్థిత్వవాద కవుల కృషికి ఈ సంచిక దిక్సూచిగా నిలుస్తుంది. ఇందులో యస్. రఘు, సీతారాం, ప్రసేన్, మామిడి హరికృష్ణ, కోటేశ్వర రావు, టి ఉదయవర్లు, ఆచార్య బన్న ఐలయ్య వంటి సీనియర్ రచయితల విశ్లేషణలు యాకమ్మ వంటి వర్ధమాన రచయిత్రుల రచనలు మనల్ని భిన్నంగా ఆలోచింపచేస్తాయి. డాక్టర్ జె. చెన్నయ్య ఈ పదేళ్లు తెలంగాణ సారస్వత పరిషత్తు చేసిన కృషిని, వికాసాన్ని తన వ్యాసంలో సోదాహరణంగా వివరించారు.

డాక్టర్ ముదిగంటి సుజాతరెడ్డి, డాక్టర్. నందిని సిద్ధారెడ్డి, డాక్టర్. సి మృణాళిని అంపశయ్య నవీన్, గింజల నరసింహారెడ్డి సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కె. శ్రీనివాస్, ఏనుగు నరసింహారెడ్డి మొదలైన వ్యక్తుల ముఖా ముఖి ఇంటర్వ్యూలు సృజన కారులకు ఎంతో ఉపయోగం.

తెలంగాణ సాహిత్య దశాదిశను సూచించే ప్రసిద్ధ కవుల కవితలు 81 మనల్ని అలరింపజేస్తాయి. ఆలోచింపజేస్తాయి కూడా. ఈ సంచిక ప్రత్యేకమైనది. సంపాదకులు ఆనందచారి వారి సంపాదకవర్గం చేసిన కృషి తెలుగు సాహిత్య చరిత్ర భద్రపరచుకొని గుర్తుపెట్టుకుంటుంది. సంపాదకులకు,వారి వర్గానికి అభినందనలు.

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

# సామాన్యుడి నెత్తిన 'ఎండీఆర్'! పిడుగు




పేరు గొప్ప.. ఊరు దిబ్బ' అనే తీరుగా విశ్వగురు 'భారత్' అంటూ ఓ వైపు ప్రచారం.. మరోవైపు సొంత దేశ ప్రజలపైనే ఎండీఆర్ పేరిట వసూళ్లు చేసే దిశగా భారత్ అడుగులు పడుతున్నాయి. 2016లో నోట్ల రద్దు నిర్ణయంతో ప్రజలకు కలిగిన అసౌకర్యం గురించి మాటల్లో చెప్పలేం. దేశంలోని ప్రజలంతా రూ.1,000, 2 వేలకు క్యూ లైన్లలో నిలబడి పడరాని పాట్లు పడిన ఉదంతాలు బోలెడు. ఆ సమయంలో'డిజిటల్' లావాదేవీలను ప్రోత్సహిస్తున్నట్లు కేంద్ర సర్కారు ప్రకటించింది. 'డిజిటల్ ఇండియా'కు ప్రతీకగా ప్రపంచానికి భారత్ చూపించిన డిజిటల్ నమూనాగా యూపీఐని ప్రస్తావించారు. ప్రజలకు యూపీఐని అలవాటు చేసి ఇప్పుడు చార్జీలు వేయడానికి సిద్ధమయ్యారు.

బ్రిటీష్ వారు భారతదేశంలో 'టీ' రుచి ప్రజలకు పరిచయం చేయడానికి దానిని బహిరంగ ప్రదేశాలు మార్కెట్లు, రైల్వే స్టేషన్లు తదితర వాటిల్లో తొలుత ఉచితంగా అందించేవారట. క్రమంగా అది అలవాటుగా మారిపోయింది. ఈ అలవాటును ఆసరా చేసుకొని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొలుత డిజిటల్ లావాదేవీలు చేయాలని 'డిజిటల్ భారత్' అంటూ ఆర్భాటం చేసి.. యూపీఐ చెల్లింపులను విస్తృతంగా ప్రోత్సహించి ఇప్పుడు చార్జీలు విధిస్తూ సాధారణ ప్రజలపై ఆర్థిక భారం మోపేందుకు సిద్ధమైంది.

తాజా ఎన్పీసీఐ ప్రకటన ప్రకారం.. అక్టోబర్ 15, 2026 నుంచి అర్హత కలిగిన వ్యాపారులకు రూ.2 వేలకు మించి యూపీఐ పర్సన్ టు మర్చంట్ లావాదేవీలపై0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) అమలులోకి రానుంది. ఒక్కో లావాదేవీపై గరిష్టంగా రూ.300 పరిమితి విధించడంతో పాటు కొన్ని ప్రత్యేక రంగాలకు వేరే ఫీజు నిర్మాణం ఉండనుంది. 'వినియోగదారుడిపై నేరుగా చార్జీ లేదు' అని ప్రభుత్వం వాదించొచ్చు. కానీ, యూపీఐ యాప్‌లో అదనపు చార్జీలను వ్యాపారి వస్తువు ధరలో కలిపితే వినియోగదారుడి ఖర్చులోనే అది పడుతుంది. ఇలా చార్జీల భారం మోపడం వల్ల ప్రజలు మళ్లీ నగదుపైన ఆధార పడాల్సి వస్తుంది. ఫలితంగా డిజిటల్ లావాదేవీలు మందగిస్తాయి. దాంతో మళ్లీ భౌతిక నగదు డిమాండ్ పెరిగి.. ముద్రణపైన ఖర్చు చేయాల్సి ఉంటుంది. దేశంలో ఉచిత యూపీఐ సేవలుండటం వల్ల తమ వ్యాపారం దెబ్బ తింటున్నదని అమెరికాకు చెందిన వీసా, మాస్టర్ కార్డు వంటి బడా సంస్థలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో విదేశీ ఒత్తిళ్లకు తలొగ్గి భారతదేశం వారికి అనుకూలంగా చార్జీలు విధిస్తున్నదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎండీఆర్ చార్జీల వల్ల అమెరికా కంపెనీలకు ప్రయోజనాలు చేకూరనున్న నేపథ్యంలో ప్రజాకోణంలో ఆలోచనచేసి'ఉచిత యూపీఐ'ని భారత ప్రభుత్వం కొనసాగించాలి. రూ. వేల కోట్లు ఎన్నో ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు కేటాయించే భారత ప్రభుత్వం సుమారు రూ.2,200 కోట్లు యూపీఐ నిర్వహణకు ఖర్చు చేయడం ద్వారా సామాన్యులను ఆర్థిక వ్యవస్థలో భాగం చేసి వారిని బలోపేతం చేయొచ్చు. అంతేకాకుండా వారి ఆర్థిక నిర్వహణను అర్థం చేసుకునే దిశగా ఆలోచించవచ్చు. చార్జీ విధింపు నిర్ణయాన్ని ఒకవేళ కేంద్రం ఉపసంహరించుకోనట్లయితే ప్రజాగ్రహానికి కేంద్రం గురికాక తప్పదు.

**- అంబీర్ శ్రీకాంత్**
81859 68059

# ప్రకృతి ఒడిలో జగిత్యాల పర్యాటక వైభవం



కొత్త ప్రాంతాలను చూడాలనే ఆసక్తి, అక్కడి ప్రజల జీవన విధానం, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది. అందుకే పర్యాటకాన్ని ఎంచుకుంటారు చాలామంది. పర్యాటకం వల్ల విభిన్న ప్రాంతాల సంస్కృతులను పరిచయం, ప్రకృతి అందాలను ఆస్వాదించే అవకాశం కల్పిస్తాయి. చరిత్రను తెలుసుకునే మార్గాన్ని చూపుతాయి.అయితే పర్యాటకంతో పాటు బాధ్యత కూడా ఉండాలి. పర్యావరణహిత, బాధ్యతాయుత పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా భావితరాలకు మన సహజ, చారిత్రక, సాంస్కృతిక సంపదను అందించవచ్చు.

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తెలంగాణ పర్యాటక వైభవాన్ని గుర్తుచేసుకోవడం సముచితం. తెలంగాణలో చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలకు కొదవలేదు. వాటిలో జగిత్యాల జిల్లాకు ప్రత్యేకమైన స్థానం ఉంది. చరిత్ర, ఆధ్యాత్మికత, ప్రకృతి సౌందర్యం, గోదావరి నదీ సంస్కృతి, గ్రామీణ జీవన విధానం కలగలిసిన ప్రాంతంగా జగిత్యాల జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందుతోంది.

జిల్లాలోని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి క్షేత్రం జిల్లాలోనే కాకుండా తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా నిలుస్తోంది. ఆలయ పరిసరాల్లోని కొండలు, పచ్చని చెట్లు, వర్షాకాలంలో కనిపించే ప్రకృతి సోయగాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి అందాలను ఆస్వాదించగలిగే ప్రాంతంగా కొండగట్టు ప్రత్యేక గుర్తింపు పొందింది.

గోదావరి నది తీరంలో వెలసిన ధర్మపురి జగిత్యాల జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఇక్కడి ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఆలయ దర్శనంతో పాటు గోదావరి నదీ తీరం లోని ప్రకృతి అందాలు సందర్శకులను ఆకట్టుకుంటాయి.

జగిత్యాల పట్టణంలోని చారిత్రక కోట వారసత్వ కట్టడాల్లో ఒకటి. నక్షత్రాకార నిర్మాణ శైలి, కోట చుట్టూ ఉన్న చారిత్రక నేపథ్యం పర్యాటకులను ఆకర్షించే అంశాలు. కొండగట్టు, ధర్మపురి, జగిత్యాల కోటలను అనుసంధానిస్తూ సమగ్ర పర్యాటక మార్గాలను అభివృద్ధి చేస్తే పర్యాటక అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉంది.

జగిత్యాల జిల్లా చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించే అత్యంత ముఖ్యమైన ప్రాంతాల్లో కోటిలింగాల ఒకటి. గోదావరి, పెద్దవాగు సంగమ ప్రాంతంలో ఉన్న ఈ ప్రాంతానికి ప్రాచీన చరిత్రలో విశిష్ట స్థానం ఉంది.



శాతవాహనుల తొలి రాజధానిగా కోటిలింగాల కు చారిత్రక ప్రాధాన్యం ఉంది. పురావస్తు తవ్వకాలలో లభించిన నాణేలు, మట్టి పాత్రలు, ఇతర అవశేషాలు అప్పటి నాగరికత, వాణిజ్య కార్యకలాపాలపై విలువైన సమాచారాన్ని అందిస్తున్నాయి. కోటిలింగాలను చరిత్ర, పురావస్తు, ఆధ్యాత్మికత, ప్రకృతి పర్యాటకాలను కలిపిన ప్రత్యేక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశం ఉంది.

జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ మండలంలోని వాల్గొండ.. గోదావరి నదీ తీరాన ఉన్న మరో చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశం. గోదావరి ఒడ్డున కొండ ప్రాంతం వైపు వాలుగా ఉన్న భౌగోళిక స్వరూపం కారణంగా ఈ ప్రాంతానికి వాల్గొండ అనే పేరు ఏర్పడినట్లు స్థానిక చరిత్ర. గోదావరి తీరంలోని గుట్టపై ఉన్న త్రికూటాలయం ఈ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణ. చాళుక్యుల కళా రీతులను ప్రతిబింబించే నిర్మాణ శైలి ఈ ఆలయానికి చారిత్రక ప్రాధాన్యాన్ని కల్పిస్తోంది.

గోదావరి నది జగిత్యాల జిల్లాకు ప్రకృతి ప్రసాదించిన గొప్ప వరం. కోటిలింగాల, వాల్గొండ, ధర్మపురి తదితర గోదావరి పరివాహక ప్రాంతాలను అనుసంధానం చేస్తూ పర్యావరణహిత పర్యాటక మార్గాలను అభివృద్ధి చేయవచ్చు. అయితే నదీ పర్యాటక అభివృద్ధి పేరుతో గోదావరి నదిని, నదీ పరిసరాలను కలుషితం చేయకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే పర్యాటకం అభివృద్ధి చెందుతుంది. స్థానికులకు ఉపాధి అవకాశాలు కలగే అవకాశం ఉంది.

పర్యాటక ప్రాంతాల పరిరక్షణపై విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే అవగాహన కల్పించాలి. స్థానిక చరిత్ర, వారసత్వ కట్టడాలు, ప్రకృతి వనరుల ప్రాధాన్యాన్ని వారికి వివరించాలి.

పర్యాటక రంగం అభివృద్ధి చెందాల్సిందే. అయితే అభివృద్ధి పేరుతో ప్రకృతిని దెబ్బతీయకూడదు. పర్యాటక ప్రాంతాలను అనవసరమైన కాంక్రీట్ నిర్మాణాలతో నింపకుండా, స్థానిక పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి.

కొండగట్టు ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిస్తే.. ధర్మపురి గోదావరి తీర ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. జగిత్యాల కోట చారిత్రక వారసత్వానికి గుర్తుగా నిలుస్తోంది. కోటిలింగాల శాతవాహనుల ప్రాచీన చరిత్రను గుర్తుచేస్తోంది. వాల్గొండ చాళుక్యుల కాలపు త్రికూటాలయ నిర్మాణ కళకు, గోదావరి తీర ప్రకృతి సౌందర్యానికి ప్రతీకగా నిలుస్తోంది.

పర్యాటక ప్రాంతాలను పరస్పరం అనుసంధానం చేస్తే జగిత్యాల జిల్లాలో పర్యాటక రంగానికి మరింత విస్తృత అవకాశాలు ఏర్పడతాయి. అదే సమయంలో స్థానికులకు ఉపాధి, వ్యాపార అవకాశాలు పెరగడంతో జిల్లా ఆర్థికాభివృద్ధికి కూడా పర్యాటకం దోహదపడుతుంది. పర్యాటకం మన ఆనందం కోసం మాత్రమే కాదు. మన చరిత్రను తెలుసుకోవడానికి, సంస్కృతిని అర్థం చేసుకోవడానికి, ప్రకృతిని ఆస్వాదించడానికి ఒక గొప్ప అవకాశం. ప్రకృతిని కాపాడుతూ.. పర్యావరణ సమతుల్యతను పరిరక్షిస్తూ.. భావి తరాలకు మన జగిత్యాల సహజ, చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని అందించడం మనందరి బాధ్యత. జగిత్యాల జిల్లా పర్యాటక వైభవాన్ని ప్రపంచానికి చాటుతూ, ప్రకృతితో మమేకమైన బాధ్యతాయుత పర్యాటకాన్ని ప్రోత్సహిద్దాం.

**ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం**

**- వంగరి శ్రీధర్**
9948351648

# తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మకు మంత్రుల ఘన నివాళి

**భూమి.. భుక్తి.. ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరనారి**

**మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి**



కరీంనగర్, సెప్టెంబర్ 26(మనం బ్యూరో ): దొరల పాలనను ధిక్కరించి, వెట్టి చాకిరి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలు చిరస్మరణీయమని మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా కరీంనగర్ కలెక్టరేట్ రోడ్డులోని ఆ మహనీయురాలు విగ్రహానికి మంత్రులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కుల కోసం నిర్భయంగా పోరాడిన చాకలి ఐలమ్మ భూమి కోసం, భుక్తి కోసం, ఆత్మగౌరవం కోసం సాగిన పోరాటంలో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. సామాజిక అసమానతలు, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. చాకలి ఐలమ్మ జీవితాన్ని, పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాచకొండ నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోతకొండ శ్రీనివాస్, జిల్లా గౌరవ అధ్యక్షుడు కోతకొండ రాజయ్య, పూసల శ్రీకాంత్, బుత్కురి శివకృష్ణ, పూసాల సంపత్ పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలే సమాజ ప్రగతికి బాటలు

**కరీంనగర్ బస్‌స్టేషన్‌లో బాబాసాహెబ్ విగ్రహావిష్కరణ**

**రాజ్యాంగ విలువలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత**

**మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి**



కరీంనగర్ , సెప్టెంబర్ 26(మనం బ్యూరో ): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లో మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. కరీంనగర్ పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం మంత్రులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తాను 2013లో పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా కరీంనగర్ బస్టేషన్కు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరు పెట్టినట్లు తెలిపారు. 13 ఏళ్ల తర్వాత అదే ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విగ్రహావిష్కరణకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, దొంత రాజయ్య తదితరులను అభినందించారు.

### సమానత్వం, సామాజిక న్యాయానికి ప్రతీక

అంబేద్కర్ కేవలం రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు మాత్రమే కాదని, సమాజంలో సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనేత అని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించడంతో పాటు అణగారిన వర్గాలు ఆత్మగౌరవంతో జీవించేందుకు బలమైన పునాది వేసిందన్నారు. ప్రతిరోజూ వేలాది మంది రాకపోకలు సాగించే బస్టేషన్ ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ప్రత్యేకమైన విషయమన్నారు. ఈ విగ్రహాన్ని చూసే ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను, రాజ్యాంగ విలువలను గుర్తుచేసుకునే అవకాశం ఉంటుందన్నారు. యువత అంబేద్కర్ జీవితాన్ని, ఆయన ఆలోచనలను అధ్యయనం చేయాలని సూచించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో పాటు జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి ఫూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. తెలంగాణ ప్రజాపాలనలో సామాజిక న్యాయానికి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, అణగారిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల భద్రత అనే మూడు ప్రధాన అంశాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు.

### మార్పు మన నుంచే రావాలి

మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సబ్బండ వర్గాల ప్రజల జీవితాల్లో మార్పు వచ్చినప్పుడే సమాజంలో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మనలో మార్పు రాకపోతే వెనుకబాటుతనం కొనసాగుతుందని, అంబేద్కర్ చూపిన మార్గంలో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతోందని మంత్రి శ్రీహరి అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా అందించిన అవగాహనను, ఆయన సిద్ధాంతాలను ఆచరణలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, అంబేద్కర్ విగ్రహాన్ని బస్టేషన్లో ఏర్పాటు చేయడం ద్వారా ఆయన రాజ్యాంగ స్ఫూర్తిని నిత్యం ప్రజలకు గుర్తుచేసే అవకాశం కలిగిందన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకుంటూనే అంబేద్కర్ ఆశయాలను ఆచరణలోకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంబేద్కర్ విగ్రహం ప్రజలకు, ముఖ్యంగా యువతకు సామాజిక న్యాయం, సమానత్వం పట్ల స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కార్పొరేషన్ చైర్మన్లు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, సరిత తిరుపతయ్య యాదవ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, చరణ్ కౌశిక్ యాదవ్, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, బిఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రీజనల్ కార్యదర్శి దొంత రాజయ్య, కరీంనగర్ జోన్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్, సెక్యూరిటీ అధికారి టి. బావ్ రావు, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్. భూపతిరెడ్డి, విజిలెన్స్ ఇన్స్పెక్టర్ ఎం. రవీందర్, కరీంనగర్-1 డిపో మేనేజర్ ఐ. విజయమాధురి, కరీంనగర్-2 డిపో మేనేజర్ వి. రవీంద్రనాథ్, రీజనల్ అధ్యక్షుడు ఎన్. లచ్చిరాం నాయక్, సభ్యులు గసికంటి శంకరయ్య, బి. మల్లేశం, ఎల్. ప్రకాష్, కరీంనగర్-1 డిపో ఉపాధ్యక్షుడు రవి కిరణ్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# చిన్నవయసులోనే సేవా గుణం అభినందనీయం



మంథని సెప్టెంబర్26(మనం న్యూస్): చిన్న వయసులోనే చిన్నారికి సేవా గుణాన్ని నేర్పించడం అభినందనీయమని మంథని సీఐ బుద్దే స్వామి అన్నారు. మంథని మండలం ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన తాటి విజయ కుమారస్వామి (పోలీస్ కానిస్టేబుల్ విజయ్)కుమారుడు చిన్నారి తాటి సాయివర్ధన్ 5వ పుట్టినరోజు సందర్భంగా శనివారం మంథని సీఐ కార్యాలయంలో నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన 5 నిరుపేద కుటుంబాలకు 9 రకాల నిత్యవసర వస్తువులతో కూడిన కిట్లను సీఐ బుద్దే.స్వామి,ఎస్ఐ సందీప్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.అనంతరం సీఐ స్వామి మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలను ఆడంబరంగా కాకుండా పేదలకు సాయం చేస్తూ జరుపుకోవడం సమాజానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెంతో మందికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. తండ్రి విజయ కుమారస్వామి మాట్లాడుతూ కేవలం కేక్ కట్ చేయడమే కాకుండా ఇతరులకు సహాయం చేసే గుణాన్ని చిన్నప్పటి నుండే నేర్పించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు.

# మహనీయులను కీర్తించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదే

- మహనీయుల ఉద్యమ స్ఫూర్తితోనే తెలంగాణ సాధించుకున్నం
- ఎన్ని అటంకాలు పెట్టినా మహనీయుల చరిత్రను చాటి చెప్తాం
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్




మంథని, సెప్టెంబర్26(మనం న్యూస్): మహనీయుల స్ఫూర్తితో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో మహనీయులను కీర్తించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఆనాడుమహనీయుల ఉద్యమ స్ఫూర్తితో కేసీఆర్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని ఆయన గుర్తు చేశారు.అనాడేముందుచూపుతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ఆర్టికల్ 3 పొందుపర్చారని,అంబేద్కర్ ఆర్టికల్ 3 రాసి ఉండకపోతే తెలంగాణ వచ్చేది కాదనే విషయాన్ని గమనించిన కేసీఆర్ ప్రపంచంలోనే 125అడుగుల అతిపెద్ద కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారని అన్నారు.మన బావితరాల గురించి వందల ఏండ్ల క్రితమే ఆలోచన చేసి పోరాటాలు చేసిన చాకలి ఐలమ్మ, సర్దార్ సర్వాయి పాపన్న, కొమురంభీంలాంటి మహనీయుల పోరాట స్ఫూర్తిని చాటుకుంటున్నామని,సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో వారి విగ్రహాలను నెలకొల్పి స్మరించుకుంటున్నామని ఆయన గుర్తు చేశారు.అయితే నాటి నుంచి నేటి వరకు నెహ్రూ,ఇందిరాగాంధీ పాలన నుంచి నేటి రేవంత్రెడ్డి,దుద్దిళ్ల శ్రీధర్ పాలన వరకు మహనీయుల చరిత్రను తెలియకుండా చేసి అణిచివేస్తున్నారని అన్నారు.ఈనాడు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఇక్కడి విగ్రహానికి మున్సిపల్ పాలకవర్గం,అధికార యంత్రాంగం పూలు వేయకపోవడం మహనీయులను అవమానపర్చడమేనన్నారు.ఒకవైపు ప్రభుత్వ పరంగా మహనీయకుల జయంతి వర్ధంతిలు జరుపుకుంటున్న క్రమంలొ మంథనిలో మాత్రం మహనీయులకు కనీస గౌరవం ఇవ్వకుండా తన తండ్రినే మొక్కమని చెప్తున్నాడని ఆయన విమర్శించారు.తన తండ్రి చరిత్ర ఏంటో చెప్పడం లేదన్నారు. మహనీయుల గురించి ఆలోచన చేయకుండా ఎమ్మెల్యే మాటలు విని స్థానిక పాలకవర్గ కనీసం చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలు వేయకపోవడాన్ని ఖండిస్తున్నానని అన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని,బీఆర్ఎస్ ప్రభుత్వంలో చాకలి ఐలమ్మను గొప్పగా గౌరవించుకుంటామని, ఎన్ని అంటకాంలు పెట్టినా వాళ్ల చరిత్రనే చాటి చెప్తామన్నారు.మహనీయుల విగ్రహాలు ఎక్కడ ఉన్నా గౌరవించాలనే కలెక్టర్ ఆలోచన చేయకపోవడం బాధకరమన్నారు. మంథని ఎమ్మెల్యే ఓట్ల కోసమే మా సమాజాన్ని వాడుకుంటున్నడే కానీ మహనీయులను గౌరవించడం లేదనే విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. ఈనాడు చాకలి ఐలమ్మనుగౌరవించకపోవడం చీకటి పాలన,చీకటి ఆలోచనకు నిదర్శనమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, పాల్గొన్నారు.

# విభిన్న కాన్సెప్ట్‌తో గణపతి ప్రతిష్ఠ

- జగిత్యాల జిల్లాలో ప్రథమ బహుమతి

జగిత్యాల, సెప్టెంబర్ 26 ( మనం ప్రతినిధి ): జగిత్యాల పట్టణంలోని అరవింద్ నగర్ శ్రీ గణేష్ భక్త మండలి ఆధ్వర్యంలో ఈ సంవత్సరం శ్రీ కాళహస్తి పాతాళ గణపతిని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించి, తొమ్మిది రోజుల పాటు వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. విభిన్నమైన కాన్సెప్ట్లో గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి, భక్తులను ఆకట్టుకునే విధంగా మండపాన్ని అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మండలి నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు, వినూత్న ఆలోచనలను గుర్తించిన నిర్వాహకులు జగిత్యాల జిల్లాలో ప్రథమ బహుమతిని అందజేశారు. నవరాత్రుల సందర్భంగా గణపతికి మహా పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు, మంగళహారతులు నిర్వహించారు. దాండియా, గణపతి చిట్టి, రాహు-కేతు పూజ, గోమాత పూజ, లడ్డూ వేలం తదితర కార్యక్రమాలను కూడా భక్తుల భాగస్వామ్యంతో నిర్వహించారు. నవరాత్రులు ముగిసిన సందర్భంగా శ్రీ కాళహస్తి పాతాళ గణపతికి మండపం వద్దే ప్రత్యేక పూజలు, మంగళహారతులు నిర్వహించి, పంచామృతాలతో అభిషేకం అనంతరం నిమజ్జనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండపం వద్దే నిమజ్జనం నిర్వహించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేకతగా నిలిచింది. ఈ సందర్భంగా శ్రీ గణేష్ భక్త మండలి సభ్యులు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం భక్తి, సంప్రదాయంతో పాటు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను



నిర్వహించడమే తమ లక్ష్యమని తెలిపారు. జగిత్యాల జిల్లాలో ప్రథమ బహుమతి అందుకోవడం మండలి సభ్యులకు, భక్తులకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి సహకరించిన భక్తులు, మహిళలు, యువత, దాతలు మరియు అరవింద్ నగర్ ప్రజలకు మండలి సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కలెక్టరేట్‌లో వికసిత్ గ్రామ పంచాయితీ ప్లాన్‌పై శిక్షణ




జగిత్యాల, సెప్టెంబర్ 26 (మనం ప్రతినిధి): శనివారం రోజున జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో జిల్లా లోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు, మండల పంచాయితీ అధికారులకు, సర్పంచులకు, అదనపు కార్యక్రమ అధికారులకు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ లకు, సాంకేతిక సహాయకులకు మరియు పంచాయితీ కార్యదర్శులకు వికసిత్ గ్రామ పంచాయితీ ప్లాన్ పైన శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమములో భాగంగా, ఎల్నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనడానికై జలసిరి పనులు అనగా పంటకుంటలు(ఫారం పాండ్), ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత, ఊటకుంటలు, బోరు బావుల రీచార్జ్ నిర్మాణాలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు మొదలగు పనులను చేపట్టుటకు అవగాహన కల్పించడం జరిగింది. అదే విధంగా, ప్రజా ప్రతినిదులు, మండల మరియు గ్రామ స్థాయి అధికారులందరు కలిసి ప్రజలందరిని పూర్తి స్థాయిలో భాగస్వాములను చేస్తూ, గ్రామ అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల పనులను (నీటి సంరక్షణ పనులకు ఎక్కువ ప్రాధాన్యత ను) గుర్తిస్తూ అక్టోబర్ 2వ ప్రత్యేక గ్రామ సభ నిర్వహించి ఈ పనులన్నింటిని ఆమోదించుకొనసినదిగా తెలుపడం జరిగింది. ఇట్టి శిక్షణా కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, జెడ్పి సిఈవో గౌతమ్ రెడ్డి, డిఆర్ డివో రఘువరణ్, డీపీవో మదన్ మోహన్, ఎంపిడివోలు, ఎంపివోలు, కార్యదర్శులు, సర్పంచ్ లు మరియు తదితరులు పాల్గొనడం జరిగింది.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

**మంథని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు**



మంథని, సెప్టెంబర్26(మనం న్యూస్): చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఎందరికో చిరస్మరణీయమని మంథని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అన్నారు. శనివారొమంథనిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో చాకలి ఐలమ్మ (చిట్యాల ఐలమ్మ) జయంతి సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి,ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న,జిల్లా ఆర్టీఏ సభ్యులు మంథని సురేష్,ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం,మాజీమండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్,మాజీ ఎంపిపి కొండ శంకర్ లు మాట్లాడుతూతెలంగాణ సాయుధ పోరాట యోధురాలు,తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని అన్నారు.చాకలి ఐలమ్మ ధైర్యం,ఆత్మ గౌరవం,పోరాట పటిమ తెలంగాణ ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.తన భూమి కోసం మాత్రమే కాకుండా,తనలాంటి ఎంతోమంది పేదలు,బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె పోరాడారన్నారు.అన్యాయం ఎంత పెద్దదైనా,దాని ముందు మన ధైర్యం మరింత పెద్దదిగా ఉండాలి అనే స్ఫూర్తిని తన జీవితంతో చూపించారని వారు పేర్కొన్నారు. సామాజిక అన్యాయం, దోపిడి, అనచివేతకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. భూమి,భుక్తి,విముక్తి కోసం నాటి నిరంకుశ పాలనకు ఎదురొడ్డి నిలిచిన ఐలమ్మ, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన మహనీయురాలని అన్నారు.ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం సమాజంలో సమానత్వం,సామాజిక న్యాయం,ఆత్మ గౌరవాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రతి ఒక్కరు బాధ్యతాన్ని తెలిపారు.తెలంగాణ ప్రజల హక్కులు,ఆత్మ గౌరవం కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ సేవలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని,ఆమె త్యాగాలను స్మరించుకుంటూ సమానత్వం, సామాజిక న్యాయం సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు,గ్రామ సర్పంచ్లు, ఉప సర్పంచ్లు,మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకురాలు, అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు




భూపాలపల్లి, సెప్టెంబర్ 26 మనం ప్రతినిధి: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా శనివారం భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలిగా, సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. బానిసత్వం, అణచివేతకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి సమాజంలో చైతన్యాన్ని నింపిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆమె పోరాట స్ఫూర్తి, ధైర్యం, ఆత్మగౌరవం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ రత్నం, వెల్ఫేర్ ఆర్ఐ సంతోష్, పోలీస్ సంఘం అధ్యక్షుడు నరేష్, కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్
- టైర్-23లో ప్రతిపాదించిన అన్ని అభివృద్ధి పనులు అమలు చేసేలా పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక
- ఆమోదం పొందిన భూసేకరణ ప్రతిపాదనలు వెంటనే అమలు చేయాలి
- టెండర్ల ప్రక్రియలో జాప్యం లేకుండా పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభించాలి
- కాంట్రాక్టర్లు టెండర్లకు స్పందించేలా చర్యలు చేపట్టాలి
- గోదావరి పుష్కరాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ



జగిత్యాల, సెప్టెంబర్-26 (మనం ప్రతినిధి): గోదావరి పుష్కరాల సందర్భంగా టైర్-23లో ప్రతిపాదించిన అన్ని అభివృద్ధి పనులు అమలయ్యేలా అవసరమైన కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రతిపాదనలు, పరిపాలనా ప్రక్రియలకే పరిమితం కాకుండా వీలైనంత త్వరగా పనులను క్షేత్రస్థాయిలో ప్రారంభించి పూర్తి అయ్యే విధముగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. శనివారం దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య, కమిషనర్ హనుమంతరావుతో కలిసి సంబంధిత జిల్లా కలెక్టర్లతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాల కోసం టైర్-1,2,3లో ప్రతిపాదించిన అన్ని అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలోగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇందుకోసం అవసరమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేసి, పనులు క్షేత్రస్థాయిలో వెంటనే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూసేకరణ కు సంబంధించి ఆమోదం పొందిన ప్రతిపాదనల ప్రకారం పనులు ప్రారంభించాలని ఈ అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించేలా అవసరమైన కార్మికులు, నిర్మాణ సామగ్రిని ముందుగానే సమీకరించాలని ఆదేశించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని, పనుల్లో ప్రతి చిన్న అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని నాణ్యతతో పాటు నిర్ణీత సమయంలోగా పనులు పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. టెండర్లకు కాంట్రాక్టర్లు స్పందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇంజనీరింగ్ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని, అవసరమైతే స్థానిక ఎమ్మెల్యే, మంత్రులతో కూడా సమన్వయం చేసుకొని పనులకు సంబంధించిన ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు. టెండర్ల పేరుతో పనులు ఆలస్యం కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి అంశాన్ని ముందుగానే పరిష్కరించుకొని పనులు నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చర్యలను ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ టైర్-1,2,3లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లను త్వరితగతిన పూర్తి చేసి పనులను ప్రారంభించాలని, టెండర్ల ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావివ్వరాదని ఆదేశించారు. కాంట్రాక్టర్లు టెండర్లకు స్పందించేలా చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.అభివృద్ధి పనులకు అవసరమైన పరిపాలనా, సాంకేతిక అనుమతులు తదితర ప్రక్రియలను వేగవంతం చేసి, పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభమయ్యేలా చూడాలని సూచించారు. పుష్కరాల పనులన్నీ నిర్ణీత సమయంలోగా పూర్తి చేయడం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలను పురస్కరించుకొని ధర్మపురిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా , కోటిలింగాల లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి గౌరవ సంక్షేమ శాఖ మంత్రి గారిచే తేదీ 24-9-26 నాడు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని ఇట్టి పనులు పురోగతి లో ఉన్నాయని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం పనులు వేగవంతంగా చేయుటకు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు అవసరమైన పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ బి రాజా గౌడ్, ఆర్.డి.ఓ. మధుసూదన్, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పోరాట యోధురాలు 'చాకలి ఐలమ్మ'

## వీరుల పోరాట ఫలితమే నేడు ప్రజాస్వామ్య హక్కులను అనుభవిస్తున్నాము

### కులాల వారీగా కేంద్రం జనాభా లెక్కలు చేపట్టాలి

### హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేయాలి

### మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి

సిద్దిపేట, సెప్టెంబర్ 26 (మనం ప్రతినిధి) : భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన గొప్ప సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సమాజంలో అన్యాయం, అసమానతలకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు చాటి చెప్పడం కోసం విగ్రహాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సిద్దిపేటలో ఐలమ్మ 131 వ జయంతి సందర్భంగా విగ్రహానికి శనివారం నివాళులర్పించి మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ప్రసంగించారు. తెలంగాణ చరిత్రలో చాకలి ఐలమ్మ ఒక గొప్ప పోరాట యోధురాలుగా నిలిచారని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. దొడ్డి కొమరయ్య, సర్వాయి పాపన్న, కొమురం భీం, రావి నారాయణరెడ్డి వంటి అనేక మంది యోధులు ప్రజల హక్కుల కోసం ఆనాటి సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడారని వారి పోరాటాల ఫలితంగానే నేడు మనం ప్రజాస్వామ్య హక్కులను అనుభవిస్తున్నామున్నారు.

**కుల జనాభా లెక్కలు నిర్వహించాలి**

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జనగణనలో కులాల వారీగా జనాభా లెక్కలు చేపట్టాలని ఉద్యమం కొనసాగుతుందని మంత్రి పొన్నం తెలిపారు. సమాజంలో ఎంతమంది ఏ కులానికి చెందిన వారు ఉన్నారు అని కుల జనాభా లెక్కలు అవసరం అన్నారు. కులాల జనాభా లెక్కలు తేల్చితే వారికి ఎంత ప్రాతినిధ్యం ఇవ్వాలి ఎంత వాటా అవసరమో శాస్త్రీయంగా నిర్ణయించుకుని అవకాశం ఏర్పడుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే దిశగా కులగణన చేసిందని అయితే 50% రిజర్వేషన్ పరిమితి, న్యాయపరమైన అంశాల నేపథ్యంలో సమస్యలు ఉత్పన్నమైనట్లు పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సామాజిక న్యాయం కోసం పోరాటం కొనసాగిద్దామన్నారు.

**ఐలమ్మ స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమం -మంత్రి వాకిటి శ్రీహరి**

చాకలి ఐలమ్మ కు చదువు లేకున్నా దొరలను ఎదిరించి పేదల కోసం పోరాడిందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఆమె స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమాన్ని కొనసాగించి రాష్ట్రం సాధించుకున్నామన్నారు. ఇంకా ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హైమావతి, సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మి పెరుమాళ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కార్పొరేషన్ చైర్మన్లు సరిత తిరుపతయ్య యాదవ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, చరణ్ కౌశిక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయాలు... విజ్ఞాన భాండాగారాలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం

ములుగు, సెప్టెంబర్ 26(మనంన్యూస్): గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పొందాలని గ్రంథాలయ సం స్థ జిల్లా చైర్మన్ దరిపల్లి చంద్రం పేర్కొన్నారు. శనివారం ఆయన ములుగు శాఖ గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయ పనితీరును, అక్కడ మెయింటెన్ చేస్తున్న రిజిష్టర్, రికార్డులను పరిశీలించారు. అలాగే గ్రంథాలయాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాల్లో ఏమైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాలలో జరిగిన పరిశోధనలు, చరిత్ర, సంస్క ృతి, సైన్స్, సాహిత్యం వంటి అన్ని విషయాల సమాచారం పుస్తకాల రూపంలో గ్రంథాలయాల్లో భద్రపరచబడి ఉంటుందన్నారు. అందుకే వీటిని 'విజ్ఞాన సర్వస్వాలు' అంటారన్నారు. పేద, ధనిక అనే తేడా లేకుండా సమాజంలో ప్రతి ఒక్కరికీ ఉచితంగా లేదా చాలా తక్కువ ఖర్చుతో విజ్ఞానాన్ని అందించే అద్భుతమైన వేదికలు గ్రంథాలయాలని, పుస్తక పఠనం మనిషి ఆలోచనా విధానాన్ని మారుస్తుందరి వివరించారు. గ్రంథాలయాలకు వెళ్లడం వల్ల క్రమశిక్షణ, ఏకాగ్రత, నిరంతరం నేర్చుకొనే తత్వం అలవడుతుందన్నారు. మారుతున్న కాలంతో పాటు గ్రంథాలయాలు కూడా ఆధునిక రూపం దాల్చాయని, నేడు ఈ-లైబ్రరీల ద్వారా ప్రపంచంలో ఎక్కడో ఉన్న పుస్తకాలను కూడా కంప్యూటర్ లేదా మొబైల్ స్క్రీన్లపై చదువుకునే సదుపాయం కలుగుతోందన్నారు. ఒక మంచి పుస్తకం వంద మంది స్నేహితులతో సమానం అంటారని, అలాంటి వేలాది పుస్తకాలకు నిలయమైన గ్రంథాలయం ఒక పవిత్రమైన ఆలయం లాంటిదన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సందర్శించడం, పుస్తక పఠనాన్ని ఒక అలవాటుగా మార్చుకోవడం ఎంతో అవసరముందన్నారు. ప్రతి ఒక్కరికీ గ్రంథాలయాలపై ఆసక్తి పెరిగేలా ప్రణాళిక చేసుకొని అవగాహన క ల్పించాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు శాఖ గ్రంథాలయ అధికారిని ఎం. సబిత తదితరులు ఉన్నారు.

## పర్యాటక రంగానికి కేంద్రం ప్రాధాన్యత

- ప్రపంచ పర్యాటక జాబితాలో దేశం 39వ స్థానం
- జిల్లా నుండి 50 మంది ఇంటర్ డిగ్రీ విద్యార్థులకు ఢిల్లీలో పర్యాటక ప్రాంతాలను చూపిస్తా
- రఘునందన్ రావు, ఎంపీ
- రంగనాయక సాగర్ వద్ద ఘనంగా హెరిటేజ్ వాక్



సిద్దిపేట, సెప్టెంబర్ 26 (మనం ప్రతినిధి): పర్యాటక ప్రాంతాల సందర్శన వల్ల కొత్త ప్రాంతాన్ని చూడడమే కాకుండా ఆ ప్రాంతానికి సంబంధించిన చరిత్ర, సంస్క ృతి, సాంప్రదాయాలను తెలుసుకోవడం తోపాటు ప్రకృతితో మమేకమవడం అద్భుత అనుభూతినిస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. సిద్దిపేట రంగనాయక సాగర్ వద్ద 250 మంది విద్యార్థులు, అధికారులతో హెరిటేజ్ వాక్ నిర్వహించిన సందర్భంగా శనివారం ఎంపీ పాల్గొని ప్రసంగించారు. పర్యాటక రంగానికి కేంద్రం అధిక ప్రాధాన్యత ఇస్తుందని గతంలో 69వ స్థానంలో ఉన్న దేశం ప్రస్తుత 39వ స్థానానికి చేరిందని పేర్కొన్నారు. 175 దేశాల నుండి టూరిస్టులు మన దేశానికి వస్తున్నారని చెప్పారు. ఢిల్లీలో డిసెంబర్ నెలలో జరిగే పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు జిల్లా నుండి 50 మంది ఇంటర్మీడియట్ డిగ్రీ విద్యార్థులను ఎంపిక చేసి పంపాలని వారికి అయ్యే ఖర్చులు తానే భరించి ఢిల్లీలోని పర్యాటక ప్రాంతాలను చూపిస్తానని రఘునందన్ రావు జిల్లా యంత్రాంగానికి సూచించారు. నవంబర్లో పీఎం శ్రీ స్కూళ్లలో రెండు రక్ష రూపాయల చొప్పున టూరిజం కోసం ప్రభుత్వం ఇస్తుందని దానిని సద్విని చేసుకోవాలని పర్యాటక ప్రాంతాలను చూసేందుకు కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లాలోని ప్రముఖ మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్, ఎల్లమ్మ చెరువు, రంగనాయక సాగర్ లాంటి ప్రాజెక్టులతో పాటు ప్రముఖ దేవాలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు ప్రసిద్ధి చెందిన టూరిజం ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. వీటిని విద్యార్థులకు విడుదలవారీగా చూపిస్తూ వాటి చరిత్ర తదితర అంశాలను తెలుసుకునేలా పాఠశాలలో టూరిజం క్లబ్ ను ఏర్పాటు చేసి కాంపిటేషన్ నిర్వహించే చర్యలు చేపడతామన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీ కిరణ్, సిద్దిపేట ఆర్డీవో సదానందం, ట్రైన్ డిప్యూటీ కలెక్టర్ భవ్య , అధికారి విజయ భార్గవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లు యాదగిరి, మహేందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాట వీరనారి: రఘునందన్ రావు




గజ్వేల్, సెప్టెంబర్ 26(మనం న్యూస్): చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూచాకలి ఐలమ్మ తెలంగాణ చరిత్రలో నిజాం, దొరల దోపిడీపై తిరగబడిన మొదటి మహిళా యోధురాలు అని అన్నారు.1919, సెప్టెంబర్ నెలలో ఉమ్మడి వరంగల్ జిల్లా, పాలకుర్తి మండలం, కృష్ణాపురం గ్రామంలో నిరుపేద చాకలి కుటుంబంలో జన్మించింది అని,తెలంగాణ సాయుధ పోరాటంలోకి అప్పుడు ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఆమెకు అండగా నిలిచారు అని గుర్తు చేశారు. ఆమె పోరాటం ఒక్క భూమి కోసం కాదు, రజాకార్లు, దొరల వెట్టిచాకిరి, ఆడవాళ్లపై అత్యాచారాలకు వ్యతిరేకంగా సాగింది అని తెలిపారు. 'దున్నేవాడిదే భూమి' అనే నినాదంతో ఆమె రైతులను కూడగట్టి, చేతిలో కర్ర, కొడవలి పట్టి సాయుధ పోరాటం చేసిందని, నిజాం సైన్యం, రజాకార్లు ఆమె ఇంటిపై దాడి చేసినా ఆమె తప్పించుకుని అడవుల్లో నుండి పోరాటం సాగించిందన్నారు . ఆమె 1985 సెప్టెంబర్ 10న మరణించింది అని, ఆమె త్యాగానికి గుర్తుగా తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 10 చాకలి ఐలమ్మ వారోత్సవాలు జరుపుతోంది అన్నారు . హైదరాబాద్లో చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం కూడా ఆమె పేరు మీద ఉంది గుర్తు చేశారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, తెగువకు ఐలమ్మ నిలువెత్తు నిదర్శనం అని అందుకే ఆమెను 'తెలంగాణ వీరనారి' అంటారు అని రఘునందన్ రావు వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కౌన్సిలర్ శ్రీనివాస్ రజక సంఘం నాయకులు బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లంబోదరుడి లడ్డూ సాయి కుమార్ రెడ్డి సొంతం

### వరుసగా 4వ సారీ సాయి కుమార్ రెడ్డిని వరించిన వినాయకుడి ప్రసాదం

### రూ.2.05 లక్షలకు లడ్డూ దక్కించుకున్న టీఆర్ఎస్ నేత



పటాన్చెరు, సెప్టెంబర్ 26 (మనం న్యూస్): వినాయకుడిపై భక్తి, విశ్వాసంతో ప్రతి ఏడాది లడ్డూ వేలంలో పాల్గొంటూ వస్తున్న తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) నేత వై.సాయికుమార్ రెడ్డిని మరోసారి గణనాథుడి లడ్డూ వరించింది. పటాన్చెరు పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో జై గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన లడ్డూ వేలంపాటలో రూ.2,05,555లకు లడ్డూను దక్కించుకున్నారు. దీంతో వరుసగా నాలుగో ఏడాది గణనాథుడి లడ్డూను సొంతం చేసుకున్న ఘనతను సాయికుమార్ రెడ్డి సాధించారు. 2023లో రూ.1.10 లక్షలకు, 2024లో రూ.95 వేలకు, 2025లో రూ.1.23 లక్షలకు లడ్డూను దక్కించుకున్న ఆయన.. ఈ ఏడాది ఏకంగా రూ.2,05,555లకు లడ్డూను సొంతం చేసుకున్నారు. నాలుగేళ్లుగా వరుసగా లడ్డూ వేలంలో పాల్గొని దక్కించుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. అంతేకాకుండా గత ఏడాది పలికిన ధరతో పోలిస్తే ఈసారి గణనాథుడి లడ్డూకు మరింత అధిక ధర చెల్లించి భక్తిని చాటుకున్నారు. ప్రతి ఏడాది గణపయ్య లడ్డూను దక్కించుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని సాయికుమార్ రెడ్డి తెలిపారు. గణనాథుడిపై ఉన్న భక్తి, నమ్మకంతోనే వరుసగా వేలంలో పాల్గొంటున్నానని పేర్కొన్నారు. గణపయ్య ఆశీస్సులతో పటాన్చెరు నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. జై గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలంపాటలో భక్తులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### వాణి నగర్ కాలనీలో రూ.48 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

అమీన్ పూర్, సెప్టెంబర్ 26 (మనం న్యూస్): అమీన్ పూర్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్ పూర్ డివిజన్ పరిధిలోని వాణి నగర్ కాలనీలో రూ.48 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి, కాలనీల్లో మౌలిక వసతులను మరింత మెరుగుపరచడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యంగా రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు తదితర సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. వాణి నగర్ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నామని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం వెదిరి కాలనీ, ఓడిఎఫ్ కాలనీలలోని వినాయక మండపాలను దర్శించుకుని.. అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో అమీన్ పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, డిఈ వెంకటరమణ, సీనియర్ నాయకులు ఉపేందర్, మల్లేష్, రాములు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

### సమాజ అభ్యున్నతికి ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి, సెప్టెంబర్ 26 మనం న్యూస్ ప్రతినిధి: వీరనారి చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, శాసనసభ్యులు చింతా ప్రభాకర్ చాకలి ఐలమ్మ విగ్రహానికి పుష్పమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, సామాజిక అన్యాయాలను ఎదురించి, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ప్రతికూల పరిస్థితులను సైతం లెక్కచేయకుండా ఆమె ప్రదర్శించిన ధైర్యం, ఆత్మవిశ్వాసం, పోరాట పటిమ ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు.

వెనుకబడిన తరగతుల విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని యువత ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, సహాయ అధికారులు అమర్ జ్యోతి, అమర్నాథ్, వసతి గృహ సంక్షేమ అధికారులు, టీఎన్జీవోస్ నాయకులు జావిద్ అలీ, రవి, రాష్ట్ర బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభు గౌడ్, జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్ పాటిల్, జిల్లా రజక సంఘం అధ్యక్షులు నామాల నగేష్, యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు కూర వేణుగోపాల్, వివిధ కుల సంఘాల నాయకులు ఆశన్న గౌడ్, ఇప్పపల్లి నరసింహులు, కుమ్మరి సాయిలు, మాణిక్యం, జై లాల్ నాయక్, గోరుకంటి రమేష్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సంపంగి పేరుతో అక్రమ వెంచర్లు

- వేల ఎకరాలపై వివాదాస్పద లేఅవుట్లు.
- చూపేది అందాల వి ల్లాలు.
- కస్టమర్లకు ఇచ్చేది రాళ్లు, రప్పలున్నప్లాట్ లేనా..?
- వెంచర్లపై అధికారుల తనిఖీలు ఎక్కడ..?

సంగారెడ్డి సెప్టెంబర్ 26 మనం న్యూస్ ప్రతినిధి : సంపంగి పేరుతో వెలుగులోకి వస్తున్న వెంచర్ల వ్యవహారం ఇప్పుడు సంగారెడ్డి జిల్లా లో చర్చనీయాంశంగా మారింది. అందమైన విల్లాలు, అధునాతన సదుపాయాలు, విశాలమైన రోడ్లు అంటూ ప్రచారం చేస్తూ కస్టమర్లను ఆకర్షిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం లాట్ల పరిస్థితి భూమి హక్కులు, లేఅవుట్ అనుమతులు, మౌలిక సదుపాయాలు పై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంపంగి వెంచర్ కస్టమర్లను మోసగిస్తున్న వైనంపై మనం న్యూస్ అందిస్తున్న ప్రత్యేక కథనం. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని నాసర్ ప్రాంతంలో సర్వేనెంబర్ 30-1 నుంచి మొదలుకొని 50 వరకు సుమారు 300 ఎకరాల రాళ్లు రప్పలు ఉన్న భూమిని కొనుగోలు చేసి సంపంగి పేరుతో వెంచర్ ఏర్పాటు చేసుకొని వేల ఎకరాలను ఆక్రమించారని ఆరోపణలు ఉన్నాయి. కస్టమర్లను ఆకర్షించేందుకు 10 ఎకరాల స్థలంలో నిర్వాహకులు అందమైన విల్లాలు, పార్కులు, రోడ్లు, డ్రైనేజ్, విద్యుత్ సౌకర్యాలు లాంటి సదుపాయాలతో లేవట్లు ఉన్నట్లు చూపిస్తూ ఆర్భాటంగా ప్రచారాలు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి అయితే ప్లాట్లు కొనుగోలు చేసిన తర్వాత వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నందున కొందరు కస్టమర్లు ఆరోపిస్తున్నట్లు సమాచారం. రాళ్లు, రప్పలతో ఉన్న స్థలాలు, పూర్తిస్థాయిలో అభివృద్ధి కానీ రోడ్లు కనిపించని మౌలిక వసతుల ఇలా ఉంటే తాము మోసపోయామని కస్టమర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు






**వేల ఎకరాల భూమిపై ప్రశ్నలు**

ఈ వెంచర్ వ్యవహారంలో ముఖ్యంగా భూమి విస్తరణం, భూమి వినియోగం మార్పులు, లేవట్లు అనుమతులు, ప్రభుత్వం, ప్రైవేటు భూముల హద్దులు లాంటి అంశాలపై స్పష్టత అవసరమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వేల ఎకరాల మేర భూములు ఆక్రమణకు గురయ్యారని ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు సమగ్ర భూ సర్వే నిర్వహించి హద్దులను నిర్ధారించాల్సిన అవసరం అవసరం ఉన్నది. ప్రభుత్వ రికార్డులు రిజిస్ట్రేషన్ ధృవపత్రాలు భూభారతి, భూ రికార్డులు, లేఅవుట్ అనుమతులు పర్యావరణ అనుమతులు తదితర అంశాలను పరిశీలిస్తే అసలు పరిస్థితి బయటపడే అవకాశం ఉంది.

**కస్టమర్లకు శఠగోపం...?**

కస్టమర్లకు ప్లాట్లు విక్రయ సమయంలో ఇచ్చిన హామీలు, రిజిస్ట్రేషన్ అయిన తర్వాత వాస్తవ పరిస్థితుల మధ్య తేడా ఉంటే అది వినియోగదారుల హక్కులకు భంగం కలిగించే అంశంగా మారుతుంది. వెంచర్నిర్వహకులు ప్రచారాలు ఆర్భాటాలు నమ్మి ప్లాట్లు కొనుగోలు చేసి నష్టపోయామని భావిస్తున్న బాధితులకు కస్టమర్లు ఎవరు న్యాయం చేస్తారు. ప్రచారం చేసే సమయంలో కస్టమర్లకు చూపించిన విల్లాలు, రోడ్లు, పార్కులు, ఇతర సౌకర్యాలు వాస్తవానికి ఆ వెంచర్ లో ఉన్నాయా లేదా,? ఉంటే అవి ఏ స్థాయిలో ఉన్నాయి.? కొనుగోలుదారులకు ఇచ్చిన ఒప్పందంలో ఏమి చెప్పారు. చెప్పిన అంశాలు ఉన్నాయా లేదా అని విషయాలపై అధికారులు విచారించాల్సిన అవసరం ఉన్నది. అక్రమ నిర్మాణాలు లేదా అనుమతులు లేని లేఔట్లు ఉంటే సంబంధిత శాఖల అధికారులు వాటిని గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారం ఉంటుంది. అయితే అక్రమ వెంచర్లపై ఫిర్యాదులు వచ్చిన అధికారులు స్పందించడం లేదని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అధికారులు మామూలు మత్తులో ఉండి చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు లేకపోలేదు కాబట్టి సంబంధిత అధికారులు ఆస్తులు, అనుమతుల ప్రక్రియ తనిఖీలు పారదర్శకంగా నిర్వహించి నివేదికలను ఉన్నత అధికారులకు అందించాల్సిన అవసరం ఉన్నది.

**సమగ్ర విచారణతో నే నిజాలు...**

సంపంగి పేరుతో జరుగుతున్నట్లు చెబుతున్న వెంచర్పై రెవిన్యూ, మున్సిపల్, పంచాయితీ, ప్లానింగ్ రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో తనిఖీలు నిర్వహిస్తే అనేక అంశాలు బయటపడే అవకాశాలు ఉంటాయి. అసలు వెంచర్ భూమి ఎవరిది.. అనుమతులు ఉన్నాయా.. ఉంటే ఎంత విస్తీర్ణంలో లేవాటు చేశారు.. ప్రచారంలో చూపిస్తున్న సదుపాయాలు వాస్తవంగా వెంచర్లో ఉన్నాయా లేవా..? లాంటి వివరాలను నిగుత్తేల్చి అధికారులు నిజాయితీని చాటుకోవాల్సిన అవసరం ఉన్నది.

# సామాజిక సేవలో శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల



**● ఉచిత నేత్ర వైద్య శిబిరం**

**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 26(మనం న్యూస్):** శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ఖమ్మం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో, మ్యాక్స్ విజన్ ఐ హాస్పిటల్ సహకారంతో తల్లంపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 130 మంది గ్రామస్తులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందించారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని తదుపరి చికిత్స కోసం ఆసుపత్రికి రిఫర్ చేశారు. తల్లంపాడు గ్రామ సర్పంచ్ అంబేద్కర్ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడం సామాజిక బాధ్యతలో భాగమని అన్నారు. విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ద్వారా సేవాభావాన్ని అలవర్చుకుని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ ఇలాంటి ఆరోగ్య శిబిరాలు ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను మరింత బలపరుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ వి సుదర్శన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, డిప్లొమా ఇంచార్జి కృష్ణ ప్రసాద్ ,ప్రోగ్రాం కోఆర్డినేటర్ నరేష్ మరియు వాలంటీర్లు,పంచాయతీ కార్య దర్శి, సిబ్బంది పాల్గొన్నారు..

# సిఈసి జ్ఞానేష్ రాజీనామా చేయాలి

## సిపిఎం ఆధ్వర్యంలోదిష్టి బొమ్మ దగ్ధం...



**ఖమ్మం, సెప్టెంబర్ 26(మనం న్యూస్):** ఎన్నికల సంఘం ప్రధాన అధికారిగా జ్ఞానేష్ కుమార్‌కు కొనసాగే హక్కు లేదని వెంటనే రాజీనామా చేయాలని సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జ్ఞానేష్ కుమార్ దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సంఘంలోని ముగ్గురు కమిషనర్లలో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఓటర్ల జాబితా సవరణ, సర్ అమలుకు సంబంధించిన పలు నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారుని నివేదికలు స్పష్టం చేశాయని పేర్కొన్నారు.

ముగ్గురిలో మెజారిటీ అభిప్రాయాలను జ్ఞానేష్ కుమార్ పాటించకుండా తన నిర్ణయాలను అమలు చేశాడని ఆరోపించారు. మొత్తం ప్రక్రియ పారదర్శకంగా వుందని ఇన్నాళ్ళు జ్ఞానేష్ కుమార్ చేసిన వాదన పూర్తి అబద్ధమని, ఇప్పుడు స్పష్ట మవుతుందని తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో కూడా మోడీకి లాభం వచ్చేలా ఆయన పని చేశాడని ఆరోపించారు. అతను వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసురావు, వంగూరి రాములు, s సుబ్బారావు, మెరుగు సత్యానారాయణ, జబ్బార్, నందిపాటి మనోహర్, మెరుగు రమణా, మీరా సాహెబ్, భుక్యా శ్రీనివాసు రావు, నాగుల మీరా, బోడపట్ల సుదర్శన్, బత్తుల ఉపేంద్ర, వజేనేపల్లి శ్రీనువాసురావు తదితరులు పాల్గొన్నారు

## చాకలి ఐలమ్మ పోరాట పటిమ నేటితరానికి

# స్ఫూర్తిదాయకం..



**సమాజంలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడిన ఐలమ్మ చరిత్ర చిరస్మరణీయం**

**ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన కలెక్టర్ దివాకర టిఎస్**

**ఖమ్మం, సెప్టెంబర్ 26(మనం బ్యూరో):** సమాజంలోని అసమానతలకు ఎదురొడ్డి, వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా నిర్భయంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శనివారం ఖమ్మం, వైరా రోడ్డులోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సమీపంలో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ సామాజిక అసమానతలను ప్రశ్నిస్తూ అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని తెలిపారు. జమీందారుల పాలనలో కొనసాగిన వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం ప్రజల్లో చైతన్యాన్ని నింపిందన్నారు. చాకలి ఐలమ్మ సామాజిక సేవకురాలిగా, భూ పోరాటం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తనదైన పాత్రను పోషించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆమె పోరాట పటిమ, ధైర్యసాహసాలు మహిళా శక్తికి ప్రతీకగా నిలిచాయని, నేటి తరానికి కూడా ఆమె జీవితం ఆదర్శప్రాయమని అన్నారు. సమాజ హితం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను, వారి సేవలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, మహిళా శక్తిని చాటి చెప్పారని కలెక్టర్ అన్నారు. ఆమె ఆశయాలు, పోరాట విలువలను స్మరించుకుంటూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిణి జి. జ్యోతి, బిసి సంఘ నాయకులు తుపాకుల ఎలగొండ స్వామి, జక్కుల వెంకట రమణ, కొత్తకొండ శ్రీలక్ష్మి, తమ్మారపు బ్రహ్మయ్య, సట్టు వెంకటేశ్వర్లు, తెనాలి వీరబాబు, మాచర్ల వేలాద్రి, పగిడల కృష్ణవేణి, కణతాల నరసింహారావు, హరిప్రసాద్, వట్టికోట అప్పారావు, వల్లపు సోమరాజు, అమరగాని వెంకటేశ్వర్లు, లింగబోయిన పుల్లారావు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది, బిసి కుల సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా ఆర్జేసి డిగ్రీకళాశాల ఫ్రెషర్స్ డే





**ఖమ్మం, సెప్టెంబర్ 26(మనం న్యూస్):** ఖమ్మంలోని ఆర్జేసి డిగ్రీ కళాశాల ఫ్రె షర్స్ డే శనివారం నగరంలోని ఓ ప్రవేట్ ఫంక్షన్ హాల్ లో వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ హాజరయ్యారు. తొలుత ఆయన జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో లక్ష్యాన్ని ఏర్పరచుకొని ప్రణాళిక ప్రకారం కష్టపడితే దేనినైనా సాధించ వచ్చన్నారు. 28 సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఆర్జేసి డిగ్రీ కళాశాల తన ప్రస్థానంలో అనేక విజయాలు సాధించిందని తెలిపారు. తమ కళాశాల కు చెందిన అనేక మంది విద్యార్థులు సైంటిస్టు, విద్యా, కళా, క్రీడా, వ్యాపార, రాజకీయ, ప్రభుత్వ ఉద్యోగ రంగాలలో స్థిర పడి ఉన్నారని తెలిపారు. దీనితో పాటు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన ఘనత ఆర్జేసిదేనన్నారు. డిగ్రీ స్థాయిలో బహుళ జాతి కంపెనీల్లో ప్లేస్మెంట్ లు సాధించిన ఘనత కూడా తమ కళాశాలకే దక్కుతుందన్నారు. ఇప్పటి వరకు కళాశాల విద్యార్థులు సాగించిన విజయ పరంపరను ప్రస్తుత సంవత్సరం విద్యార్థులు కూడా కొనసాగించాలని సూచించారు.దీనికి విద్యార్థులు నిరంతరం కళాశాలకు హాజరవుతూ ఉపాధ్యాయులు చెప్పినదాన్ని అర్థం చేసుకుని ప్రణాళిక ప్రకారం కష్టపడితే సాధించ వచ్చన్నారు.నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అని,ఆదిశ లోనే ఇప్పటి వరకు తమ విద్యార్థులు నడుచుకున్నారని,ప్రస్తుత సంవత్సరం విద్యార్థులు కూడా ఆవిధంగా ముందుకు సాగుతూ తల్లిదండ్రుల కలల ను నెరవేర్చాలని,తద్వారా మీకు పాఠాలు చెప్పిన అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం ఈ విద్యా సంవత్సరం పలు విభాగాలలో,పరీక్షలలో గెలుపొందిన పలువురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి అతిథి గా విచ్చేసిన కృష్ణను కళాశాల విద్యార్థులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. చివరగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన క్లాసికల్, వెస్టన్,బ్రేక్,గ్రూప్, సోలో తదితర డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ.లింగయ్య,ఇన్చార్జి లుఆంజనేయులు, సునంద తదితరులు పాల్గొన్నారు



# మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఖమ్మం, సెప్టెంబర్ 26(మనం న్యూస్):** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఖమ్మం లో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భానోత్ రెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ శతజయంతి సందర్భంగా 1969లో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రారంభించబడిందని తెలిపారు. విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ ప్రధాన లక్షమని పేర్కొన్నారు.

ఎన్ఎస్ఎస్ యూనిట్- 1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కే. కవిత మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ రామకుమార స్వామి మాట్లాడుతూ విద్యార్థులు సమాజ సమస్యలను అర్థం చేసుకొని వాటి పరిష్కారంలో చురుకుగా భాగస్వాములు కావాలని సూచించారు.

'నాట్ మీ, బట్ యూ' అనే ఎన్ఎస్ఎస్ నినాదానికి అనుగుణంగా సేవా కార్యక్రమాలను కొనసాగించాలని అన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను క్లీన్ అండ్ గ్రీన్, మొక్కలు నాటడం, ర్యాలీలు, మోటివేషన్ ప్రోగ్రామ్స్, స్టూడెంట్స్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్, ప్రముఖ వ్యక్తుల జయంతి, వర్ధంతి ఉత్సవాలు, షీ టీం ప్రోగ్రామ్స్, డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్, రోడ్ సేఫ్టీ లాంటి వివిధ కార్యక్రమాలను విద్యార్థులకు ప్రదర్శించారు. జంతు శాస్త్ర ఆచార్యులు డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలక బాధ్యత వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ సావిత్రి, సూర్యలక్ష్మి , హర్ష , హేమలత , అశోక్ పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 26 (మనం న్యూస్):**వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను కొత్తగూడెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్లోని అమరవీరుల స్తూపం వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర సీపీఐ కార్యదర్శి ఎస్.కె. సబీర్ పాషా ముఖ్య అతిథిగా హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గాల హక్కుల కోసం, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు నేరెళ్ల రమేష్, టౌన్ ప్రెసిడెంట్ సుంకర అజిత్, టౌన్ సెక్రటరీ భూస రాజు, శంకర్, మంచిల్ల శ్రీను, కొండల్, అంజయ్య, మల్లయ్య, పోసి, చింతల్ రాజు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నివాళులు



**ఖమ్మం, సెప్టెంబర్ 26(మనం న్యూస్):** ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి, సామాజిక న్యాయం కోసం ఆమె చేసిన కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్మరించుకుంటూ ఆమె చూపిన ధైర్యం, పట్టుదల, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వారు అన్నారు.

# నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

## జిల్లా పర్యాటక నోడల్ అధికారి అనూష



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 26 (మనంప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నేటి ఉదయం 10 గంటలకు లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రామవరం బౌద్ధ గుహల వద్ద ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక నోడల్ అధికారి బి. అనూష తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. జిల్లాలోని యువ టూరిజం క్లబ్ (వైటిసి) ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులు ప్రదానం చేయనున్నారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యతను విద్యార్థులు, యువత మరియు ప్రజలకు తెలియజేయడంతో పాటు, స్థానిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం, చారిత్రక-సాంస్కృతిక వారసత్వ పరిరక్షణపై అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.

# చాకలి ఐలమ్మ సేవలు చిరస్మరణీయం

- **సింగరేణి డైరెక్టర్ సూర్యనారాయణ**
- **సింగరేణి హెడ్ ఆఫీస్‌లో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు**



**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 26(మనం న్యూస్):** చాకలి ఐలమ్మ సేవలు చిరస్మరణీయమని సింగరేణి డైరెక్టర్ ఎల్ వి సూర్యనారాయణ అన్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలోని హెచ్ఆర్డి కాన్ఫరెన్స్ హాల్ నందు శనివారం వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించడం జరిగింది. జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ కే.అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంస్థ డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ హాజరయ్యారు. ముందుగా చాకలి ఐలమ్మ చిత్ర పటానికి డైరెక్టర్ ఎల్.వి.సూర్యనారాయణతో పాటు యూనియన్ నాయకులు శాఖాధిపతులు అధికారులు ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం డైరెక్టర్ ఎల్.వి.సూర్య నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తెలంగాణ రైతాంగ ఉద్యమంలో ధైర్యసాహసాలతో పోరాడిన వీరనారి తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు ఆత్మగౌరవానికి ప్రతీక అయిన చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను ఇక్కడ ఇంత ఘనంగా జరుపుకోవటం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్పొరేట్ లో మాత్రమే కాకుండా సింగరేణి వ్యాప్తంగా ఈ జన్మదిన వేడుకలను జరుపుకుంటున్నామని తెలిపారు. చాకలి ఐలమ్మ అణచివేత భూస్వామ్య దోపిడీకి వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా భూమి భుక్తి హక్కులకోసం ధైర్యంగా నిలిచి పేదలు రైతులు మహిళలకు స్ఫూర్తిగా నిలిచిన ఐలమ్మ జీవితం చిరస్మరణీయం అని తెలిపారు. చాకలి ఐలమ్మ జయంతి వేడుకల ద్వారా ఆమె దైర్య సాహసాలను చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో జరిగే అన్యాయాలను ఎదురించి నిలబడాలని తెలిపారు. జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డైరక్టర్ ఎల్.వి.సూర్యనారా యణతో పాటు జనరల్ మేనేజర్ (సిపి అండ్ పి)ఏ.మనోహర్, ఏఐటియూసి నాయకులు ఎస్.రాము, ఐఎన్టియూసి నాయకులు ఎస్.పితాంబర రావు, సిఎంఓఏఐ ఉపాధ్యక్షుడు కేశవరావు, జిఎం(సిహెచ్పి) పి.ఎలిషా, జిఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం జి.వి.కిరణ్ కుమార్, జిఎం(పర్సనల్) ఈఈ అండ్ ఆర్సి ఏజే ఎం మురళీధర రావు, జిఎం(ఈ అండ్ ఎం) వర్క్ షాప్ అండ్ ఎనర్జీ మేనేజ్మెంట్) కె.శ్రీనివాసులు, జిఎం(బిడి)బి.రామదాసు, డిజిఎం(పర్సనల్)లు బి.శివ కేశవరావు, ముకుంద సత్యనారాయణ, కార్పోరేట్ లోని వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అవినీతి రహిత పర్యవేక్షణ ఉండాలి

## రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ విజిలెన్స్ ఆఫీసర్ బలరాం



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 26 (మనంప్రతినిధి):** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అవినీతి రహిత పర్యవేక్షణ ఉండాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ విజిలెన్స్ ఆఫీసర్ బలరాం సంబంధిత అధికారులకు నిర్దేశించారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో ఆయన ఆధ్వర్యంలో జిల్లాలోని ఆ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లతో ఇందిరమ్మ ఇండ్ల ప్రగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిని మరియు పనుల నాణ్యతను ఆయన కూలంకషంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పర్యవేక్షణలో ఎలాంటి అవినీతికి తావుండకూడదని అధికారులను ఆదేశించారు. పనులన్నీ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరగాలని స్పష్టం చేశారు. అనంతరం, ఇందిరమ్మ ఇండ్ల పర్యవేక్షణలో అవినీతి రహితంగా విధులు నిర్వహిస్తామని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఏ స్థాయిలో ఉన్న వ్యక్తులకైనా లంచాలు ఇవ్వకూడదని, వారికి అవగాహన కల్పించమని సమావేశంలో పాల్గొన్న అధికారులందరితో ఆయన ప్రమాణం చేయించారు.ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సవేరాం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు , మరియు జిల్లాలోని అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాట పటిమ తరతరాలకు స్ఫూర్తిదాయకం

**బహుజనుల కోసం బంధూకు పట్టిన పోరాట యోధురాలు ఐలమ్మ**

**కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్**

**చిట్కుల్ లో ఘనంగా ఐలమ్మ జయంతి వేడుకలు**

**పాల్గొన్న ఇస్నాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ మోతే సుమలత**



**పటాన్ చెరు, సెప్టెంబర్ 26 (మనం న్యూస్):** పెత్తందారుల చేతిలో అణిచివేయబడ్డ వర్గాలకు తిరుగుబాటు తత్వాన్ని నేర్పించి ప్రతిఘటించే పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని చిట్కుల్ లోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర మొత్తం త్యాగధనుల అమరత్వమేనని ఆ మహనీయుల ఉద్యమ స్ఫూర్తితోనే తెలంగాణలో ప్రశ్నించే తత్వం అలవడిందన్నారు. నిజాం నిరంకుశ పాలనలో శిథిలమైపోయిన బతుకులను బాగు చేయడానికి వెట్టి చాకిరికి వ్యతిరేకంగా దొరలు జమీందారుల చేతుల్లో బానిసలుగా మగ్గుతున్న బహుజనులకు స్ఫూర్తినిస్తూ నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు. ఆనాడు బహుజనుల కోసం పోరాటం చేసిన ఆ మహనీయుల స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు పంచాలనే సంకల్పంతో వీరనారి సబ్బండ వర్గాల ప్రతినిధి చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహాన్ని చిట్కుల్ లో ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఆ మహనీయుల త్యాగఫలంతో వారు ఇచ్చిన స్ఫూర్తితో సిద్ధించిన తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మహనీయుల ఆశయాల కనుగుణంగా పరిపాలన కొనసాగిస్తుందన్నారు. ఆ మహనీయుల స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించాలని సంకల్పంతో హైదరాబాద్ లోని మహిళా యూనివర్సిటీ కి చాకలి ఐలమ్మ పేరుని పెట్టి ఆ వీరనారికి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిందన్నారు. రేవంతన్న స్ఫూర్తితో సబ్బండ, బడుగు బలహీన వర్గాల హక్కులకే పోరాడుతూ వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ మోతె సుమలత, కౌన్సిలర్స్ సంగన్నగారి గోపాల్, దస్తగిరి, వెంకటేష్, ఆంజనేయులు, మాజీ సర్పంచ్ సుంకరి రవీందర్, మాజీ పిఏసిఎస్ చైర్మన్ పొట్టి నారాయణ రెడ్డి, నర్సింగ్ యాదవ్, రజక సంఘం సభ్యులు చాకలి సత్యనారాయణ, చాకలి బాబు, చాకలి అర్జున్,చాకలి యాదయ్య, చాకలి రవి, చాకలి కిషోర్, చాకలి చందు, రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పోరాటానికి ఐలమ్మ నిప్పుకణిక

## వర్ధంతి సభలో జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు



**ఏటూర్ నాగారం,సెప్టెంబర్ 26, మనం ప్రతినిధి:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి చాకలి ఐలమ్మ నాంది పలికారని జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు అన్నారు. రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి సభలో ఆయన పాల్గొని ఆమెకు నివాళులర్పించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేశారు. జిల్లా నాయకుడు ఎండీ ఖలీల్ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన యోధురాలు ఐలమ్మ అని అన్నారు. ఆమె సాగించిన భూపోరాటం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, భూమి పంపిణీ ఉద్యమాలకు ఆమె పోరాటం స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొన్నారు. పాలకుర్తి ప్రాంతంలో కౌలుకు తీసుకున్న భూమిని సాగు చేస్తూ భూస్వాముల ఒత్తిళ్లను ఐలమ్మ ఎదుర్కొన్నారని రఘు వివరించారు. ఆమె పండించిన పంటను గుండాలు తీసుకెళ్లగా, రైతాంగ పోరాట సభ్యులతో కలిసి తిరిగి పంటను సాధించుకున్నారని తెలిపారు. అప్పట్లో దొరలు, భూస్వాములు, జాగీర్దార్లు, పటేళ్లు, పట్వారీల పెత్తనంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఆ పరిస్థితులకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ పోరాటంలో ఐలమ్మ కీలక పాత్ర పోషించారని అన్నారు. తెలంగాణ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, తెగువ చిరస్మరణీయమని రఘు పేర్కొన్నారు. ఆమె ఆశయాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి మణిహారంగా నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ

- అత్యాధునిక యంత్రాలతో నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ
- ఓ ఈ ఆర్ అధికంగా రావడంతో రైతులకు మంచి గిట్టుబాటు
- ఇప్పటి వరకు 70 వేల మెట్రిక్ టన్నుల గెలల ప్రాసెస్
- నర్మెట ఫ్యాక్టరీలో రిఫైనరీ పనులు వేగంగా జరుగుతున్నాయి
- రాష్ట్రంలో పదివేల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు చేయాలన్నది లక్ష్యం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**సిద్దిపేట, సెప్టెంబర్ 26 (మనం ప్రతినిధి):** ఆయిల్ ఫామ్ తోటల సాగు రైతుకు మంచి ఆదాయం ఇస్తుందని ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన ఎలాంటి నష్టం ఉండదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ అత్యాధునిక యంత్రాలతో నిర్మించడం వల్ల తెలంగాణ రాష్ట్రానికి మణిహారంగా మారిందన్నారు. నర్మెట ఆయిల్ పేడ్ ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని శనివారం సందర్శించి ఫ్యాక్టరీ పని తీరు, నీటి లభ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఇప్పటివరకు 70 వేల మెట్రిక్ టన్నుల గెలలను ప్రాసెస్ చేసిందని చెప్పారు. ఫ్యాక్టరీలో ఓ ఈ ఆర్ అధికంగా రావడంతో రైతులకు మంచి గిట్టుబాటు లభిస్తుందన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణం సమయంలో 12 వేల రూపాయలకు టన్ను ధర ఉండగా ఇప్పుడు 24 వేల రూపాయలకు పెరిగిందన్నారు. సిద్దిపేట జిల్లాలో నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ రాష్ట్రం నడిబొడ్డున ఉండడంతో అన్ని జిల్లాలకు అందుబాటులో ఉందన్నారు.

### 10 లక్షల ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు జరగాలి

రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ తోటలు సాగు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 4 లక్షల ఎకరాలలో సాగవుతుందని పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లో 6 లక్షల ఎకరాలలో సాగులో ఉన్నట్లు పేర్కొన్నారు. దేశంలో సగానికి పైగా సాగు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లోనే కొనసాగుతుందని 70 లక్షల ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగైతే దేశ అవసరాలకు సరిపడే ఆయిల్ ఉత్పత్తికి అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

### రిఫైనరీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి

నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలో రిఫైనరీ యంత్రాల బిగింపు పనులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. వచ్చే సంవత్సరానికి పనులు పూర్తి చేసి ఇక్కడే ఆయిల్ ఉత్పత్తి, ప్యాకింగ్ జరుగుతుందన్నారు. ఇంకా ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే గేలల పిప్పి నుండి నాలుగు వాట్ల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని, మురుగు నీటిని శుద్ధి చేసి ఫ్యాక్టరీ అవసరాల కోసం వాడుకోవడం జరుగుతుందన్నారు.

### నిర్మాణంలో మరో 11 ఫ్యాక్టరీలు

రాష్ట్రంలో రిలయన్స్ సంస్థ రిఫైనరీతో కూడిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మించేందుకు ముందుకు వచ్చిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఇంకా మరో 11 ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో ఫ్యాక్టరీల నిర్మాణం కోసం పనులు కొనసాగుతున్నాయన్నారు.

ఆయిల్ ఫామ్ తోటల విస్తీర్ణం పెరిగితే అన్ని ఫ్యాక్టరీలకు అవసరమైనంత గెలలు అంది వస్తాయన్నారు.

రైతులకు మరింత గిట్టుబాటు కోసం కేంద్రం 44 శాతం ఇంపోర్టు డ్యూటీని అమలు చేయాలని మంత్రి కేంద్రాన్ని కోరారు. ఇప్పటికే ఈ విషయాన్ని ఎంపీల ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లినట్లు పేర్కొన్నారు. ఇంకా ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హైమావతి ఆర్డీవో సదానందం తదితరులు పాల్గొన్నారు.



# మోదీ జన్మదినం సందర్భంగా భారీ రక్తదాన శిబిరం

**మంగపేట, సెప్టెంబర్ 26,మనం ప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం, అలాగే ప్రజా సేవలో ఆయన 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ములుగులో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆదేశాల మేరకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మదారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ములుగు బీజేపీ కార్యాలయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. దేశ సేవలో నిరంతరం శ్రమిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి సంఘీభావంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంగపేట మండల బీజేపీ అధ్యక్షుడు రావుల జానకిరావు ఆధ్వర్యంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు మూతి రవి, బీజేపీ నాయకులు తంతరపల్లి రామకృష్ణ, గోగు రాజశేఖర్, కబ్బాక మల్లయ్య, జబ్బ ప్రవీణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెత్తందారీ వ్యవస్థపై పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ

## మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు

## 131వ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**మంగపేట, సెప్టెంబర్ 26, మనం ప్రతినిధి:** మంగపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. భూమి కోసం,భుక్తి కోసం,విముక్తి కోసం పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు.పెత్తందారీ,భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా దొరల ఆధిపత్యాన్ని సవాల్ చేసి,తెలంగాణ రైతాంగ పోరాటంలో మహిళలను భాగస్వామ్యం చేస్తూ వీరచరిత్రను సృష్టించిన ధైర్యసాహసాల ప్రతీక చాకలి ఐలమ్మ అని అన్నారు.

అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని,సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఐలమ్మ చూపిన బాటను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పేర్కొన్నారు.

చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె పోరాట స్ఫూర్తిని మననం చేసుకోవడం, సమాజంలో సమానత్వం కోసం కృషి చేయడం మనందరి బాధ్యత అని చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు అన్నారు.

# ఘనంగా గణనాథుని శోభయాత్ర





**హైదరాబాద్, సెప్టెంబర్ 26(మనంన్యూస్):** నగరంలోని హఫీజ్‌పేటలోని ప్రేమ్‌నగర్‌లో మహాకాల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొలువై వెలిసిన శ్రీ బొజ్జ గణపయ్య శోభయాత్రను ఘనంగా నిర్వహించారు. గత 6 సంవత్సరాల నుండి విఘ్నేశ్వరుని నెలకొల్పుతూ పూజలు నిర్వహిస్తున్నారు. వినాయక నిమజనోత్సవం సందర్భంగా పూజలందుకున్న గణనాథుని లడ్డూను కాలనీ వాసి చారి 1వ లడ్డు రూ. 52,001ను సొంతం చేసుకోగా, 2వ లడ్డూను లక్ష్మీ నారాయణ రూ. 25వేలకు, 3వ లడ్డూను భార్గవి 3వ లడ్డు 28,100లకు సొంతం చేసుకున్నారు. 'ఆధ్యాత్మిక శోభా యాత్రలో కుల మత భేదం లేకుండా భారీ ఎత్తున కాలనీ వాసులు పాల్గొన్నారు.ఈ శోభయాత్రలో పెన్సిల్ ఆర్టిస్ట్ చిట్ల, కార్తీక్ ముదిరాజ్,మహాకాల్ యూత్ అసోసియేషన్ సభ్యులు శివాజీ, సాయి కిరణ్, అయాజ్, మణిరాజ్, శశాంక్, వరుణ్ సాయి, అజయ్, వికాస్, భాను, నాని, మనోజ్, విష్ణు, తేజ, శివ పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**జగిత్యాల సెప్టెంబర్ 26(మనం ప్రతినిధి):** తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడి, ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన వీర వనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను జగిత్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి అదనపు ఎస్పీ చేతన్ నితిన్, పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ... తెలంగాణ ప్రజల హక్కులు, సామాజిక న్యాయం, పేదల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆమె ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం కోసం చాకలి ఐలమ్మ చేసిన త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆమె ఆశయాలను స్మరించుకుంటూ సమాజంలో సమానత్వం, న్యాయం, ఆత్మగౌరవం కోసం కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో. శ్రీనివాస్, ఆర్.ఐ. వేణుతో పాటు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు మత పెద్దలు సహకరించాలి



- బాల్య వివాహాలు నిర్వహించే మత పెద్దలపై చట్టపరమైన చర్యలు
- బాల్య వివాహ రహిత జిల్లాగా సంగారెడ్డి
- జిల్లా సంక్షేమ అధికారిణి లలిత కుమారి

**సంగారెడ్డి, సెప్టెంబర్ 26 మనం న్యూస్ ప్రతినిధి :** బాల్య వివాహాల నిర్మూలనకు మత పెద్దలు తమవంతు సహకారం అందించాలని జిల్లా సంక్షేమ అధికారిణి లలిత కుమారి కోరారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, స్కోప్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని మహిళా ప్రాంగణంలో బాల్య వివాహంతో బతుకు ఆగం-బాల్య వివాహ నిషేధ చట్టం-2006 అంశంపై శనివారం జిల్లాలోని పూజారులు, పాస్టర్లు, ముస్లిం మత పెద్దలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహాలు నిర్వహిస్తే సంబంధిత మత పెద్దలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వివాహాలు నిర్వహించే సమయంలో వధూవరుల పుట్టిన తేదీలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు జరిపించాలని మత పెద్దలకు సూచించారు. అన్ని మతాల మత పెద్దల సహకారంతో సంగారెడ్డి జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు. జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్పర్సన్ రాజా రెడ్డి మాట్లాడుతూ .. బాల్య వివాహాలను నిర్మూలించేందుకు అన్ని శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, మత పెద్దలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. డీసీఆర్బీ సీఐ రమేష్ మాట్లాడుతూ .. బాల్య వివాహాలకు పాల్పడితే చట్టపరంగా శిక్షలు ఉంటాయని, రూ.1 లక్ష వరకు జరిమానా, రెండేళ్ల వరకు కారాగార శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీవో) రత్నం మాట్లాడుతూ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. బాల్య వివాహాల నివారణలో మత పెద్దల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. స్కోప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ శ్రీ ఉప్పలయ్య మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన కోసం తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు వెంకటేశం, విష్ణుమూర్తి, చైల్ హెల్ప్లైన్ కోఆర్డినేటర్ యాదగిరి, డీసీపీయూ సిబ్బంది లింగం, జిల్లాలోని సుమారు 100 మంది మత పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రం

- మాజీ మంత్రి హరీష్ రావు



**గజ్వేల్ సెప్టెంబర్ 26 మనం న్యూస్:** భూమి కోసం , భుక్తి కోసం ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. అణచివేతకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం మహిళా శక్తికి, ఆత్మగౌరవానికి, సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిందన్నారు. శనివారం నాడు గజ్వేల్ పట్టణంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డితో కలిసి మాజీ మంత్రి హరీష్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐలమ్మ పోరాట చరిత్రను గుర్తు చేసుకున్నారు. నిజాం కాలంలో భూస్వామ్య దోపిడీ, వెట్టి చాకిరీ వంటి అణచివేతలకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ పోరాటంలో ఐలమ్మ కీలక పాత్ర పోషించారని తెలిపారు. తన భూమి, పంటను కాపాడుకోవడంతో పాటు అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ధైర్యంగా నిలబడి పోరాడిన ఆమె జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. చాకలి ఐలమ్మ అంటే ఒక పేరు కాదు.. ఒక పోరాట స్ఫూర్తి. ఆమె ధైర్యం తెలంగాణ మహిళలకు, అణగారిన వర్గాలకు ఎప్పటికీ ఆదర్శం అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమా అని తెలిపారు. ఐలమ్మ వంటి తెలంగాణ వీరుల చరిత్రను గుర్తించి, వారి త్యాగాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిందన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని గౌరవిస్తూ ఆమె పేరును చిరస్థాయిగా నిలిపే కార్యక్రమాలకు కేసీఆర్ ప్రత్యేకంగా కృషి చేశారని పేర్కొన్నారు. కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చాకలి ఐలమ్మ భవన్ నిర్మాణానికి రూ.కోటి నిధులు కేటాయించి, రాష్ట్రంలో ప్రత్యేకంగా నిలిచేలా భవనాన్ని నిర్మించి ఇచ్చారని తెలిపారు. ఐలమ్మ పేరుతో నిర్మించిన ఈ భవనం ఆమె పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. అయితే ప్రస్తుతం కేసీఆర్ హయాంలో నిర్మించిన భవనాలు, అభివృద్ధి పనుల నిర్వహణపై ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపడం లేదని కనీసం వాటికి సున్నాలు కూడా వేసే పరిస్థితి లేదని విమర్శించారు. చాకలి ఐలమ్మలాంటి ధైర్యశాలి మహిళల పోరాట చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, వారి స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట నాయకులు,రజక సంఘం ప్రతినిధులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గత ఐదేళ్ల నష్టాన్ని భర్తీ చేసుకునేలా అధిక నిధులు తీసుకువస్తున్న

- మహిళల ఆర్థిక సాధికారతే చంద్రబాబు విజన్
- డ్వాక్రా వి ఓఏ ,వి ఓబీ ల ఆత్మీయ సమావేశంలో మంత్రి నిమ్మల

**పాలకొల్లు, సెప్టెంబర్ 26,మనం ప్రతినిధి:** వైసిపి ఐదేళ్ల పాలన ధ్వంసం , విధ్వంసం తప్ప అభివృద్ధి సున్నా.

గత ఐదేళ్ల నష్టాన్ని వడ్డీతో సహా భర్తీ చేసుకునేలా పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధికి రాత్రింబవళ్లు నిరంతరం శ్రమిస్తూ అధిక నిధులు తీసుకు రాగలుగుతున్నానంటే నా కుటుంబ సభ్యులైన పాలకొల్లు ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదమేనని రాష్ట్ర జల వనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలన్నదే చంద్రబాబు విజన్ అని, ఆ దిశగా అడుగులు వేస్తూ దేశానికే ఆదర్శంగా, స్ఫూర్తిగా డ్వాక్రా సంఘాలు నిలిచాయి అన్నారు.

పూలపల్లి ఎస్ ఎస్ ఎస్ కళ్యాణ మండపంలో శనివారం పాలకొల్లు పట్టణ మరియు పాలకొల్లు మండలం డ్వాక్రా వీఓఏ, వీఓబీల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలకు వినాయక చవితి, దసరా పండుగలను పురస్కరించుకుని చీరలను అందజేశారు. సమావేశంలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ సమాజంలో సగం జనాభా మహిళలేనని, మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబం, గ్రామం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.

డ్వాక్రా అంటేనే చంద్రబాబు అని ,మహిళలు ఆర్థిక శక్తిగా ఎదిగేలా భారతదేశంలోనే తొలిసారిగా స్వయం సహాయక సంఘాల ఉద్యమాన్ని విస్తృత స్థాయిలో ముందుకు తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిదేనన్నారు. మహిళల పొదుపు శక్తిని సంఘటిత శక్తిగా మార్చి, బ్యాంకు రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు, ఆర్థిక స్వావలంబనకు మార్గం సుగమం చేశారని చెప్పారు.

డ్వాక్రా సంఘాల ద్వారా లక్షలాది మహిళలు చిన్న వ్యాపారాలు, పశుపోషణ, కుట్టు కేంద్రాలు, ఆహార ఉత్పత్తులు, హస్తకళలు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో స్వయం ఉపాధి పొందుతూ కుటుంబ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారారని వివరించారు. ఒకప్పుడు కుటుంబ అవసరాల కోసం ఇతరులపై ఆధారపడిన మహిళలు నేడు కుటుంబ ఆర్థిక నిర్ణయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.

డ్వాక్రా ఉద్యమ విజయాల్లో వీఓఏలు, వీఓబీల పాత్ర అత్యంత కీలకమని మంత్రి కొనియాడారు.

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయ నాయకులు అంటే ఎన్నికల సమయంలోనే కనిపిస్తారని ప్రజల్లో ఉండే భావనను ఎప్పుడు ప్రజలతో మమేకమవుతు పూర్తిగా మార్చివేసిన నాయకుడు మంత్రి నిమ్మల రామానాయుడు అని తెలిపారు. గత రెండు ఏళ్ల క్రితం బుడమేరు ముంపు గురైనప్పుడు ఎవరు ఉండని విధంగా రాత్రింబవళ్లు గట్టుపైనే ఉండి ముంపు నివారణ పనులను దగ్గరుండి చేయించారంటూ కొనియాడారు

కూటమి నాయకులు కోడి విజయభాస్కర్, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, బోనం చిన్నబాబు , కర్నేన గౌరు నాయుడు, జక్కంపూడి కుమార్, రియా, పాముల రజనీ కుమార్, పొట్నూరి శ్రీనివాస్, ఇంటి శ్రీరాముడు, పీతల శ్రీనివాస్, కొల్లి కొండ ప్రసాద్, ధనాన్ని సూర్యప్రకాష్, దాసరి రత్నం రాజు, పాలవలస తులసిరావు, మేడిది జాన్ రాజు , కలిదిండి రామచంద్ర రాజు,,దొడ్డ ఏడుకొండలు, మండేల రాంప్రసాద్, సత్యనారాయణ రాజు, నెక్కంటి ఆదినారాయణ, కిలారి రామారావు, వరద శేషు తదితరులు , పెద్ద సంఖ్యలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# అంగన్వాడీ ఉత్సవంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన




**పోడూరు, సెప్టెంబర్ 26, మనం ప్రతినిధి:** పోడూరు సెక్టార్ వెలగల అమ్మచెరువు అంగన్వాడీ కేంద్రంలో సీడీపీఓ ఇందిర ఆదేశాల మేరకు అంగన్వాడీ ఉత్సవం నిర్వహించారు. సూపర్వైజర్ హసీనా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కూటమి నాయకులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం గురించి వివరించారు. గర్భిణులకు నిర్వహించే ఆరోగ్య పరీక్షలు, బాలింతలు పాటించాల్సిన జాగ్రత్తలు, పిల్లల సంరక్షణ, కిశోర బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, ఉప సర్పంచ్ శిలబోయిన జయ రామ కృష్ణ, మాజీ సొసైటీ చైర్మన్ రుద్రరాజు సీతారామరాజు (రవిరాజు), సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి పురుషోత్తముడు, జవ్వాది నానాజీ, చిలుకూరి ప్రసాద్గు,డాల దుర్గారావు, గెద్దాడ ఆంజనేయులు, మండల రైతు విభాగం అధ్యక్షులు బొక్క సూర్యనారాయణ,గుత్తుల వెంకటేశ్వరరావు,కూటమి నాయకులతో పాటు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాలు పాల్గొన్నారు.

# ఖరీఫ్ పంటల కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- అక్టోబర్ 1లోగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి
- టోకెన్ విధానం పారదర్శకంగా అమలు చేయాలి
- అదనపు కలెక్టర్ రెవెన్యూ సంగీత




సంగారెడ్డి, సెప్టెంబర్ 26 మనంప్రతినిధి: ఖరీఫ్ (వానాకాలం) సీజన్ 2026-27లో రైతుల నుంచి పంటల కొనుగోళ్లను పకడ్బందీ ప్రణాళికతో చేపట్టేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సంగీత సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

శనివారం కలెక్టరేట్ ఆడిటోరియం లో ఖరీఫ్ సీజన్లో వరి ధాన్యం కొనుగోళ్లకు చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు.

జిల్లాలో నవంబర్ మాసం నుంచి వరి ధాన్యం మార్కెట్కు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్న నేపథ్యంలో, కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, పరికరాలు, గన్నీ సంచులు తదితరాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు.

జిల్లాలో 227 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో దొడ్డు రకం ధాన్యానికి 196 కేంద్రాలు, సన్న రకం ధాన్యానికి 31 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో 97, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 97, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 31, ఎఫ్పీఓ ఆధ్వర్యంలో ఒకటి, మెప్మా ఆధ్వర్యంలో ఒక కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

అక్టోబర్ 1లోగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కేంద్రాల ఇన్చార్జిలను ఆదేశించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన వెంటనే రిజిస్టర్లో నమోదు చేసి టోకెన్ జారీ చేయాలని సూచించారు. టోకెన్ విధానాన్ని పూర్తిగా పారదర్శకంగా అమలు చేయడంతో పాటు, రైతులు తీసుకువచ్చిన ధాన్యం తేమ శాతాన్ని నమోదు చేయాలని ఆదేశించారు. ధాన్యం రవాణాకు సంబంధించి కాంట్రాక్టర్లు ఒప్పందం ప్రకారం అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచేలా చూడాలని, అన్ని వాహనాలకు జీపీఎస్ పరికరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోళ్లకు అనుగుణంగా అవసరమైన గన్నీ సంచులను ముందుగానే సమకూర్చుకోవాలని తెలిపారు.

3,348 టార్పాలిన్లు, 2 ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు, 37 గ్రెయిన్ కాలిపర్లు, 252 తేమ కొలిచే యంత్రాలు, 276 ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, 35 హస్క్ రిమూవర్లు, 2 డ్రైయర్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. అవసరమైన చోట వీటిని అందుబాటులో ఉంచి కొనుగోళ్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ సూచించారు.

వరి ధాన్యం కొనుగోలులో ఎఫ్ఏక్యూ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, రైతులకు సత్వరంగా నగదు చెల్లింపులు జరిగేలా ఓపీఎంఎస్లో వివరాలను వేగంగా నమోదు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలు విధుల్లో నిర్లక్ష్యం వహించారనే ఫిర్యాదులు రాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వరి ధాన్యానికి క్వింటాల్కు రూ.500 బోనస్ ప్రకటించిన నేపథ్యంలో, ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోళ్లు నిర్వహించాలని అధికారులు తెలిపారు. సాధారణ రకం ధాన్యానికి క్వింటాల్కు రూ.2,441, గ్రేడ్-ఏ రకానికి రూ.2,461 మద్దతు ధర ఉండగా, అర్హత కలిగిన సన్న రకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ వర్తిస్తుంది. దీంతో సన్న రకం గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాల్కు రూ.2,961 వరకు లభించనుంది.

ఈ సమీక్ష సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బాలసరోజ , జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ , సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలు పాల్గొన్నారు.



# ప్రత్యేక లోక్ అదాలత్తో 44 బ్యాంకు కేసుల పరిష్కారం

ఆర్మూర్, సెప్టెంబర్ 26 (మనం న్యూస్): ఆర్మూర్ కోర్టు ప్రాంగణంలో శనివారం మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ లోక్ అదాలత్లో బ్యాంకులకు సంబంధించిన 44 పీఎల్సీ కేసులు పరిష్కరించారు. పరిష్కరించిన కేసులకు సంబంధించి మొత్తం రూ.11,42,900 రికవరీ అయినట్లు అధికారులు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన, సౌహార్దపూర్వకంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు, వివిధ బ్యాంకుల సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కొరకు లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం.

ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో శనివారం లీగల్ ఎయిడ్ క్లినిక్ను మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీదేవి, ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు న్యాయపరమైన సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు తమకు ఎదురయ్యే న్యాయ సమస్యలపై క్లినిక్ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# నంద్యాల ప్రజలకు మెడికవర్ అత్యాధునిక రక్తనాళాల వైద్య సేవలు

- ఇండస్ హాస్పిటల్స్లో వాస్క్యులర్ సర్జరీ అవుట్రీచ్ క్లినిక్



నంద్యాల, సెప్టెంబర్26(మనంన్యూస్): నంద్యాల,పరిసర జిల్లాల ప్రజలకు అత్యాధునిక నిపుణుల వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో మెడికవర్ హాస్పిటల్స్, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో ఇండస్ హాస్పిటల్స్, నంద్యాలలో ప్రత్యేక వాస్క్యులర్ సర్జరీ అవుట్రీచ్ క్లినిక్ నిర్వహించారు. ఈ అవుట్రీచ్ క్లినిక్కు మెడికవర్ హాస్పిటల్స్, సికింద్రాబాద్కు చెందిన వాస్క్యులర్ సర్జన్ డా. అజయ్ బి. మోసూర్ నిర్వహించారు. రక్తనాళాలకు సంబంధించిన వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు నిపుణుల సలహాలు, చికిత్సా విధానాలపై అవగాహన, అవసరమైన వైద్య పరీక్షలు మరియు తదుపరి చికిత్సలపై మార్గదర్శకత్వం అందించారు. ఈ సందర్భంగా డా. అజయ్ బి. మోసూర్ మాట్లాడుతూ, రక్తనాళాల వ్యాధులు చాలా సందర్భాల్లో ఎటువంటి స్పష్టమైన లక్షణాలు లేకుండానే మెల్లగా అభివృద్ధి చెందుతాయి. అందువల్ల వాటిని ప్రారంభ దశలోనే గుర్తించి నిపుణుల పర్యవేక్షణలో చికిత్స పొందడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఇలాంటి అవుట్రీచ్ క్లినిక్ల ద్వారా నిపుణుల వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, ప్రారంభ దశలోనే సరైన చికిత్స అందేలా చేయడం మా ప్రధాన లక్ష్యం. దీంతో మొదటి దశ నిపుణుల సంప్రదింపుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రక్తనాళాల ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, వాస్క్యులర్ వ్యాధులను ముందుగానే గుర్తించడం, సకాలంలో నిపుణుల సలహా తీసుకోవడం ఎంత ముఖ్యమో ప్రజలకు వివరించారు.

మరింత వైద్య పరిశీలన లేదా చికిత్స అవసరమైన రోగులకు తగిన పరీక్షలు, చికిత్సా విధానాలు మరియు తదుపరి వైద్య సేవలపై సూచనలు అందించారు. ప్రధాన ఆసుపత్రులకే పరిమితం కాకుండా ప్రాంతీయ కేంద్రాల్లో కూడా నిపుణుల వైద్య సేవలను విస్తరించి, ప్రజలకు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందించాలనే మెడికవర్ హాస్పిటల్స్ నిబద్ధతకు ఈ కార్యక్రమం నిదర్శనమని నిర్వాహకులు తెలిపారు.

ఇండస్ హాస్పిటల్స్, నంద్యాలతో ఉన్న ఈ సహకారం ద్వారా నంద్యాల మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రత్యేక వాస్క్యులర్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, అధునాతన చికిత్సలు లేదా బహుళ విభాగాల వైద్య సేవలు అవసరమైన రోగులకు తగిన సౌకర్యాలు కల్పించబడుతున్నాయని తెలిపారు.

# బాన్సువాడలో వైభవంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర

- డప్పుల దరువులు.. బ్యాండ్ మేళాలు.. కోలాటాల సందడి, డీజే లకు దూరం
- శోభాయాత్ర మార్గాల్లో భారీగా పోలీసు బందోబస్తు, ప్రశాంత వాతావరణంలో వేడుకలు
- క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ రాజేష్చంద్ర



బాన్సువాడ, సెప్టెంబర్ 26 (మనం న్యూస్) : బాన్సువాడ పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్రతో శనివారం పండుగ శోభను సంతరించుకుంది. డప్పుల దరువులు, బ్యాండ్ మేళాలు, కోలాటాల ప్రదర్శనలు, భక్తుల జయజయధ్వానాల మధ్య గణనాథుల శోభాయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి గణేష్ విగ్రహాలను భక్తులు ఊరేగింపుగా నిమజ్జన ప్రాంతాలకు తరలించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. నిన్న రాత్రి నుంచే ప్రారంభమైన నిమజ్జన కార్యక్రమాలను జిల్లా ఎస్పీ యం. రాజేష్చంద్ర, ఐపీఎస్ క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. రాత్రి ప్రారంభమైన కార్యక్రమాల నుంచి శనివారం కొనసాగుతున్న శోభాయాత్ర వరకు ఎప్పటికప్పుడు పరిస్థితులను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.

**మినీ ట్యాంక్బండ్ పరిసరాల్లో భక్తుల సందడి.**

ఎస్పీ మినీ ట్యాంక్బండ్తో పాటు ఇతర నిమజ్జన ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల రద్దీ, శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో భద్రతా చర్యలను సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. మినీ ట్యాంక్బండ్ పరిసరాల్లో భక్తుల సందడి నెలకొంది. భక్తి, సంప్రదాయం, ఉత్సాహం కలగలిసిన వాతావరణంలో గణనాథునికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు.

**అదనపు ఎస్పీ కే. నరసింహారెడ్డి, డీఎస్పీ కిషన్రెడ్డి ఆధ్వర్యంలో పర్యవేక్షణ.**

అదనపు ఎస్పీ కే. నరసింహారెడ్డి, డీఎస్పీ కిషన్రెడ్డి, బాన్సువాడ టౌన్ ఎస్హెచ్ఓ బి. నరహరితో పాటు సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో నిరంతరం విధులు నిర్వహిస్తూ భద్రతను పర్యవేక్షించారు. నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేందుకు ప్రజలు పోలీసుశాఖకు సహకరించాలని జిల్లా పోలీసుశాఖ విజ్ఞప్తి చేసింది. పోలీసు అధికారులు సూచించిన భద్రతా నిబంధనలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.

# వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలి



సదాశివనగర్, సెప్టెంబర్ 26 (మనం న్యూస్): వీబీ జీ రామ్ జీ కార్యక్రమంలో భాగంగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్లాన్ (వీజీపీపీ) తయారీపై సదాశివనగర్ మండలంలోని రైతు వేదికలో సదాశివనగర్, గాంధారి, రామారెడ్డి మండలాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు స్థానిక ఎంపీడీఓ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డిఆర్డిఓ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ., ప్రతి గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి,వాటికి ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించి, వచ్చే ఐదు సంవత్సరాలకు ఉపయోగపడే విధంగా పకడ్బందీగా, సమగ్రంగా వీజీపీపీ ప్రణాళికను రూపొందించాలని సర్పంచులు, కార్యదర్శులు, అధికారులను కోరారు. గ్రామ సభ నిర్వహించి గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులు అలాగే ప్రణాళికపై విస్తృతంగా చర్చించాలని సూచించారు. గ్రామాలలో అందుబాటులో ఉన్న వనరులు, అవసరాలు, అభివృద్ధి అవకాశాలను గుర్తించాలని కోరారు. గుర్తించిన అభివృద్ధి పనులను గ్రామసభ ఆమోదం పొందిన అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి పంపించాలని సూచించారు.గ్రామాల్లో కూలీల (వేజ్ సీకర్స్) సంఖ్యను పెంచి,ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు మరియు ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని విస్తృతంగా చేరవేయాలని కోరారు. వాతావరణ పరిస్థితులు, ఎల్నినో ప్రభావం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని, గ్రామాల భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామానికి అత్యవసరంగా అవసరమైన పనులను గుర్తించి,వాటిని ప్రాధాన్యత క్రమంలో చేర్చి సమగ్ర ప్రణాళికను రూపొందిస్తే గ్రామాల అభివృద్ధికి మరింత మంచి అవకాశాలు ఏర్పడతాయని తెలియజేశారు. అనంతరం మండలంలోని మర్కల్ గ్రామంలోని వనరులు, మౌలిక వసతుల కోసం రూపొందించిన రిసోర్స్ మ్యాప్ ద్వారా గుర్తించిన భవిష్యత్ అభివృద్ధి పనులకు సమగ్ర ప్రణాళిక పటం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడిఓలు సంతోష్ కుమార్, రాజేశ్వర్, నాగేశ్వర్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హోటళ్లు, రెస్టారెంట్లపై ఆకస్మిక తనిఖీలు

- ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేని వ్యాపారులకు నోటీసులు
- పరిశుభ్రత లోపాలపై అధికారుల ఆగ్రహం, సింథటిక్ ఫుడ్ కలర్స్ ధ్వంసం
- అనుమానిత ఆహార నమూనాలు ల్యాబ్కు తరలింపు

కామారెడ్డి, సెప్టెంబర్ 26 (మనం ప్రతినిధి): :కామారెడ్డి జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు కామారెడ్డి, భిక్కనూరు ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, నిబంధనల అమలును పరిశీలించారు. తనిఖీల సందర్భంగా పలు హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశుభ్రత లోపాలను అధికారులు గుర్తించారు. ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ లేకుండానే ఆహార వ్యాపారం నిర్వహిస్తున్న వారిని గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఆహార తయారీ, నిల్వ ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించడంతోపాటు నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని నిర్వాహకులకు సూచించారు.



తనిఖీలలో లభించిన సింథటిక్ ఫుడ్ కలర్స్.

ఆహార పదార్థాల్లో వినియోగించేందుకు నిల్వ ఉంచిన సింథటిక్ ఫుడ్ కలర్స్ను అధికారులు అక్కడికక్కడే ధ్వంసం చేశారు. వినియోగదారుల ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలను ఆహారంలో ఉపయోగించవద్దని హెచ్చరించారు. అనుమానం ఉన్న పలు ఆహార పదార్థాల నమూనాలను అధికారులు సేకరించారు. వాటిని విశ్లేషణ కోసం నాచారంలోని స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు. ల్యాబ్ నివేదికలు అందిన అనంతరం నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండరడ్స్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారి తెలిపారు.

# సీఈసీ వ్యవహారంపై ఆందోళనలు

(మొదటి పేజీ తరువాయి)




పకడ్బందీగా ఉండాలనే సదుద్దేశంతోనే ఎన్నికల సంఘం ఈ తరహా సర్ ప్రక్రియలను రూపొందిస్తుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324, ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 ప్రకారం ఓటర్ల జాబితా సమగ్రతను కాపాడే బాధ్యత పూర్తిగా ఎన్నికల సంఘానికే అప్పగించబడింది. కాలం చెల్లిన పేర్లు తొలగించడం, వలస వెళ్లిన వారిని మినహాయించడం, అర్హులైన యువతను కొత్తగా ఓటర్లుగా చేర్చడం ఈ ప్రక్రియ ప్రధాన లక్ష్యం. ఒక స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ఉంటేనే ప్రజాస్వామ్యం పరిపూర్ణమవుతుంది. అయితే, ఈ మహోన్నతమైన లక్ష్యం కాస్తా ఆచరణలోకి వచ్చేసరికి అడుగడుగునా లోపాలకు నిలయంగా మారింది. తొలినాళ్లలో కొన్ని రాష్ట్రాలకే పరిమితమైన ఈ ప్రక్రియ, తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా విస్తరించేసరికి లక్షలాది ఓట్లు గల్లంతు కావడం, సామాన్యులకు చిన్న, చిన్న కారణాలతో చాంతాడంత నోటీసులు ఇవ్వడం, విచారణ పేరుతో మూడు తరాల చరిత్రను ప్రశ్నించడం వంటి అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. దీంతో అసలు ఈ సర్ ఎవరి ప్రయోజనాల కోసం జరుగుతుందనే మౌలికమైన ప్రశ్న ఉద్భవించింది. ఎన్నికల సంఘం అంటేనే నిష్పక్షపాతతకు, పారదర్శకతకు ప్రతీక. కానీ ప్రస్తుత సర్ ప్రక్రియలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) వ్యవహారశైలిపై వస్తున్న ఆరోపణలు ఆ సంస్థ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా మచ్చ తెచ్చాయి. కమిషన్లోని మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్లను విశ్వాసంలోకి తీసుకోకుండా, వారి అభ్యంతరాలను సైతం బేఖాతరు చేస్తూ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారనే అంశాలు వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపింది. గత కొంతకాలంగా పూర్తి స్థాయి కమిషన్ సమావేశాలు జరగకపోవడం, కొత్త ఓటర్ల నమోదుకు తెచ్చిన అదనపు డిక్లరేషన్లపై తోటి కమిషనర్ల వాదనలను తోసిపుచ్చడం వంటి పరిణామాలు సీఈసీ విశ్వసనీయతను పూర్తిగా దెబ్బతీశాయి. పైగా, క్షేత్రస్థాయిలో బిఎల్ఓల పర్యవేక్షణ లోపించి, ఓటర్లను చైతన్యపరచాల్సింది పోయి నోటీసుల పేరుతో బెదిరించే ధోరణి పెరుగుతున్నా సీఈసీ స్పందించకపోవడం విమర్శలకు తావిచ్చింది. ప్రతిపక్షాలు నేరుగా సీఈసీ తీరును తప్పుపడుతూ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం, అభిశంసన తీర్మానాలకు సిద్ధమవడం వంటి పరిణామాలు ఒక రాజ్యాంగ సంస్థ ఎంతటి సంక్షోభంలో కూరుకుపోయిందో తేటతెల్లం చేస్తున్నాయి.

ఈ సమగ్ర ప్రక్షాలన ప్రక్రియ వల్ల దేశానికి కొన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ప్రస్తుతం జరుగుతున్న తప్పుల వల్ల వాటిని మించిన తీవ్రమైన నష్టాలు ముప్పేట దాడి చేస్తున్నాయి. లాభాల విషయానికి వస్తే, ఒకవేళ ఈ ప్రక్రియ నిజంగా పారదర్శకంగా, లోపాలు లేకుండా జరిగితే దొంగ ఓట్లు, మృతుల పేర్లు, నకిలీ ఓట్లు పూర్తిగా తొలగిపోయి అత్యంత పవిత్రమైన, కచ్చితమైన ఓటర్ల జాబితా రూపుదిద్దుకుంటుంది. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఇనుమడింపజేస్తుంది. కానీ, ఆచరణలో జరుగుతున్న నష్టాలు చాలా తీవ్రమైనవి. లక్షలాది మంది అర్హులైన సామాన్య ఓటర్ల పేర్లు గల్లంతు కావడం వల్ల వారి ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు కాలరాయబడుతోంది. అధికారుల చుట్టూ తిరగలేక, వేధింపులు భరించలేక ప్రజలు ఓటు అంటేనే నిరాసక్తి కనబరిచే ప్రమాదం పొంచి ఉంది. ఇది భవిష్యత్తులో పోలింగ్ శాతాన్ని దారుణంగా పడిపోయేలా చేస్తుంది. అంతేకాకుండా, రాజకీయ పార్టీల మధ్య అనవసరమైన అనుమానాలు, అధికార-ప్రతిపక్షాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడానికి ఈ సర్ ప్రక్రియ ప్రధాన కారణమైంది.ఒక స్వతంత్ర సంస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం సడలిపోవడం దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకర పరిణామం.

స్వతంత్ర భారత దేశంలో ఎనిమిది దశాబ్దాలుగా ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి, పోయాయి కానీ ఎన్నికల సంఘంపై ప్రజల విశ్వాసం ఎప్పుడూ చెక్కుచెదరలేదు. అలాంటిది నేడు సర్ ప్రక్రియ పేరుతో తలెత్తిన వివాదాలు, కమిషన్ పనితీరుపై వస్తున్న విమర్శలు ఆ సంస్థ గౌరవాన్ని దిగజార్చేలా ఉన్నాయి. ఇప్పటికైనా ఎన్నికల సంఘం మేలుకోవాలి. కేవలం అరకొర వివరణలతో సరిపెట్టకుండా, సర్ ప్రక్రియలో తలెత్తిన లోపాలపై సమగ్రమైన, పారదర్శకమైన వివరణ ఇవ్వాలి. అవసరమైతే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, రాజకీయ పార్టీల సందేహాలను నివృత్తి చేస్తూ ప్రజాస్వామ్య వాతావరణాన్ని పునరుద్ధరించాలి. ప్రభుత్వాలు మారుతుంటాయి, రాజకీయ నాయకులు వస్తుంటారు, పోతూ ఉంటారు కానీ రాజ్యాంగబద్ధమైన వ్యవస్థల పవిత్రత ఎప్పటికీ కాపాడబడాలి. లేనిపక్షంలో, ప్రజల్లో పెరిగే అభద్రతాభావం భవిష్యత్తులో దేశ ప్రజాస్వామ్య మనుగడకే ముప్పుగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

- 131వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు
- మహిళా సాధికారతకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపు

కామారెడ్డి, సెప్టెంబర్ 26 (మనం ప్రతినిధి): చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి సమాజానికి ఆదర్శమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా శనివారం కామారెడ్డి పట్టణంలోని ఆర్అండ్బీ అతిథిగృహం ఎదురుగా ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., తెలంగాణ చరిత్రలో సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం ధైర్యంగా పోరాడిన వీరవనితగా చాకలి ఐలమ్మ చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలు, నిబద్ధత, పోరాట పటిమ నేటి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం పోరాటం.



సామాజిక అసమానతలు, దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం సమానత్వం, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసిందన్నారు. ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు, హక్కులు, గౌరవం కల్పించడమే ఆమె ఆశయాలకు నిజమైన నివాళి అని తెలిపారు. ఐలమ్మ స్ఫూర్తితో సామాజిక సమానత్వం, మహిళా సాధికారత, అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, తహసీల్దార్ హిమబిందు, బీసీ సంక్షేమ అధికారి నర్సయ్య, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ ఇప్పా ఉమారాణి శ్రీనివాస్, వైస్ చైర్మన్ గోదావరి స్వామి, టీఎన్జీవోస్ ప్రతినిధులు, బీసీ విద్యార్థి సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# మహిళా సంఘం భవనం ప్రారంభం

- మహిళల ఆర్థిక సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే సత్యనారాయణ రావు



**టేకుమట్ల సెప్టెంబర్ 26 మనం న్యూస్:** టేకుమట్ల మండలం పంగిడిపల్లి గ్రామంలో పది లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన మహిళా సంఘం భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని భవనాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా గ్రామ మహిళలు,మహిళా సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికి పూలమాలలు వేసి సన్మానించారు అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలను స్వయం సమృద్ధి దిశగా నడిపించే లక్ష్యంతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు గ్రామీణ ప్రాంత మహిళలు సంఘటితంగా ముందుకు సాగి ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడానికి ప్రతి గ్రామంలో మహిళా సంఘాలకు ప్రత్యేక భవనాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు మహిళా సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు స్వయం సహాయక సంఘాల ద్వారా వేలాది మంది మహిళలు చిన్నచిన్న పొదుపులతో ప్రారంభించి నేడు స్వయం ఉపాధి రంగాల్లో విజయవంతంగా రాణిస్తున్నారని అన్నారు మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు, వడ్డీ రాయితీలు, శిక్షణ కార్యక్రమాలు, మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తూ వారి ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ, సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు వంటి ఆదాయ వనరులను మహిళా సంఘాలకు అందజేస్తోందని తెలిపారు దీనివల్ల మహిళలు ఉపాధి పొందడమే కాకుండా కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకునే అవకాశం కలుగుతుందన్నారు. మహిళలు వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో కూడా ముందుకు రావాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే మహత్తర లక్ష్యంతో పనిచేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు మహిళల సాధికారత ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని, మహిళలు బలపడితే కుటుంబం, గ్రామం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని అన్నారు అందుకే మహిళా సంఘాల అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని, స్వయం ఉపాధి రంగాల్లో విజయాలు సాధించాలని మహిళా సంఘాల ద్వారా గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు టేకుమట్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొని రాబోయే పది నెలల వరకు ప్రభావంతో నీటి సమస్య ఉండడంతో నీటి సమస్యపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి మాజీ జెడ్పిటిసి పులి తిరుపతిరెడ్డి మరియు సర్పంచులు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల నాయకులు, సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్యాయంపై పోరాటానికి ఐలమ్మ స్ఫూర్తి

- ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్



**ములుగు, సెప్టెంబర్ 26, మనం ప్రతినిధి:** వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ములుగులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆమెకు ఘన నివాళులు అర్పించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె చూపిన తెగువ, ధైర్యం, పట్టుదల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. అన్యాయాన్ని ఎదిరించి పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన ఐలమ్మ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ ములుగు జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, ములుగు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మునినపల్లి కుమార్గౌడ్, ములుగు పట్టణ అధ్యక్షుడు లావుడ్య రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కునూరు అశోక్గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గుండెబోయిన రమేష్, మండల అధికార ప్రతినిధి బోడ రఘు, కార్మిక విభాగం మండల అధ్యక్షుడు గూడెల్లి ఓదెలు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు గందె రాజు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు హాజీ పాషా, కాంగ్రెస్ నాయకులు శ్రీధర్, కర్నె రతన్, బొచ్చు బిక్షపతి, జంపయ్య పాల్గొన్నారు.

## ఆపదలో అండగా నిలిచిన సేవాభారతి

**నల్గొండ, సెప్టెంబర్ 25( మనంన్యూస్):** నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు రోజుల క్రితం బాలింత అరుణ మృతి చెందారు. పాలమూరు జిల్లాకు చెందిన ఆమె కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న నల్గొండ అవుట్ పోలీస్ కానిస్టేబుల్ రాజ్కుమార్ గారు వెంటనే స్పందించి సేవాభారతి సభ్యులకు సమాచారం అందించారు.విషయం తెలుసుకున్న నల్గొండ సేవాభారతి సభ్యులు తక్షణమే మానవతా దృక్పథంతో స్పందించారు. తమ సభ్యుల సహకారంతో అంబులెన్స్ ఏర్పాటు చేసి, మృతదేహాన్ని తరలించడంతో పాటు దహన సంస్కారాలను కూడా పూర్తి చేశారు. కుటుంబ సభ్యులు ఆపదలో ఉన్న సమయంలో సేవాభారతి అందించిన సహాయం వారికి ఎంతో అండగా నిలిచింది. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే సేవాభారతి లక్ష్యమని చాటి చెప్పేలా ఈ సేవా కార్యక్రమం నిలిచింది.ఈ కార్యక్రమంలో సేవా భారతి సభ్యులు భీమనపల్లి శ్రీకాంత్ ఎలిజాల నరసింహ మల్లెబోయిన రాజు గణేష్ సందీప్ తదితరులు ఉన్నారు.

## ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజా పాలన

- రేవంత్‌రెడ్డి సారథ్యంలో సామాజిక న్యాయానికి పెద్దపీట
- కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు రేగటి రవి గౌడ్, సింగల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు




**తుంగతుర్తి, సెప్టెంబర్ 26, (మనం న్యూస్):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముఖ్యమంత్రి ఎ. రేవంత్రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతోందని కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు రేగటి రవి గౌడ్, సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. శనివారం చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా తుంగతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శాసనసభ్యులు మందుల సామెల్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేగటి రవి గౌడ్, సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులుతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...దొరల పెత్తనం, అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో స్ఫూర్తిదాయకమని అన్నారు. భూమి, భుక్తి, ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన తెగువ నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.ఐలమ్మ ఆశయాల్లోని సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవ స్ఫూర్తితో ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. పేదలు, మహిళలు, బీసీలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజా పాలన లక్ష్యాలను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఐలమ్మ పోరాటాన్ని సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవానికి స్ఫూర్తిగా గుర్తుచేసింది. ఐలమ్మ జయంతి జరుపుకోవడం మాత్రమే కాకుండా.. ఆమె ఆశయాలను ఆచరణలోకి తీసుకురావడమే నిజమైన నివాళి అని కాంగ్రెస్ అన్నారు. సమాజంలోని అణగారిన వర్గాలకు న్యాయం, సమాన అవకాశాలు, ఆత్మగౌరవం కల్పించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న గ్రంథాలయ చైర్మన్ గంగరాజు,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మారగాని వెంకటయ్య, నాయకులు పోలేపాక రామచంద్రు, దాసరి శ్రీను, మాజీ ఎంపిటిసి చింతకుంట్ల బాబు, కొండ రాజు, పెండెం రామ్మూర్తి, పెద్ద బోయిన అజయ్, పొన్నాల సృజన్ కుమార్, తప్పట్ల శంకర్,కొండ పరశురాం, గుండగాని మహేందర్, ముత్యాల వెంకటేశ్వర్లు, జలంధర్, కూరపాటి వెంకటేష్, భాష బోయిన వెంకన్న వెంకన్న,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మకు ఘన నివాళి




**సూర్యాపేట, సెప్టెంబర్ 26 (మనం ప్రతినిధి):** చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ కె. నరసింహ, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వీరనారి చాకలి ఐలమ్మ అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన గొప్ప పోరాట యోధురాలని కొనియాడారు. అన్యాయం, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం, జీవితంలో ఎదురైన ఎన్నో కష్టాలను ధైర్యంగా ఎదుర్కొన్న తీరు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ పోరాట పటిమ, ఆత్మవిశ్వాసం, ధైర్యసాహసాలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని మరో మారు స్పష్టం చేశారు. సమాజంలో సమానత్వం, న్యాయం కోసం ఆమె చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎస్పీతెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఆర్ఐ జానయ్య, ఫింగర్ప్రింట్స్ ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయిరాం, ఆర్ఎస్ఐ అన్వర్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మన్మోహన్‌సింగ్, ఐలమ్మకు ఘన నివాళులు




**ములుగు, సెప్టెంబర్ 26, మనం ప్రతినిధి:** మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్సింగ్, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ములుగులో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇస్సార్ ఖాన్ మాట్లాడుతూ.. దేశ ఆర్థిక ప్రగతికి దిశానిర్దేశం చేసిన ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్సింగ్ అని కొనియాడారు. ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టి దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో, ప్రపంచ ఆర్థిక వేదికపై భారత్ స్థాయిని పెంచడంలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. ప్రజాస్వామ్య విలువల పట్ల ఆయన అంకితభావం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, విముక్తి, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం, ప్రదర్శించిన ధైర్యసాహసాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని ఇస్సార్ ఖాన్ అన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్చార్జి రాకేష్, ములుగు అసెంబ్లీ అధ్యక్షుడు మారం సుమన్రెడ్డి, రాష్ట్ర, జిల్లా, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## భూ రీ సర్వేకు శ్రీకారం



- పైలెట్ ప్రాజెక్టుగా మామిడిపల్లి,చెనాన్నపురం ఎంపిక
- నాగారం మండలంలో రెండు గ్రామాల ఎంపిక
- తొలుత చెన్నాపురంలో భూ రీ సర్వే ప్రారంభం

**నాగారం,సెప్టెంబర్ 26, మనం న్యూస్:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేలో భాగంగా నాగారం మండల పరిధిలోని చెన్నాపురం,మామిడిపల్లి గ్రామాలను ఎంపిక చేసినట్లు తహసీల్దార్ దేవేంద్రప్రసాద్ తెలిపారు.ఈ రెండు గ్రామాల్లో భూ రీ సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ముందుగా చెన్నాపురం గ్రామంలో భూ రీ సర్వే ప్రక్రియను ప్రారంభించినట్లు తహసీల్దార్ వెల్లడించారు.భూముల వివరాలను క్షేత్రస్థాయిలో వ్యత్యాసాలను పరిశీలించి,తదుపరి మామిడిపల్లి లోను రీ సర్వే ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలిపారు.ప్రస్తుతం రెవెన్యూ రికార్డులలో ఉన్న లోపాలను సరి చేయటకు, ప్రభుత్వం చేపట్టిన ఈ భూ రీ సర్వే ద్వారా భూములకు సంబంధించిన వివరాలను సేకరించి,భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకతకు కృషి చేయనున్నట్లు వివరించారు. మిగతా గ్రామాల్లోనూ రెవెన్యూ శాఖ ఆదేశాల ప్రకారం సీసీఎల్ఏ సూచనల మేరకు భూ రీ సర్వే నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా గణేష్ నిమజ్జన వేడుకలు



- సహకరించిన ఉత్సవ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు
- అందరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాం
- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్లగొండ --సెప్టెంబర్ 26 (మనం ప్రతినిధి):** నల్గొండ జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా వినాయక నిమజ్జనం ప్రశాంతంగా ,సవ్యంగా నిర్వహించేలా సహకరించిన జిల్లా ప్రజలు,ప్రజాప్రతినిధులు,గణేష్ ఉత్సవ కమిటీల సభ్యులు,అధికారులు,సిబ్బందికి జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్,ఎస్ పి.శరత్ చంద్ర పవర్ లు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం కొంతమంది కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంలో గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించడం లో జిల్లా యంత్రాంగానికి సహకరించినందుకు జిల్లా కలెక్టర్,ఎస్ పి లు వచ్చిన కొంత మంది సభ్యులను అభినందించడమే కాకా శాలువాతో సన్మానించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్ పి లు మాట్లాడుతూ జిల్లాలో అందరి సహకారంతో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా ముగిసిందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకొని, సూచనలు పాటిస్తూ ప్రజలు, అధికారులు,సభ్యులు సమన్వయం చేసుకుంటూ గణపతి నవరాత్రులు విజయవంతంగా ముగించడం చాలా సంతోషంగా ఉందని కలెక్టర్ అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, డి ఆర్ ఓ దశరద, తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి

- రెండో విడతలో జగిత్యాల నియోజకవర్గానికి 2,000 ఇళ్లు మంజూరు



**జగిత్యాల సెప్టెంబర్ 26(మనం న్యూస్):** జగిత్యాల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతలో జగిత్యాల నియోజకవర్గానికి 2,000 ఇళ్లు మంజూరైన నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ అధికారులకు సూచించారు. జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలతో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రెండో విడతలో మంజూరైన ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు కేటాయించిన కోటా ప్రకారం అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని తెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. అలాగే మొదటి విడతలో జగిత్యాల నియోజకవర్గానికి మంజూరైన 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని సమీక్షించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనులను త్వరితగతిన పూర్తి చేసేలా మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. హౌసింగ్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్య ప్రణవ్ ఎంపిడిఓ లు రమాదేవి చిరంజీవి వాసవి భీమేష్ నీరజ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ప్రతిభావంతులకు అండ లీగల్ ఎయిడ్ క్లినిక్

- కలెక్టరేట్ ఆవరణలో న్యాయ సహాయ కేంద్రం ప్రారంభం
- బాధితులు సద్వినియోగం చేసుకోవాలి జడ్జి డా శివరామ్ ప్రసాద్, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట సెప్టెంబర్ 26 (మనం ప్రతినిధి):** శారీరక, మానసిక, వైకల్యాలున్న ప్రత్యేక ప్రతిభావంతులకు చట్టపరమైన రక్షణ, ఉచిత న్యాయ సేవలు అందించడమే లక్ష్యంగా సూర్యాపేట కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా సంక్షేమ కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లినిక్ (న్యాయ సహాయ కేంద్రం) ఏర్పాటైంది. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు,స్కీమ్-2024 నిబంధనల మేరకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి డాక్టర్ పి. శివరామ్ ప్రసాద్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి భవ్య కోవిలతో కలిసి శనివారం ప్రారంభించారు.

### హక్కుల రక్షణకు మార్గదర్శి జిల్లా జడ్జి

న్యాయమూర్తి డాక్టర్ పి.శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. సమాజంలో నిస్సహాయ స్థితిలో ఉన్న దివ్యాంగులు, మానసిక వైకల్యాలున్న వారికి అండగా నిలిచేందుకు ఈ క్లినిక్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బాధితులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాలు, సరైన మార్గదర్శకత్వం అందించడంతో పాటు చట్టపరమైన హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని స్పష్టం చేశారు.

### సమస్యల పరిష్కారానికి సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ.. సమీకృత కలెక్టరేట్ భవనంలోనే దివ్యాంగుల కోసం ప్రత్యేక న్యాయ సహాయ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావడం శుభపరిణామమన్నారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలున్నా బాధితులు సంకోచించకుండా ఈ క్లినిక్ను సంప్రదించి పరిష్కారం పొందాలని సూచించారు. ఈ కేంద్రం ద్వారా లభించే సేవలపై దివ్యాంగులు, సాధారణ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి. హాసన్, లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్యానెల్ న్యాయవాది దావుల చిన్న వీరప్రసాద్,పారా లీగల్ వాలంటీర్ జయ, న్యాయ, సంక్షేమ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టులో ఘనంగా పవిత్రోత్సవాలు

### ప్రత్యేక అభిషేకాలు, మహాపూర్ణాహుతి, పవిత్ర సమర్పణ



**జగిత్యాల / మల్యాల సెప్టెంబర్ 26 ( మనం ప్రతినిధి ):** జగిత్యాల జిల్లాలోని కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో మూడు రోజులుగా వైభవంగా నిర్వహించిన పవిత్రోత్సవాలు శనివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. పవిత్రోత్సవాల చివరి రోజు శనివారం ఉదయం శ్రీ ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి, అనంతరం పట్టు వస్త్రాలతో విశేషంగా అలంకరించారు. యాగశాలలో అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య మూలమంత్ర హోమాలను నిర్వహించి, అనంతరం మహాపూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాపూర్ణాహుతి అనంతరం యాగశాల నుంచి దేవాలయం వరకు ఉత్సవమూర్తులతో పాటు పవిత్రాలను తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీ ఆంజనేయ స్వామి వారికి పట్టు పవిత్రాలను అలంకరించి, కుంభ ప్రోక్షణ, పవిత్ర సమర్పణ కార్యక్రమాలను ఆగమ శాస్త్రానుసారం నిర్వహించారు. చివరగా వేద పండితుల ఆధ్వర్యంలో ఆశీర్వచనం కార్యక్రమం నిర్వహించడంతో పవిత్రోత్సవాలు సంపూర్ణంగా ముగిశాయి. పవిత్రోత్సవాల సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమాలు, శోభాయాత్ర మరియు పవిత్ర సమర్పణ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.ఈరోజు పౌర్ణమి కావడంతో వేల సంఖ్యలో భక్తులు కొండగట్టు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం తో ఆలయ ఇఓ అంజనరెడ్డి, స్థానాచార్యులు కపిందర్, సూపరింటెండెంట్, అర్చకులు,ఆలయ సిబ్బంది, నాయకులు ఎడమల పద్మా రెడ్డి, పబ్బతి విమల నారాయణ రెడ్డి, కిషన్ రెడ్డి, శ్రీనివాస్, తిరుపతి, కేశవ రెడ్డి, అరుణ, వంచ లక్ష్మి, ప్రభాకర్,పెద్ద ఎత్తున భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజుల బ్యాంకు ఉద్యోగుల సమ్మె

- ఆదివారం పనిచేయనున్న బ్యాంకులు
- డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలి
- జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌కుమార్

**జగిత్యాల, సెప్టెంబర్ 26 (మనం న్యూస్) :** తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగులు, అధికారుల సంఘాలు ఈ నెల 28 నుండి 30 వరకు మూడు రోజుల పాటు దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్కుమార్ తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా మాట్లాడుతూ సమ్మె కారణంగా ఆయా రోజుల్లో జగిత్యాల జిల్లాలోని బ్యాంకు శాఖల్లో ప్రత్యక్ష సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. సమ్మె నేపథ్యంలో ఖాతాదారులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు, కేంద్ర ఆర్థికశాఖ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతితో 27న (ఆదివారం) బ్యాంకు శాఖలతో పాటు కరెన్సీ చెస్టులు కూడా యథావిధిగా పనిచేస్తాయని స్పష్టం చేశారు. ఖాతాదారులు తమ అత్యవసర నగదు లావాదేవీలు, చెక్కుల క్లియరెన్స్ వంటి పనులను ఆదివారం రోజే పూర్తి చేసుకోవాలని సూచించారు.



డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి..

సమ్మె రోజుల్లో నేరుగా బ్యాంకు శాఖలకు వెళ్లాల్సిన అవసరం లేని లావాదేవీల కోసం అందుబాటులో ఉన్న డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. యుపిఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ యాప్లు, ఏటిఎంల ద్వారా నగదు ఉపసంహరణ వంటి సేవలు యథావిధిగా లభిస్తాయని తెలిపారు. ఖాతాదారులు ముందస్తు ప్రణాళికతో తమ బ్యాంకింగ్ అవసరాలను పూర్తి చేసుకుని, బ్యాంకు యాజమాన్యానికి సహకరించాలని కోరారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి



నల్లబెల్లి, సెప్టెంబర్ 26, మనం ప్రతినిధి: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీర వనిత చిట్యాల (చాకలి) ఐలమ్మ 131వ జయంతి వేడుకలను నల్లబెల్లి మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. నల్లబెల్లి గ్రామ రజక సంఘం అధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శి రాపోల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నల్లబెల్లి మండల తహసీల్దార్ ముప్పు కృష్ణ చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐలమ్మ జీవితం, ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం అప్పటి సామాజిక పరిస్థితులను ఎదుర్కొంటూ ఆమె చూపిన ధైర్యసాహసాలను గుర్తు చేశారు. స్థానిక సర్పంచ్ నాగేల్లి జ్యోతి ప్రకాష్, జిల్లా రజక సంఘం నాయకులు, నాచినపల్లి గ్రామ సర్పంచ్ పెండ్యాల రాజు, నల్లబెల్లి రజక సంఘం గౌరవ అధ్యక్షులు నాగేల్లి మొగిలి, ఉపసర్పంచ్ గుమ్మడి వేణు తదితరులు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాపోల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని రజక సమాజంతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. ఆమె జయంతి వేడుకలను ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తూ ఐలమ్మ పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చింతకింది కుమారస్వామి, సీపీఎం మండల నాయకులు బొడిగె సమ్మయ్య, కడియాల మనోహర్, గుండాల శ్రీశైలం, తెలంగాణ ఉద్యమ నాయకులు పరికి కోరనేల్, ఆకుల సాంబరావు, రజక సంఘం మండల నాయకులు పొదిల్ల శోభన్, వైనాల అశోక్, ఆవునూరి కిషోర్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సునీత, రంగాపురం హెడ్మాస్టర్ పున్నం యాకూబ్ రెడ్డి, నల్లబెల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు బత్తిని మహేష్, కొండాయిలపల్లి మాజీ సర్పంచ్ మామిండ్ల మోహన్ రెడ్డి, పెండ్యాల మహేందర్, నల్లబెల్లి గ్రామ రజక సంఘం నాయకులు వైనాల జక్కయ్య, సార మల్లయ్య, పెద్ద వీరస్వామి, పున్నం రాజ్కుమార్, గుండేటి సాంబయ్య తదితరులతో పాటు మండలంలోని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ఐలమ్మ జయంతి వేడుకలను విజయవంతం చేశారు.



## జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటిన పాలిటెక్నిక్ విద్యార్థులు

కాటారం, సెప్టెంబర్ 26 మనం న్యూస్: ప్రపంచ పర్యాటక దినోత్సవం-2026 సందర్భంగా శుక్రవారం రేగొండ మండలం పాండవుల గుట్ట వద్ద నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అంతరించిపోతున్న పర్యాటక ప్రాంతాల నివేదిక విభాగంలో సీఎస్ఈ మొదటి సంవత్సరం విద్యార్థి బి. కీర్తన్ రూపొందించిన 'కోటగుల్లు - గణపూర్' నివేదికకు ప్రథమ బహుమతి లభించింది. త్రివేణి సంగమం స్కిట్ లో అక్షయ బ ఒదం, భక్తి గీతం విభాగంలో వర్షిత, సాత్విక, వ్యాసరచనలో అశ్మిత, షార్ట్ ఫిల్మ్ రీల్ విభాగంలో మోక్షిత్, సిద్ధు ద్వితీయ బహుమతులు సాధించారు. ప్రథమ స్థానంలో నిలిచిన బి. కీర్తన్ కు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ రూ.12,000 నగదు అందజేయడంతో పాటు మిగితా విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, వారికి మార్గనిర్దేశం చేసిన నోడల్ ఆఫీసర్ పూర్ణ సాయికిరణ్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ పుల్లూరి నాగేశ్వర్ లను ప్రిన్సిపాల్ డా. ఎం. రాజ్ కుమార్, విభాగాధిపతులు డా. ఎం. శివ నందిని, ఎం. రవికిరణ్, డా. ఎం. రవీందర్ రెడ్డి, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ,మాజీ ప్రధాని మన్మోహన్ జయంతి వేడుకలు



కాటారం, సెప్టెంబర్ 26(మనం న్యూస్): వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకను కాటారం రజక సంఘం, మహనీయుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అంబేద్కర్ కూడలిలో, భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి వేడుకలను కాటారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలవమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడి, పేదలు, రైతులు మరియు అణగారిన వర్గాల హక్కుల కోసం నిలబడిన వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశ ప్రధానిగా ఆయన అందించిన సేవల గూర్చి కొనియాడారు. ఒక విద్యావేత్తగా, ఆర్థికవేత్తగా మన్మోహన్ సింగ్ దేశ అభివృద్ధి కోసం పాటు పడ్డారని దేశ అభివృద్ధి కోసం కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, సర్పంచ్ పంతకాని సడవలి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఉప సర్పంచ్ కొండగొర్ల బానయ్య, బొమ్మ సమ్మి రెడ్డి, తాటిబాపు, స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ కొట్టే సతీష్, వార్డ్ సభ్యులు, పసుల మొగిలి, కొర్ర శ్రీకాంత్, ఆత్మకూరి కుమార్ యాదవ్,గంట దేవదాస్, గట్టు రమేష్ మరియు రజక సంఘం నాయకులు మూసాపురి నరసయ్య ,ఐలయ్య, పెనుగొండ శ్రీనివాస్, గుడికందుల శంకర్, పైడాకుల సురేష్, పున్నం శంకర్, పెనుగొండ బాపు, పున్నం సుమన్, కల్లగుంట సురేష్, నడిగోట సాగర్, కనుకుల తరుణ్, మండల అధ్యక్షుడు తెప్పల దేవేందర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, వేమునూరి ప్రభాకర్ రెడ్డి, కుంభం స్వప్న, చీమల రాజు,పాల్గొన్నారు.

## వీర వనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మహిళా శక్తికి స్ఫూర్తిదాయకం

- జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. రాజా గౌడ్

జగిత్యాల, సెప్టెంబర్, 26 (మనం న్యూస్): వీర



వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి మహిళా శక్తికి స్ఫూర్తిదాయకమని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. రాజాగౌడ్ అన్నారు. శనివారం రోజున సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజాగౌడ్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజాగౌడ్ మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ సంఘ సేవకురాలిగా, భూమి కోసం సాగిన సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమతో వీర వనితగా చరిత్రలో నిలిచి, ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని తెలిపారు. సమాజహితం కోసం పోరాడిన మహనీయుల స్ఫూర్తి, వారి త్యాగాలు, గొప్పతనం ప్రజలకు తెలియజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచి, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన వీర వనిత చాకలి ఐలమ్మ అని, అటువంటి వీర వనితను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ శాఖ అధికారి జయరాజ్, కలెక్టరేట్ ఏవో కిషన్ ,రజక సంఘ నాయకులు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చలి వాగులో వ్యక్తి గల్లంతు



టేకుమట్ల సెప్టెంబర్ 26 మనం న్యూస్: మండలంలోని ద్వారకపేట గ్రామానికి చెందిన చిటికెల రవీందర్ రెడ్డి అవసరం నిమిత్తం ఎంపెడు గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో ప్రవహిస్తున్న చలి వాగు దాటుతూ లోతైన నీటిలో మునిగి గల్లంతయ్యాడు. నీటి లోతు ఎక్కువగా ఉండటంతో అక్కడే ఉన్న వారు కాపాడలేకపోయారు. రెస్క్యూ టీం కి సమాచారం అందించారు సమాచారం అందుకున్న రెస్క్యూ టీమ్ గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్సై అమూల్య సంఘటన స్థలం లోనే ఉండి గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



భూపాలపల్లి సెప్టెంబర్ 26 మనం న్యూస్: చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు జిల్లా కేంద్రంలో శనివారం నాడు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, కలెక్టర్ కార్యాలయం ఐడీఓసీలో నిర్వహించిన అధికారిక వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ నిజాం పాలనలో తెలంగాణ రైతులు ఎదుర్కొన్న దోపిడీ, దొరల అణచివేత, బహుజన వర్గాలపై జరిగిన వివక్ష, మహిళలు అనుభవించిన అన్యాయాలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన మహనీయురాలు చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆమె పోరాటం కేవలం భూమి కోసం మాత్రమే కాకుండా ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, సమానత్వం కోసం సాగిన మహోన్నత ఉద్యమమని పేర్కొన్నారు.తాము సాగు చేస్తున్న భూములపై హక్కులు సాధించాలనే సంకల్పంతో పేదలు, రైతులు, కూలీలు సంఘటితమై పోరాడిన చారిత్రక సందర్భంలో చాకలి ఐలమ్మ ముందుండి నాయకత్వం వహించి విజయం సాధించిందని ఎమ్మెల్యే తెలిపారు. అణగారిన వర్గాల హక్కుల సాధనలో ఆమె పోషించిన పాత్ర తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించడం గర్వకారణమన్నారు.

## బ్యాంకు సమ్మెతో లాభం నష్టం ఎవరికి?

- తెలంగాణ శ్రీనివాస్ నాయక్

హైదరాబాద్, సెప్టెంబర్ 26(మనంన్యూస్): యావత్ భారతదేశం లో ఉన్న ఏడు ప్రతినిధుల సంఘాలు.. ఎనిమిది లక్షలకు పైగా బ్యాంకింగ్ సిబ్బందులకు ప్రాతినిధ్యం వహిస్తున్న యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ( యు ఎఫ్ బి యు ) ఈనెల 28 నుండి మూడు రోజులపాటు సమ్మెకు పిలుపునివ్వడంతో లాభం నష్టం ఎవరికి ఈ సమాధానం కేంద్ర ప్రభుత్వం తెలుపాలని సామాజిక జాతీయ భావం గల



ఉద్యమ నేత, నర్సంపేట కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి తెలంగాణ శ్రీనివాస్ నాయక్ ప్రశ్నించారు బ్యాంకు ఉద్యోగుల ప్రధాన డిమాండ్లను పరిష్కరించడంలో కేంద్ర కార్మిక శాఖ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ విఫలమయ్యారని అన్నారు వారానికి ఐదు రోజులు సెలవులు ఇస్తే అదనంగా 50 నిమిషాల పాటు మరో రోజు పని చేస్తామని ఉద్యోగస్తులు స్పష్టం చేస్తున్న కూడా ప్రభుత్వ వైఖరి మారకపోవడం విచారకరమన్నారు ఆర్.బి.ఐ, ఐఆర్డిఏఐ, సెంట్రల్ గవర్నమెంట్, ఐటి రంగాల్లో ఐదు రోజుల పని దినాలు అమలు చేస్తున్నారని అంతేకాదు 2024 మార్చి వేతన ఒప్పందం సమయంలో ఐదు రోజుల బ్యాంకింగ్ సూత్రపాయంగా సంతకాలు జరిగాయని ప్రభుత్వం ఇప్పుడు మొండి వైఖరితో బ్యాంకు ఉద్యోగస్తులను ఇబ్బందులు గురి చేస్తుందని దీని మూలంగా తీవ్రమైన మానసిక ఒత్తిడి, సిబ్బంది కొరత, ఆరోగ్యం కుటుంబ సమతుల్యత దెబ్బతింటున్నాయని తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ప్రజల కు చిన్న, సన్నా కార వ్యాపారులకు ఇలా అనేక రకాలుగా ప్రతికూల అంశంగా మారబోతుందని తక్షణమే సామరస్యంతో వారి డిమాండ్ లను పరిష్కరిస్తూ యధావిధిగా బ్యాంకులు తెరిచి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని తెలంగాణ శ్రీనివాస్ నాయక్ విజ్ఞప్తి చేశారు లేనిపక్షంలో బ్యాంకు సిబ్బంది సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు మద్దతుగా ఉంటామని హెచ్చరించారు

## మామునూర్ ఎన్‌సిసి క్యాంపులో అగ్నిమాపక సిబ్బంది డెమో

హనుమకొండ, సెప్టెంబర్ 26(మనంన్యూస్): మామునూర్ పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ లో జరుగుతున్న కంబైన్డ్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ ౹౹౹ ౹౹ యొక్క క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ డి.వి సంతోష్ మెహెర్ మరియు డిప్యూటీ క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ విజయకుమార్ టి ఆధ్వర్యంలో నడుస్తున్న ఎన్సిసి శిక్షణలో భాగంగా ఈరోజు అగ్నిమాపక సిబ్బంది, ఘన, ద్రవ, వాయు రకాల అగ్ని ప్రమాదాల గురించి వివరించారు అదేవిధంగా వాటిని ఆర్పివేయు విధానాలైన కూలింగ్, బ్లాంకెటింగ్, స్టార్వేషన్ ల గురించి వారు ఉపయోగించే పరికరాలు టైప్ ఏ,బి,సీ ల గురించి వివరించారు, అగ్ని ప్రమాదాలను ఆర్పివేయుటకు ఉపయోగించే పరికరాలు టైప్ ఏ, బి ,సి ల గురించి వివరించారు. అదేవిధంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు, ప్రథమ చికిత్సలు, సెల్ఫ్ ప్రొటెక్టింగ్ విధానాల గురించి డెమో



ద్వారా ఎండి అయోగ్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్,ఫైర్ ఫైటింగ్ టెక్నీషియన్స్ నరసింహ, లక్ష్మీప్రసాద్, జయరాం, రంజిత్ ,నితిన్, బిక్షపతి, వాజిద్ లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో క్యాంపు సీనియర్ జెసిఓ సంజయ్ కుమార్ రానా, ట్రైనింగ్ జేసిఓ సుబేదార్ రమేష్,టెక్ బాహదూర్, బిహెచ్ఎం అమోల్ గవాయి,నాయక్ ఆంజనేయులు, ఎన్సిసి ఆఫీసర్లు లెఫ్టినెంట్ సబిత, చీఫ్ ఆఫీసర్ ఎల్ కుమారస్వామి, సుమలత, సంగీత, దివ్య, జిసిఐ కె ఎస్ సుజితా దేవి,గాయత్రి, కేర్ టేకర్లు సుభద్ర,శిల్ప,శ్రీలత,శైలజ మరియు ఎన్సిసి క్యాడేట్లు పాల్గొనడం జరిగింది.

## అన్న సమారాధనలో పాల్గొన్న కొవ్వలి నాయుడు

నరసాపురం, సెప్టెంబర్ 26 (మనం న్యూస్) : విఘ్నాలు తొలగించే వినాయకుడి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు ఆకాంక్షించారు. నరసాపురం పట్టణంలోని 6వ వార్డులో కోవెలగుడి వద్ద ఏర్పాటు చేసిన శ్రీ గణపతి నవరాత్రుల 20వ వార్షికోత్సవ మహోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం నిర్వహించిన అఖండ అన్న సమారాధన కార్యక్రమంలో కొవ్వలి రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా అఖండ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ. గత 20 సంవత్సరాలుగా కమిటీ సభ్యులు అత్యంత భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి మహోత్సవాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొవ్వలి రామ్మోహన్ నాయుడు అభిమానులు, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

## గర్భిణీలు పోషక విలువల ఆహారం తీసుకోవాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

టేకుమట్ల సెప్టెంబర్ 26 మనం న్యూస్: గర్భిణీ స్త్రీలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఎమ్మెల్యే గంట సత్యనారాయణ రావు అన్నారు. మండలంలో ని అంగన్వాడి కేంద్రంలో సూపర్వైజర్ మాధవి ఆధ్వర్యంలో పోషణ మాసం మండల్ లెవెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరైనారు.అలాగే డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ మల్లీశ్వరి, ఎంపీడీవో వసంత రామ్ , ఎమ్మార్వో స్వరూప రాణి , మండల అధికారులు , టేకుమట్ల సర్పంచ్ మాట్ల శ్రీనివాస్ రామకృష్ణాపూర్ (టి)గునిగంటి రజిని మహేందర్ వివిధ గ్రామాల నుండి వచ్చేసిన సర్పంచులు,



గర్భిణీలు తల్లులు పాల్గొన్నారు ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణీ దశ నుండిపోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవాలి మరియు సీజన్లో దొరికే పండ్లు ఆకుకూరలు కూరగాయలు పాలు ఎక్కువగా తీసుకోవాలి చుట్టూ పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి అంగన్వాడి కేంద్రంలో ఇచ్చే పాలు గుడ్లు ఒక్క పూట భోజనం గర్భిణీలు బాలింతలు వెళ్లి తీసుకోవాలని సూచించారు గర్భిణీకి శ్రీమంతం చేయనైనది అలాగే బి డబ్ల్యూ ఓ మల్లేశ్వరి మేడం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పోషణ మాసం సెప్టెంబర్ లో జరుగుతుందిఈ సంవత్సరముథీమ్ వచ్చేసి'మన అంగన్వాడి మన బాధ్యత' ' తల్లులకు, పిల్లలకు పోషణ అవసరం మీ పిల్లలు వయసుకు తగ్గ బరువు లేదా ఎత్తుకు తగిన బరువు ఉన్నప్పుడే వాళ్లు శారీరకంగా మానసికంగా ఎదుగుదల ఉంటుంది. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే గుడ్లు, ఆకుకూరలు ,పండ్లు, చిరుధాన్యాలు, పప్పు దినుసులు, ఎక్కువగా మీపిల్లలకు పెట్టి ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలని తల్లులకు గర్భిణీలకు బాలింతలకు అవగాహన కల్పించడం జరిగింది పిల్లలు,,అంగన్వాడి టీచర్స్, ఆయాలు పాల్గొన్నారు

## సూరిబాబు కుటుంబాన్ని పరామర్శించిన వైసీపీ నాయకులు

పోడూరు, సెప్టెంబర్ 26, మనం ప్రతినిధి: మాజీ ఆచంట ఏఎంసీ చైర్మన్, వైసీపీ నాయకుడు చేకూరి సూర్యనారాయణరాజు (సూరిబాబు) తండ్రి రామకృష్ణంరాజు ఇటీవలే పరమపదించిన విషయం తెలుసుకున్న రాహుల్ సామాజిక సేవా సంస్థ, వృద్ధాశ్రమం అధినేత, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు శనివారం పోడూరులోని చేకూరి సూర్యనారాయణ రాజు (సూరిబాబు) నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. రామకృష్ణంరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు వీరా మల్లికార్జునుడు, శివాజీ రాజు, వరహాలు రాజు తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరాల ప్రతిపాదనలు త్వరగా అందజేయాలి

### దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్



భూపాలపల్లి సెప్టెంబర్ 26 మనం ప్రతినిధి: ప్రభుత్వ ఆదేశాల మేరకు గోదావరి పుష్కరాలు నిర్వహణ సందర్భంగా చేపట్టనున్న వివిధ అభివృద్ధి, రహదారి నిర్మాణ పనులకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు, అంచనాలను త్వరితగతిన సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు.

శనివారం దేవాదాయశాఖ కార్యదర్శి శైలజా రామయ్యర్ గోదావరి పుష్కర అభివృద్ధి పనులపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు ఐడిఓసి కార్యాలయం నుండి.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు.

అనంతరం రెవెన్యూ, దేవాదాయ, ప్రణాళిక, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, విద్యుత్తు తదితర శాఖల అధికారులతో

పురోగతి, ప్రతిపాదనలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

గతంలో మంజూరైన రూ.92 లక్షల పనులతో పాటు రూ.5.08 కోట్లతో చేపట్టాల్సిన అదనపు రహదారి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. బ్యాలెన్స్ పనులకు కూడా అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ కు సంబంధించిన ప్రతిపాదనలకు నివేదిక రూపొందించి పంపాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

టెండర్ ప్రక్రియ పూర్తయిన పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని ప్రతిపాదనలను వేగంగా పూర్తి చేసి నివేదికలు ఉన్నతాధికారులు పంపించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, దేవాదాయ, ప్రణాళిక, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, విద్యుత్తు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మినీ నయాగ్రా భీముని పాద జలపాతాన్ని అభివృద్ధికీ నిధులను కేటాయించాలి

- భీమునిపాదం పర్యాటక కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలి
- మంచినీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి
- పర్యాటకుల ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
- భీమునిపాదం ఎకో డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ భూక్యా రజిత మంగీలాల్ నాయక్ విజ్ఞప్తి



గూడూరు, సెప్టెంబర్ 26(మనంన్యూస్): మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం గ్రామపంచాయతీ పరిధిలోని భీమునిపాదం పర్యాటక కేంద్రానికి వచ్చే పర్యాటకులకు మెరుగైన రవాణా, మౌలిక వసతులు కల్పించాలని భీమునిపాదం ఎకో డెవలప్మెంట్ కమిటీ (ఉ౹ఇ) కోరింది. ప్రకృతి అందాలు, జలపాతాలతో పర్యాటకులను ఆకర్షిస్తున్న ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి, సందర్శకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. భీమునిపాదం పర్యాటక కేంద్రాన్ని సందర్శించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తున్నప్పటికీ, రవాణా సౌకర్యాలు, మంచినీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిటీ పేర్కొంది. ముఖ్యంగా కుటుంబ సమేతంగా వచ్చే పర్యాటకులు, మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులకు ఇబ్బందులు కలగకుండా సమీప పట్టణాలు, గ్రామాల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరింది. పర్యాటక కేంద్రంలో స్వచ్ఛమైన తాగునీటి వసతి, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు, కూర్చునేందుకు బెంచీలు, నీడనిచ్చే షెడ్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రక్షణ కంచెలు ఏర్పాటు చేయడంతో పాటు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సూచించింది. భీమునిపాదం ప్రాంతం ప్రకృతి అందాలకు నిలయంగా ఉండటంతో పర్యాటక అభివృద్ధికి ఎంతో అవకాశం ఉందని కమిటీ అభిప్రాయపడింది. ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి, పర్యాటక కేంద్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తే సందర్శకుల సంఖ్య పెరగడంతో పాటు స్థానిక గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొంది. స్థానికులకు చిన్న వ్యాపారాలు, ఆహార విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసుకునే అవకాశాలు కల్పించడం ద్వారా గ్రామీణ ఆర్థికాభివృద్ధికి తోడ్పడవచ్చని తెలిపింది. అదేవిధంగా పర్యాటక కేంద్రం పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిటీ కోరింది. ప్రకృతి వనరులకు నష్టం కలగకుండా పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించింది. జిల్లా అధికారులు, పర్యాటక శాఖ, రవాణా శాఖ అధికారులు భీమునిపాదం పర్యాటక కేంద్రాన్ని సందర్శించి అక్కడి సమస్యలను పరిశీలించాలని, అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని భీమునిపాదం ఎకో డెవలప్మెంట్ కమిటీ విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వం స్పందించి పర్యాటకుల ఇబ్బందులను తొలగించేలా తక్షణ చర్యలు చేపట్టాలని కోరింది.

## అమ్మాయిల పసిడి కూత.. ఆసియా క్రీడల్లో భారత్కు మరో గోల్

జపాన్ వేదికగా జరుగుతోన్న ఆసియా క్రీడల పతకాల పట్టికలో భారత్కు మూడో స్వర్ణం వచ్చి చేరింది. కబడ్డీ పోటీల్లో డిఫెండింగ్ ఛాంపియన్గా బరిలోకి దిగిన మన అమ్మాయిలు.. ఫైనల్లో ఇరాన్ను ఓడించి బంగారు పతకాన్ని దక్కించుకున్నారు. నువ్వా నేనా అన్నట్టు సాగిన ఈ గేమ్లో 37-34 తేడాతో మన జట్టు ఇరాన్ నుంచి విజయాన్ని లాగేసుకుంది. మరోవైపు రైఫిల్ షూటింగ్లో రజతం దక్కగా.. స్క్వాష్ జోడీ సెమీస్లో తడబడి, కాంస్యంతో సరిపెట్టుకుంది.



- 50 మీటర్ల రైఫిల్ టీమ్ ఈవెంట్ లో తిలోత్తమా సేన్, విదర్సా వినోద్, ఆషి చౌక్సే రజతాన్ని సొంతం చేసుకున్నారు. ఈ పోటీల్లో చైనా బృందం 1773 పాయింట్లతో పసడి పతకాన్ని దక్కించుకోగా.. భారత బృందానికి 1763 పాయింట్లు రావడంతో రెండో స్థానంలో నిలిచింది. 1754 పాయింట్లు సాధించిన కజకిస్థాన్కు కాంస్యం దక్కింది.
- ఇక, స్క్వాష్ విభాగంలో మిక్స్డ్ డబుల్స్ జోడి జోష్న చిన్నప్ప-సెంథిల్ కుమార్ కు కాంస్య పతకం దక్కింది. సెమీస్లో హాంకాంగ్ ద్వయం లీ కా యి, తాంగ్ మింగ్ హాంగ్ చేతిలో ఓడింది.
- అంతకుముందు, భారత అథ్లెట్, హవల్దార్ సావన్ బర్వాల్ మారథాన్లో చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ పోటీల్లో రజతంతో మెరిసి 44 ఏళ్ల తర్వాత మన దేశానికి పతకం అందించాడు.

## ఇదే నా చివరి ప్రపంచకప్..: కోహ్లీ



టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కీలక వ్యాఖ్యలు చేశాడు. వచ్చే ఏడాది జరగబోయే వన్డే ప్రపంచ కప్.. దేశం తరఫున తాను ఆడే చివరి మెగా టోర్నీ అని స్పష్టం చేశాడు. ఆ ట్రోఫీని కైవసం చేసుకునేందుకు మైదానంలో తన సర్వశక్తులూ ధారపోస్తానని తెలిపాడు. ఈ నెల 27 నుంచి వెస్టిండీస్తో ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్కు ముందు 'జియోస్టార్'తో కోహ్లీ మాట్లాడాడు. వచ్చే ఏడాది సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలు సంయుక్తంగా వన్డే ప్రపంచకప్నకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

''భారత్ తరఫున ఆడబోయే చివరి వరల్డ్కప్ ఇదే. టోర్నీని గెలవడమే నా ఏకైక లక్ష్యం. దాని కోసం ఎంత దూరమైనా వెళ్లేందుకు, మైదానంలో సర్వస్వం ధారపోసేందుకు సిద్ధంగా ఉన్నా'' అని కోహ్లీ వెల్లడించాడు. వన్డే ప్రపంచకప్లో ఉండే ఇంటెన్సిటీ మరే ఇతర టోర్నమెంట్లోనూ ఉండదని చెప్పాడు. ''ఇందులో దాదాపు 10 మ్యాచ్లను టీ20 స్థాయి తీవ్రతతో ఆడాల్సి ఉంటుంది. ఒక వన్డే మ్యాచ్ అనేది 2.5 టీ20లతో సమానం. పెద్ద టోర్నమెంట్ లేదా ప్రపంచకప్లో వరుసగా 10 మ్యాచ్లపాటు ఆ ఇంటెన్సిటీని కొనసాగించడం చాలా పెద్ద విషయం.'' అని తెలిపాడు.

**అదే అసలైన సవాలు: రోహిత్ శర్మ**

మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ మాట్లాడుతూ.. ''నేను చేయాల్సిన పని పూర్తయిందనే ఆలోచన ఎప్పుడూ రాదు. ఆడుతున్నంత కాలం.. ఏదో ఒక లక్ష్యం కోసం ఎదురుచూస్తూనే ఉంటాం. ప్రస్తుతం ప్రపంచకప్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ప్రపంచకప్ లేదా ఏదైనా ఐసీసీ టోర్నమెంట్ ఆడేటప్పుడు వేర్వేరు వేదికలపై.. వేర్వేరు ప్రత్యర్థులను ఎదుర్కొంటాం. కాబట్టి, అందుకు తగినట్లు విభిన్నంగా సిద్ధం కావాలి. కొత్తగా ఆలోచించాలి. అదే అసలైన సవాలు'' అని పేర్కొన్నాడు. రాబోయే వన్డే వరల్డ్కప్ వరకు ఆడతారా? లేదా? అనే సందేహాలకు ఈ ఇద్దరు తమ వ్యాఖ్యలతో తాజాగా చెక్పెట్టినట్లయ్యింది.

## సాత్విక్ జోడీకి షాక్

ఆసియా క్రీడల్లో బ్యాడ్మింటన్లో భారత్కు అతి పెద్ద షాక్. స్వర్ణం తెస్తుందనే అంచనాలతో టోర్నీలో అడుగుపెట్టిన సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ తొలి రౌండ్లోనే ఇంటిముఖం పట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలో దిగిన సాత్విక్-చిరాగ్ ద్వయం 21-12, 19-21, 14-21తో పకాపోన్-పీరాట్చాయ్ (థాయ్లాండ్) జంట చేతిలో అనూహ్యంగా కంగుతింది. తొలి గేమ్ తేలిగ్గా గెలిచి జోరు మీద కనిపించిన భారత జంట.. తర్వాత తడబడింది. రెండో గేమ్లో సాత్విక్ జోడీ ఆరంభంలో బాగానే ఆడినా.. తర్వాత పట్టు సడలించింది. దీంతో విరామ సమయానికి 11-9తో ఆధిక్యంలో నిలిచిన థాయ్ జంట.. ఆపై గేమ్ గెలిచి స్కోరు సమం చేసింది. నిర్ణయాత్మక మూడో గేమ్లో సాత్విక్ జోడీది అదే ఆట. మొదట దూకుడుగా ఆడిన భారత ద్వయం.. తర్వాత వెనుకబడి ఆపై ఓటమి వైపు నిలిచింది. మహిళల డబుల్స్లో గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జంట శుభారంభం చేసింది.. తొలి రౌండ్లో గాయత్రి జోడీ 21-16, 16-21, 21-16తో హి యాన్ సాంగ్-లుక్ లుక్ (హాంకాంగ్) జంటను ఓడించింది. కవిప్రియ-సిమ్రన్ ద్వయం 9-21, 5-21తో ఫెబ్రియానా-ట్రియాస్ (ఇండోనేసియా) జంట చేతిలో ఓడగా.. మిక్స్డ్ డబుల్స్లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల ద్వయం క్వార్టర్స్ చేరింది. ప్రిక్వార్టర్స్లో తనీషా జంట 21-8, 21-7తో నిబాల్-నబీహ్ (మాల్దీవులు) జోడీపై గెలిచింది.

## 'లవ్ అండ్ వార్' నుండి విక్కీ కౌశల్ ఇంటెన్స్ ఫస్ట్లుక్ విడుదల



సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'లవ్ అండ్ వార్' పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. రణబీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ తొలిసారి కలిసి నటిస్తున్న ఈ చిత్రం భారతీయ సినీ పరిశ్రమలో ప్రత్యేక చిత్రంగా నిలిచేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే రణబీర్ కపూర్, అలియా భట్ ఫస్ట్ లుక్ పోస్టర్లను విడుదల చేసిన చిత్రబృందం తాజాగా విక్కీ కౌశల్ ఫస్ట్ లుక్ పోస్టర్ను విడుదల చేసింది. ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పోస్టర్లో విక్కీ కౌశల్ సిగరెట్, లైటర్తో కనిపిస్తూ ఎంతో ఇంటెన్సా చూస్తున్న తీరు ఆకట్టుకుంటోంది. ఇప్పటివరకు చూడని విభిన్నమైన లుక్లో విక్కీ కనిపించడం విశేషం. ఆయన లుక్లో స్టైల్, చార్మ్తో పాటు పాత్రలోని తీవ్రత కూడా స్పష్టంగా కనిపిస్తోంది. భన్సాలీ సినిమాల్లో హీరోల పాత్రలకు ప్రత్యేకమైన రూపాన్ని, స్టైల్ను అందిస్తుంటారు. అదే తరహాలో విక్కీ కౌశల్ లుక్ కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. రణబీర్, అలియా తర్వాత ఇప్పుడు విక్కీ ఫస్ట్ లుక్ కూడా 'లవ్ అండ్ వార్' పై అంచనాలను మరింత పెంచింది. విక్కీ పోస్టర్ మాత్రం సినిమాకు మరింత ఇంటెన్స్ టచ్ను తీసుకొచ్చింది. ఈ చిత్రం 2027 జనవరి 21న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది.

## 'రామాయణ' నుంచి తెలుగులో 'జై జై రామ్' రిలీజ్

బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు నితీష్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న భారీ పౌరాణిక చిత్రం 'రామాయణ'. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి స్పందన దక్కించుకోగా.. తాజాగా ఫస్ట్ సింగిల్ 'జై జై రామ్' ను తెలుగులో రిలీజ్ చేశారు మేకర్స్. దైవం, సంగీతం, సినిమాటిక్ గ్రాండియర్.. ఈ మూడు కలిసినప్పుడు ఆ అనుభూతి ఎలా ఉంటుందో చూపిస్తూ వచ్చిన ఈ తొలి సింగిల్ 'బ్రజీ బ్రజీ ఖ్రురు' ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతూ విశేష స్పందన దక్కించుకుంటుంది.

కాగా.. నిర్మాత నమిత్ మల్హోత్రా ఈ విజువల్ వండర్ను అత్యున్నత సాంకేతిక విలువలతో నిర్మిస్తున్నారు. ఇందులో రాముడి పాత్రలో రణబీర్ కపూర్, సాయి పల్లవి సీతాదేవిగా, యష్ రావణాసురుడిగా, కాజల్ అగర్వాల్ మండోదరిగా, రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణక పాత్రలో కనిపించబోతున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ భారీ



మైథలాజికల్ డ్రామా మొదటి భాగాన్ని ఈ ఏడాది దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్గా విడుదల చేయనున్నారు. ఇక రెండో భాగాన్ని వచ్చే ఏడాది దీపావళికి థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## కబడ్డీలో భారత్కు డబుల్ బొనాంజా..

### అబ్బాయిలూ 'పసిడి' పట్టేశారు!

ఆసియా క్రీడల కబడ్డీలో మన అమ్మాయిలు, అబ్బాయిలు ఇరాన్ను గట్టిగానే ఢీకొట్టారు. ఇప్పటికే ఆ దేశాన్ని ఓడించి మహిళల జట్టు స్వర్ణాన్ని దక్కించుకోగా.. పురుషుల జట్టు అదే బాటలో నడిచింది. ఉత్కంఠగా జరిగిన ఫైనల్లో పసిడి కూత పెట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్ భారత్.. ఇరాన్ను 40-34 పాయింట్ల తేడాతో ఓడించింది. దీంతో కలిపి ఆసియా క్రీడల చరిత్రలో కబడ్డీ జట్టు తొమ్మిదిసార్లు బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. 2026 ఆసియా క్రీడల్లో భారత్కు ఇది నాలుగో స్వర్ణం.

**పతకాల పట్టికలో 10వ స్థానం..**

2026 ఆసియా క్రీడల్లో ఇప్పటివరకు నాలుగు స్వర్ణాలతో భారత్ పతకాల పట్టికలో 10వ స్థానంలో నిలిచింది. 11 రజతాలు, 13 కాంస్యాలతో కలిపి మొత్తం 28 పతకాలను సొంతం చేసుకుంది. మహిళల క్రికెట్ ఫైనల్లో హర్మన్ ప్రీత్ సేన అద్భుత విజయంతో తొలి స్వర్ణాన్ని దక్కించుకోగా.. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్డ్ టీమ్ ఈవెంట్లో సురుచి సింగ్, కమల్జీత్ జంట శుక్రవారం పసిడి సొంతం చేసుకున్నారు. ఇక, శనివారం కబడ్డీలో రెండు స్వర్ణాలు వచ్చాయి. 2022 ఆసియా క్రీడల్లో భారత్కు మొత్తం 106 పతకాలు వచ్చాయి. వాటిలో 28 గోల్డ్మెడల్స్. ఈసారి భారత్ నాలుగో స్థానంలో నిలవగా.. చైనా తొలి స్థానంలో నిలిచింది.



## అందం ఉన్నా అదృష్టం లేదు..



సినిమా ఇండస్ట్రీలో టాలెంట్ తో పాటు టైమింగ్, సరైన సినిమా, ఆ సినిమా ఫలితం కూడా కెరీర్ ను ప్రభావితం చేస్తుంటాయి. కొందరు నటీనటులకు మంచి అవకాశాలు వరుసగా వచ్చినా.. వాటిని విజయాలుగా మలుచుకోవడానికి మాత్రం చాలా సమయం పడుతుంది. ఇప్పుడు యంగ్ హీరోయిన్ కయాదు లోహర్ పరిస్థితి కూడా దాదాపు ఇలానే కనిపిస్తోంది. అందం, అభినయం ఉన్న ఈ భామకు అవకాశాలు మాత్రం బాగానే వస్తున్నాయి. కానీ ఆమె ఖాతాలో మాత్రం ఆశించిన స్థాయిలో విజయాలు చేరడం లేదు.

**'అల్లూరి'తో టాలీవుడ్ ఎంట్రీ..**

కయాదు లోహర్ తెలుగులో తొలిసారి శ్రీ విష్ణు హీరోగా నటించిన 'అల్లూరి' సినిమాతో పరిచయమైంది. 2022లో వచ్చిన ఈ చిత్రంలో ఆమె సంధ్య పాత్రలో కనిపించింది. మంచి నటనతో ఆకట్టుకునే ప్రయత్నం చేసినా.. సినిమా మాత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. దీంతో టాలీవుడ్లో కయాదు తొలి అడుగే విజయాన్ని అందించలేకపోయింది.

ఆ తర్వాత కయాదు ఇతర భాషలపై దృష్టి పెట్టింది. ముఖ్యంగా తమిళంలో 'డ్రాగన్' సినిమాతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. ఈ సినిమా తెలుగులోనూ విడుదలై ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. దాంతో కయాదుకు దక్షిణాదిలో వరుస అవకాశాలు రావడం మొదలైంది.

**విశ్వక్ సేన్ తో 'ఫంకీ'..**

ఆ గుర్తింపుతోనే టాలీవుడ్లో మరో మంచి అవకాశం దక్కింది. విశ్వక్సేన్ హీరోగా అనుదీప్ కేవీ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఫంకీ'లో కయాదు హీరోయిన్గా నటించింది. ఈ సినిమాలో ఆమె చిత్ర పాత్రలో కనిపించింది. తెరపై కయాదు అందంగా కనిపించడంతో పాటు సహజమైన నటనతో ఆకట్టుకుందని రివ్యూల్లోనూ ప్రస్తావనలు వచ్చాయి.

అయితే సినిమా మాత్రం ప్రేక్షకులను పూర్తిగా మెప్పించలేకపోయింది. నెగెటివ్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. దీంతో కయాదు ఖాతాలో తెలుగులో రెండో సినిమా కూడా విజయాన్ని నమోదు చేయలేకపోయింది.

**'ది ప్యారడైజ్'పై భారీ ఆశలు..**

ఇక కయాదు కెరీర్లో మరో కీలక అవకాశం 'ది ప్యారడైజ్'. నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ఆమె సుబ్బలక్ష్మి అలియాస్ సుబ్బు పాత్రలో కనిపించింది. తన గత పాత్రలకు పూర్తి భిన్నంగా, కథలో కీలకమైన పాత్ర లభించిందని కయాదు స్వయంగా చెప్పింది. ఈ సినిమా తన కెరీర్లోనే అతిపెద్ద ప్రాజెక్ట్ అని కూడా పేర్కొంది.

సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ది ప్యారడైజ్'కు మిశ్రమ స్పందన లభించింది. దీంతో కయాదు తెలుగులో నటించిన మూడు సినిమాల్లోనూ విజయం ఆమెకు దూరంగానే నిలిచింది. 'అల్లూరి', 'ఫంకీ' తర్వాత 'ది ప్యారడైజ్' కూడా ఆశించిన స్థాయిలో టాక్ తెచ్చుకోకపోవడంతో.. కయాదుకు కలిసి రావడం లేదనే చర్చ మొదలైంది.

ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. వరుస పరాజయాలు ఉన్నప్పటికీ కయాదుకు అవకాశాలు మాత్రం తగ్గడం లేదు. ప్రస్తుతం తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో పలు సినిమాలు ఆమె చేతిలో ఉన్నాయి. 'ది ప్యారడైజ్'తో పాటు తమిళంలో మారి సెల్వరాజ్ ప్రాజెక్ట్, సూర్యతో ఓ సినిమా సహా పలు ప్రాజెక్టుల్లో ఆమె భాగమవుతోంది.

అంటే కయాదు విషయంలో టాలెంట్ లేదని కాదు.. అవకాశాలు రావడం లేదని కూడా కాదు. మంచి పాత్రలు దక్కుతున్నాయి. గుర్తింపు తెచ్చుకునే సినిమాల్లో నటిస్తోంది. కానీ ఆమె నటించిన సినిమాలు వరుసగా విజయం సాధించకపోవడమే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.

అందం ఉంది.. అభినయం ఉంది.. అవకాశాలు కూడా ఉన్నాయి.. ఇక అదృష్టం కలిసొచ్చే ఆ ఒక్క హిట్ కోసం కయాదు ఎదురుచూస్తోంది. ఆ విజయం ఎప్పుడు వస్తుందో.. అదే ఆమె టాలీవుడ్ కెరీర్కు కీలక మలుపుగా మారొచ్చు.

## సంక్రాంతి మనదే.. 'కాకా' అప్ డేట్ పంచుకున్న చిరంజీవి



కదిరి కాళిదాస్గా 'కాకా'తో సందడి చేయనున్నారు కథానాయకుడు చిరంజీవి. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ సినిమాను బాబీ తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. అనస్వర రాజన్, నివేదా పేతురాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా అప్ డేట్ ను చిరంజీవి పంచుకున్నారు. 'సిగ్మా' ప్రీరిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన చిరు.. 'కాకా' గురించి మాట్లాడారు.

''సినిమా ఫస్ట్ హాఫ్ పూర్తయింది. సెకండ్ హాఫ్ కూడా 30 శాతం అయిపోయింది. ఫస్టాఫ్కు తమన్ బ్యాక్గ్రౌండ్ మ్యూజిక్ పనుల్లో బిజీగా ఉన్నారు. కచ్చితంగా ఈ సంక్రాంతికి వస్తున్నాం. పండగ మనదే'' అని చిరు అన్నారు. దీంతో జనవరి 13న ఈ సినిమా విడుదల ఖాయమని మరోసారి స్పష్టమైంది. అటు 'కాకా' టీమ్ ఫుల్ జోష్లో ఉంది. ఒకవైపు షూటింగ్ చేస్తూనే డబ్బింగ్ పనులు కూడా మొదలు పెట్టింది. ఈ విషయాన్ని తెలుపుతూ టీమ్ ఓ వీడియోను కూడా షేర్ చేసింది.

**2027 సంక్రాంతి సినిమాలివే..**

వచ్చే ఏడాది పెద్ద పండగకు అగ్ర హీరోల సినిమాలు బాక్సాఫీస్ వద్ద పోటీపడనున్నాయి. ఇప్పటికే చిరంజీవి 'కాకా' విడుదల ఖరారైంది. ఇక సంక్రాంతికి వచ్చి హిట్ కొట్టే దర్శకుడు అనిల్ రావిపూడి ఈసారి పండగకు 'జనవరి 12న విడుదల'తో రానున్నారు. వెంకటేశ్, కల్యాణ్ రామ్ హీరోలుగా కీర్తి సురేశ్, కృతి శెట్టి కథానాయికలుగా తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇక మరో అగ్రకథానాయకుడు రజనీకాంత్ నటిస్తోన్న 'ధర్మన్' కూడా సంక్రాంతికే రానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. వీటితో పాటు శర్వానంద్ 'జార్జ్ క్రిష్', సాయిదుర్గా తేజ్ 'సంబరాల ఏటి గట్టు', శ్రియారెడ్డి, అక్షయ్ ఖన్నా నటిస్తోన్న 'మహాకాళి' కూడా సంక్రాంతి బరిలో నిలవనున్నాయి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.